
ఆణిముత్యాలు
1999
కస్తూరి బెహెన్


ఆణిముత్యాలు
1999
కస్తూరి బెహెన్

వ్యక్తిగత వినియోగం కొరకు మాత్రమే

సిస్టర్ కస్తూరీగారి తెలుగు పుస్తకాల కొరకు

కె. రామదాస్ – **9440652774**

కె. సుదర్శన్ – **9247805058** లేదా

**9063177540**

సంప్రదించగలరు.

# ఆణిముత్యాలు

**1999**

కస్తూరి బెహన్

# ఆణిముత్యాలు 1999

**కస్తూరి బెహన్**

దేశవిదేశాల్లోని పలువురు సహజమార్గ సాధకులు కస్తూరి బెహెన్‌ను లక్నోలో దర్శించినపుడు – బాబూజీ వారి సమ్ముఖంలో తమ అనుభవాలను, బాబూజీ చెప్పిన ఎన్నెన్నో సూచనలను సోదరి ఎంతో సంతోషంతో, కృపతో విడమర్చి చెప్పారు. వాటిని ఈ పేజిల్లో అందించే ప్రయత్నం చేశాం.

ఇందులో దొర్లిన తప్పులు, అన్వయ దోషాలు మావి. ఉదాత్త హృదయులు, కృపా సముద్రులు శ్రీ బాబూజీ మహరాజ్ వారి దివ్య ఆశీస్సులను అర్థిస్తూ...............

19-12-1999

**మీ ప్రియ అభ్యాసీ సోదరులు**

# ఆణిముత్యాలు - 1999

భగవంతుని కోసం ఆరాధన చేస్తారు. కాని అది సాధన కాదు. దివ్యకాంతిని దృష్టిలో పెట్టుకోకుండా ఏది చేసినా అది ఆరాధన మాత్రమే కాని సాధన కాదు. భగవత్ సాక్షాత్కారం కొరకు ఏది చేస్తారో అది సాధన. సహజమార్గం యొక్క సాధనలో తపం ఉంది. దానికి తయారు కావటంలో ప్రాణాహుతి, దివ్యకాంతి, లక్ష్యము, ఆరాధన అన్నీ తోడవుతాయి. అందులో కష్టం ఉన్నా, సుఖం ఉన్నా మనం చేసే ప్రయత్నంలో బ్యాలన్స్ అనగా సమతుల్యం ఉండాలి. మైండ్ (మనస్సు) ను సమతుల్యం (Balanced) గా ఉంచుకోవటం కష్టం. అయినా ఇది సహజమార్గంలో ప్రవేశించిన మొదటి రోజు నుంచే అలవడుతుందని **శ్రీ బాబూజీ మహరాజ్** చెప్పారు. ఎందుకంటే, మనకు వచ్చే ట్రాన్స్‌మిషన్‌లో బ్యాలన్స్ ఉంది. అందులోనే లయలీనములూ ఉన్నాయి. ఆ ట్రాన్స్‌మిషన్ ద్వారానే బ్యాలన్స్, భక్తి అన్నీ వస్తాయి. దాని వలన రెండింతల లాభం ఉంది. ప్రిసెప్టర్, ఏ అభ్యాసి అయినా వీటిని పొందేటట్లు చేస్తారు. ఒకవేళ ప్రిసెప్టర్ ట్రాన్స్‌మిషన్ ఇచ్చేప్పుడు ఆలస్యం జరిగినా, నెమ్మదిగా ఉన్నా బాబూజీ మహరాజ్‌కు ఆలోచన (థాట్) కలిగించినట్లయితే అప్పుడు ట్రాన్స్‌మిషన్ గాఢంగా ఎక్కువగాను, త్వరితంగాను వస్తుంది. అందుకే ఇటువంటి సత్ఫలితం కలిగించాలంటే ప్రిసెప్టర్‌కు భక్తి (డివోషన్) బాగా అవసరం అంటారు. అందుకనే బాబూజీ మహరాజ్ ఎవ్వరినైనా ప్రిసెప్టర్ చేయాలంటే భక్తి, తత్పరతలో ఒక స్థాయికి వచ్చాకనే ప్రిసెప్టర్‌గా చేస్తారు. ఆ స్థాయికి చేరుకున్న తర్వాతనే అభ్యాసి మరొకరికి ప్రాణాహుతి ఇవ్వగల్గుతారు. అందుకనే ఒక నియమిత స్థాయికి చెందకుండా ఉన్నవారి నెవ్వరినీ ప్రిసెప్టర్‌గా చేయరు. భక్తి అనేది

బాగా ఉంటే (Drown yourself) నీవు దానిలో మునిగిపోవటమనేది దానంతట అదే జరిగిపోతుంది. ఒకవేళ అభ్యాసి సహాయం కొరకు వేచి ఉంటే, తన భక్తిలో మునిగి ఉన్న ప్రిసెప్టర్ అతనికి సహాయపడవచ్చు.

బాబూజీ మహరాజ్ పరిశోధన చేసిన దానిని మనం ఆచరణ ద్వారా అభ్యసించి చూడాలి. ఏ కండిషన్ ఎలా ఉంటుందో స్వయంగా తెలుసుకోవాలి. ఉదయం నుంచే నాలో ఇదే ఆలోచన కలుగుతోంది. ఏమంటే, ప్రతి సంస్థలోను కొన్ని ఆదేశాలు ఉన్నట్లే మన సంస్థలోనూ దశ నియమాలు ఉన్నాయి. ఇతర సంస్థల్లో వాటిని విధిగా ఆచరించాల్సి ఉంటుంది. కాని బాబూజీ పది నియమాలను విధిగా పాటించమని చెప్పలేదు. ఎందుకంటే సహజమార్గంలో సాధన చేస్తున్న అభ్యాసి తాను ప్రోగ్రెస్ అవుతున్న కొద్దీ తాను ఎంతవరకు వెళ్ళిందీ, ఏమి సాధించిందీ అంచనా వేసుకుంటూ ఉంటాడు. ఆధ్యాత్మికతలో మునిగిన కొద్దీ ఈ దశనియమాలు వాటంతట అవే ఆచరించబడతాయి. A పాయింట్ B పాయింట్ ఉన్నాయి. అలానే ప్రతి పాయింట్‌కూ ఒక ప్రత్యేక ప్రయోజనం ఉంది. ప్రతి పాయింట్‌కు ఒక లక్ష్యము, ఒక ప్రాప్తమూ ఉన్నాయి. బాబూజీ, హృదయంలోని దివ్యకాంతిలో మునిగి దైవాన్ని శోధించి దర్శించమన్నారు. ఒకవేళ అభ్యాసి ప్రవర్తనలో చాలా చెడు గనుక ఉంటే, B పాయింట్‌లోని ఉజ్వలత్వాన్ని తీసుకొని దానిపైన ధ్యానం చేసినట్లయితే సరిదిద్దబడుతుంది అని అన్నారు. ఒక్కొక్క పాయింట్‌లోని శక్తితో చెడు బీజాలను భస్మం చేయవచ్చు అని చెప్పారు. భక్తమీరా, తులసీదాసు, సూరదాసు మొదలైన వారందరూ ఒక్కొక్క పాయింట్ మీద కృషి చేశారు. ఒక్కొక్క పాయింట్ ఎక్కడ మొదలుపెట్టి ఎలా వెళ్ళాలో, దానిని ఎలా ముగించుకొని ముందుకు

ఎలా పోవాలో అన్నీ ప్రాక్టికల్‌గా చూపించారు. పిండ దేశాన్ని మీరు ఎప్పుడు దాటగలరు? మిమ్మల్ని మీరు మరచిపోయినపుడు. అప్పుడు మీ అంతట మీరు దాటగలరా! లేదు. బాబూజీ యొక్క కృపతో 'వారు' దాటించటం ద్వారానే దాటగల్గుతారు. సహజమార్గ సిస్టమ్ అనేది కేవలం భక్తిలో మునిగి ఉన్నటువంటిదే కాని మరేమీ కాదు. అలాగే క్లీనింగ్ మీద కూడా ఎక్కువ వత్తిడి చేయలేదు. డివోషన్‌లో లగ్నమై ఉంటే ఆలోచనలు తొలగిపోయినట్లే. క్లీనింగ్ కూడా అవుతుంది. స్థూలత్వం (grossness) తగ్గిపోతుంది. వీటి అన్నింటినీ దృష్టిలో పెట్టుకొని క్లీనింగ్ అంటే కడుపునొప్పి, కాలునొప్పి కూడా తగ్గిపోతాయి అని భావించుకోకూడదు. దీని వలన మానసిక మాలిన్యం తొలగిపోతుంది. మానసిక రుగ్మత అనగా బాధ నివారణ అవుతుంది. శారీరక బాధలకు డాక్టర్స్ ఉన్నారు కదా! బాబూజీ ఛలోక్తిగా "దీని వలన ఆ బాధలు కూడా తగ్గిపోతే డాక్టర్లు ఏమైపోతారు" అని అన్నారు. జనం ఏ విషయాన్ని ఎలా వాడుకోవాలో అర్థం చేసుకోలేక పోతున్నారు.

**పుస్తకాలు మనలో చక్రాలు ఉన్నాయని చెబుతున్నాయి. దాని అర్థం ఏమిటి?** దైవం మనిషిని పరిపూర్ణంగా తయారుచేశాడు. మనస్సు ఇచ్చాడు, షట్‌చక్రాలు ఉన్నాయి. హఠయోగంలో వాటిని ఒకదాని తరువాత ఒకటి దాటాలి అంటారు. మన సహజమార్గంలో సాక్షాత్కారం కోసం ప్రయత్నిస్తే ఆ చక్రాలన్నీ మన స్వాధీనంలో ఉంటాయి. ఒక్కొక్క చక్రంలోను ఒక్కొక్క రకమైన శక్తి ఉంటుంది. అందుకని ముందుగా వాటిని గురించి తెలుసుకోవాలి. తర్వాత కావలసిన శక్తిని పొందాలి. రెండు అడుగులు వేస్తే పది అడుగులు వేసినట్లు ఉంటుంది అంటే అది వాటి శక్తి వల్లనే.

బాబూజీ వ్రాశారు, "దైవం అంటే అవును (Yes) కాదు (No) కు మధ్యన ఉన్నాడు" అని. అది ఒక స్థితి. సాధన చేసినట్లయితే లోపల దైవం ఉన్నాడని, మీరు అంటున్నారు. ఎప్పుడైతే సాధనలో బాబూజీ మహరాజ్ తప్ప మరేదీ దృష్టిలోకి రాదో అప్పుడు మీ అంతరంగంలో మీరు లేరు. మీరు అను స్పృహ మీకు లేనప్పుడు, బాబూజీ మీకు ఏమేమి (స్థితులు) చూపిస్తున్నారో (నేర్పుతున్నారో) మీరు చూస్తూనే ఉన్నారు. మీరు లేకపోవటానికి, బాబూజీ మీకు కనిపిస్తూ ఉండటానికి మధ్య ఉన్నదే దైవం. అదే ఈశ్వరుడని తెలుస్తుంది. ఆ స్థితిలో, ఎవ్వరైనా ఈశ్వరుడు అని తలుచుకుంటూ ఉండినట్లయితే అది మీ గురించే అనుకుంటున్నట్లు తోస్తుంది. అందువలన ఎవ్వరైనా తనను గురించి తెలుసుకోకుండా ఇటువంటి ప్రశ్నలు వేయకూడదు.

ఒక అభ్యాసిలో ఒక రకమైన కండిషన్ (స్థితి) ఉంటుంది. మరో అభ్యాసిలో మరో రకమైన స్థితి ఉంటుంది. ఎవరికి ఏది అవసరమో దానిని అందిస్తూ, వారికి కావలసిన సలహాలు ఇవ్వటం, శక్తిని సమకూర్చటం, వారి సమస్యలు పరిష్కరించటానికి ప్రయత్నిస్తూ ఉండటమే మన సహజమార్గ విధానంలో బాబూజీ తమ కర్తవ్యంగా నిర్వహించారు.

ప్రిసెప్టర్‌లో పరిపక్వత ఉండాలి. ఆ పరిపక్వత లేకుండా బాబూజీ ఎవ్వరినీ ప్రిసెప్టర్‌గా చేసేవారు కాదు. అది ధ్యానం వలన, భక్తి వలన వస్తుంది. వాటిలో దీక్ష ఉంటే ఆ ధ్యానంలో విషయాలు తెలుస్తాయి. సహజమార్గ సిస్టమ్ యొక్క పరిజ్ఞానం తెలుస్తుంది.

ప్రపంచంలో ఎక్కడికి వెళ్ళినా ఉండేది ఒక్కటే ప్రశ్న అది 'ఐ' (I). అది పోవాలంటే దానికి జవాబు 'యు' (U)లో 'ఐ' (I)ని

కలిపివేయటమే. జవాబు అక్కడి నుంచే వస్తుంది. 'ఐ' (I) ని 'యు' (U)లో ఎలా కలిపివేయాలనే ప్రశ్న రావచ్చు. అదే సాధన అవుతుంది. అనగా సాధనవల్లనే అది జరుగుతుంది.

ప్రసాద్‌జీ చాలా కష్టపడి గతంలోని వ్యాసాలు, కథలు సంగ్రహించారు. అవి పత్రికల్లో ప్రచురించబడ్డాయి. బాబూజీ అంటూ ఉండేవారు, "వ్రాసేవాళ్ళు ఎవరూ కనిపించటంలేదు, నీవు వ్రాయి" అని. 'వారి' బలవంతం మీద వ్రాశాను. ఆద్‌మీ (మనిషి) అనే పేరుతోను, అలాగే ఇతర పేర్లతోనూ వ్రాశాను. అది ఎవ్వరో తెలుసుకోవాలని అందురూ అడిగేవారు. బాబూజీ ఆ విధంగా పద్ధతులు నేర్పేవారు. విధులు అన్నీ సహజమార్గ విధానంలో వ్రాశారు. మనిషిని మార్పు చేయటమే ఈ విధానం. గొంగళిపురుగు గూడు కట్టుకొని అందులో కొంతకాలం నిద్రపోయి సీతాకోకచిలుకగా మారినట్లే మానవుడు ధ్యానం, భక్తిలో మునిగి ఉండి సాధారణ జీవి నుంచి ఆధ్యాత్మిక జీవిగా రూపాంతరం చెందాలి.

బాబూజీ మాటలు ఎంత చమత్కారంగా ఉంటాయో చూడండి. **ఫీలింగ్ ఆఫ్ నియర్‌నెస్ అనగా సామీప్యత యొక్క అనుభూతి ఎలా కలుగుతుంది** అనే దానికి 'వారు' సులభంగా చెప్పింది ఏమంటే డివైన్ లైట్ అనగా దివ్యకాంతి ఉందనుకొని అందులోనే మునిగిపోండి. (డ్రౌన్ యువర్‌సెల్ఫ్ ఇన్ డివైన్ లైట్) అలా మునిగి డివైన్ అనగా దైవం కోసం వెదకండి. ఆ ప్రయత్నంలో మీకు సామీప్యత అనుభవమవుతుంది. దానితోపాటే సబ్‌మిషన్ అనగా అర్పించుకోవటం (ఆత్మ నివేదన) జరిగిపోతుంది.

ప్రజలు అనేక రకాలుగా ఉంటారు. ఒక అభ్యాసి వచ్చాడు. అతను చెప్పింది ఏమిటింటే, "నాకు మద్రాసు ట్రాన్స్‌ఫర్ అయ్యింది.

‘2000వ సంవత్సరంలో చాలా వినాశం జరుగుతుంది’ అని అన్నారు, అందుకని ఇక్కడకు వచ్చాను” అని అన్నాడు. బాబూజీ ఇప్పుడు వినాశం జరుగనుందని వ్రాసిన దానికి అతనిలో భయం కలిగి ఆ విధంగా స్పందించాడు. నేను అప్పుడు అతనితో, కష్టపడి వారి దగ్గరకు వెళ్ళు, వ్రాసింది వారే కనుక వారే చెబుతారని అన్నాను. బాబూజీ ఇటువంటి సంఘటనలు అన్ని కాలం యొక్క చరిత్ర అనగా కాలగతి అంటూ ఉంటారు.

ఒక అభ్యాసి అక్కడి నుండియే వచ్చి ఫోన్ చేశాడు. అతని కుమార్తె ప్రేమ వివాహం చేసుకుంటోంది, పెండ్లి చేసుకోవటానికి కుర్రవాడు ఇష్టపడుతున్నాడు. కాని ఏమవుతుందోనని ఆందోళనగా ఉందన్నాడు. మనసులో ప్రేమ ఉన్నప్పుడు అది సఖ్యతగానే ఉండేట్లు చేస్తుంది. అలా కాకుండా భయానికి గురైతే ఏదో ఒకటి జరుగుతుంది. ఏమి చేయాలో సలహా చెప్పండి అని అడిగితే, మీరు, భగవానుడు, మాస్టర్ అనుకుంటున్న వారినే వెళ్ళి సలహా అడగండి అన్నాను. ఈ విధంగా భయాందోళనకు గురవుతూ ఉంటారు, కాని విశ్వాసం పెంచుకోరు.

బాబూజీ మహరాజ్ వద్ద ఎంతమంది అభ్యాసులు ఉన్నారో అందరిలోనూ ‘వారి’ మీద విశ్వాసం ఉంది. అటాచ్‌మింట్ అనగా అనుబంధం ఉంది. బాబూజీ మనల్ని తయారుచేశారు. మనకు ‘వారి’ మీద పూర్తి విశ్వాసం ఉంది. ప్రేమ ఉంటే ప్రవర్తనలోనూ, మాటల్లోనూ, వ్యవహారంలోనూ అది కనిపిస్తూ ఉంటుంది. అందరిలోనూ ప్రేమ ఉండాలి, అప్పుడే సమాజం వికసిస్తుంది, అందరూ బాగుంటారు.

నేను చెప్పదలచుకుంది ఏమిటంటే, ఆధ్యాత్మికత తరిగి (అంతరించి) పోకూడదని. మన అనుచరులు ఉన్నారంటే వారందరికీ ఆధ్యాత్మికంగా సంతృప్తి కలిగించాలి. భగవాన్ బుద్ధుడు తన శిష్యులందరి సంస్కారాలను తొలగించాడు. వారిలో దైవాన్ని ప్రవేశపెట్టాడు. మనం అందరం బాబూజీ అభ్యాసులుగా ఉన్నామంటే మనల్ని 'వారు' ఉన్నతికి తీసుకొని వెళ్ళుతున్నారు. మనం వారికి సహకరిస్తున్నాము. ఇటువంటి వాస్తవాలు చెబితే జనానికి కోపం వస్తుంది. బాబూజీ లాలాజీ పేరుతో శ్రీరామచంద్ర మిషన్ స్థాపించారు. బాబూజీ సహజమార్గ విధానం ప్రవేశపెట్టారు. వారిది పూర్తిగా ఆధ్యాత్మికతకు సంబంధించినది. ఇది 'వారు' వ్రాసిన పుస్తకాల్లో ఉంది కూడా.

భగవాన్ అనేది కూడా ఒక పదవి అని బాబూజీ చెప్పారు. ఆ పదవి పొందాలంటే ఒక స్థాయికి చేరాలి. ఆ స్థాయి హిరణ్యగర్భ మండలానికి, గాడ్లీ రీజియన్ అనగా దైవమండలానికి మధ్య ఉంటుంది. హిరణ్యగర్భ మండలం అంటే ప్రకృతిని దాటినట్లు. అక్కడి నుంచి గాడ్లీ రీజియన్ లోపలికి చేరుకోగల్గినట్లయితే ఆ దైవ పదవి అనే అదృష్టం పండినట్లే. ఇది చిత్రంలో చూపించబడింది. ఇద్దరు మనుష్యులు ఒకే విధంగా సరితూగలేరు. వారు అందరూ గొప్పవారు. కాని బాబూజీ నన్ను ఎలా తయారుచేశారో నాకు తెలియదు.

ఇంటి పనులు చేసుకుంటున్నా, వంట వండుతున్నా మన నిరంతర స్మరణకు ఆటంకం కలగవచ్చు. కాని అదే భావంలో (మూడ్) ఉన్నట్లయితే నిరంతర స్మరణ జరుగుతున్నట్లే. కాని ధ్యాస మాత్రం పని మీదికి మళ్ళుతుంది. ఎక్కువగా ఆలోచించటం వలన హృదయం (దిల్) అలిసిపోతుంది. ఆలోచించకుండా హృదయంలో కలిగిన దానిని ఉన్నది ఉన్నట్లుగా చేస్తే ఎక్కువ ఫలితం ఉంటుంది.

బాబూజీ, ఎవ్వరైనా అభ్యాసికి ఉదయం 6 గంటలకు సిట్టింగ్‌లో కూర్చోమని చెప్పి ఉంటే ఖచ్చితంగా అదే టైముకు ట్రాన్స్‌మిషన్ ఇచ్చేవారు. అభ్యాసి టైము వృధా కాకుండా ఉండాలని 'వారు' ఆ విధంగా సమయపాలన చేసేవారు.

**ప్రశ్న: మన సిస్టమ్‌లో కాని, ఇతరత్రాగాని ఉన్నత స్థాయికి ఎదిగిన వ్యక్తి, క్రమంగా సామాన్య మానవుని స్థాయికి ఎందుకు దిగజారతాడు?**

**జవాబు:** ఆ వ్యక్తి అతను ఎదిగిన స్థాయి నుండి తొలగించి వేయబడినట్లు అవుతుంది. అప్పుడు అతడు సామాన్య మానవుడి స్థాయికి దిగజారి అతని వ్యవహారంలోను, మాటల్లోనూ మామూలు స్థాయికి చెందినట్లుగానే ఉంటుంది గాని, అతనిలో దివ్య ఆలోచనలు రావు. కాని ఎవ్వరైనా నిరంతరం ఒక దివ్య వ్యక్తితో (డివైన్ పర్సనాలిటి) సంబంధం కలిగి ఉంటే, దిగువ స్థాయికి దిగజారే అవకాశం ఉండదు. అనగా వారి స్థాయి నుంచి పతనం చెందటం సంభవించదు.

ఒక డివైన్ పర్సనాలిటీకి (దివ్యాత్మునికి) ఒక వ్యక్తిని దిగువస్థాయి నుంచి ఉన్నతస్థాయికి తీసుకొని వెళ్ళటం చాలా తేలిక. కాని ఒకసారి ఉన్నతస్థాయి నుంచి పతనం చెంది దిగువస్థాయికి వచ్చిన వ్యక్తిని మళ్ళీ ఉన్నతస్థాయికి చేర్చటం దుర్లభం. అతను ఏమాత్రమైనా డివైన్ పర్సనాలిటీస్‌తో సంబంధం కలిగి ఉంటూ ఉంటే పతనం చెందే అవకాశము ఉండదు. సామాన్య వ్యక్తి అంటే సిస్టమ్‌కు చెందని వాడు, తన మనస్సుతో భౌతికంగా ఆలోచించే వాడుగా భావించాలి.

అసామాన్యుడు లేదా అసాధారణమైన వ్యక్తి అంటే తన అంతర్దృష్టితో దైవాన్ని సందర్శించ గల్గేవాడు; సామాన్య వ్యక్తి అంటే

అంతర్‌దృష్టి లేకుండా తన కోర్కెతో భౌతికమైన దృష్టితో వ్యవహరించే వాడు అని బాబూజీ చెప్పారు.

బాబూజీని **"మాయ అంటే ఏమిటి, ఈశ్వరుడు అంటే ఏమిటి?"** అని అడిగితే "నీవు అనుకుంటే మాయ, డివైన్ అనుకుంటే దైవం" అని అన్నారు. అలాగే "కళ్ళు తెరచి భౌతిక దృష్టితో చూస్తే మాయ, కళ్ళుమూసి అంతర్‌దృష్టితో చూస్తే దైవం" అని వివరించారు.

**ప్రశ్న: ధ్యానంలో ఉండగా ఒక అభ్యాసికి భౌతిక ప్రపంచంతో అన్ని సంబంధాలు తెగిపోయినట్లు, దేనిలోనూ ఆసక్తి లేక విముక్తి చెందినట్లు భావం కలిగితే, అది సాక్షాత్కారానికి దారి తీస్తున్నట్లా? లేదా శూన్యంలో తిరుగుతున్నట్లా?**

**జవాబు:** దానిని లిబరేషన్ అనగా ముక్తి పొందినట్లు అనుకోవటానికి వీల్లేదు. లిబరేషన్ పొందినవారు మళ్ళీ క్రిందికి దిగిరారు. మెడిటేషన్‌లో అలా అనిపించినా అదీ నిజం కాదు. బాబూజీ మహరాజ్ వెంట మీరు వెళ్ళినట్లు అనిపించనంత వరకూ మీకు లిబరేషన్ అయినట్లుకాదు. అంతేకాకుండా విస్మృతావస్థ అనగా మరపు స్థితి (forgetfulness condition) కలిగినట్లు అనిపించితే అందులో అభ్యాసికి ఆలోచనలు రావు. అటువంటి మరపు స్థితిలో అభ్యాసి ఎప్పుడూ బాబూజీ మహరాజ్‌తోనే ఉండటం జరుగుతుంది. ఆ అనుభూతి కూడా లేదు కనుక దానిని లిబరేషన్ అనుకోవటానికి వీలులేదు. అన్ని సంబంధాలు తెగిపోయినట్లు, శూన్యంలో ఉండి పోయినట్లు ఆలోచనలు కలిగినపుడు, దైవానికి దూరంగా ఉండి పోయినట్లు అనిపించినపుడు బాబూజీని జ్ఞాపకం చేసుకోవాలి.

**ప్రశ్న: ధ్యానంలో ఉన్నప్పుడు ఏవో ఆకారాలు కనిపిస్తున్నట్లుగా ఉంటుంది. అవి లిబరేటేడ్ సోల్స్ అనగా ముక్తాత్మలకు చెందినవి అవుతాయా?**

**జవాబు:** ముక్తాత్మలు ఏవైనా సరే దివ్య వ్యక్తుల (డివైన్ పర్సనాలిటీస్) వైపుకు వెళ్తాయే కాని అభ్యాసీలవైపుకు రావు.

బాబూజీతో ఒక అభ్యాసి తాను గుడికి వెళ్ళినప్పుడు "ఆ విగ్రహాలలో కూడా బాబూజీయే ఉన్నట్లు భావిస్తాను" అని చెప్పినపుడు, అలా విగ్రహాలలో తనను ఇరికించవద్దని (బంధించవద్దని), తనను చూడాలనుకుంటే వేరుగా చూడమని చెప్పారు.

ఒకసారి బాబూజీ ఉన్నచోట షాజహాన్‌పూర్‌లో వరద వచ్చింది. సామానంతా బయట పెట్టాలేమో అన్నంతగా వచ్చింది. ఈ వరద సంగతి ముందుగా తెలుసుకోవటానికి పత్రికల్లో వార్త కూడా రాలేదు. అదేమంత పెద్ద విషయం కాదని మేము భయపడలేదు. ఇంతలో ఈశ్వర్‌సహాయ్ గారు లఖిమ్‌పుర్ నుంచి వచ్చారు. వరద చాలా ఎక్కువగా ఉందని చెప్పి పరిశీలించటానికి బయల్దేరారు. మేము కూడా బయల్దేరాం. అపుడు ఈశ్వరసహాయ్ గారితో బాబూజీ ఏమన్నారంటే, "ఇప్పుడు గ్రామస్థులకు ఆలోచించేందుకు సమయం కూడా లేదు. ఈ సమయంలో వారిచేత నీవు చేయించవలసిన పనులు ఉన్నాయి. అందుచేత నేను నీ మీద పని చేస్తున్నాను. నీవు ఏమీ చదవటం లేదు. పట్టించుకోవడంలేదు. అందుచేత నా నుంచి వచ్చిన ప్రవాహం అంతా ఇలా పొంగి పోతోంది" అని అన్నారు. ఇటువంటి సందర్భాలలో కూడా వారు మనల్ని చైతన్యపరుస్తారు.

ఆలోచనల వెంట శక్తి (థాట్ పవర్) ఉంటుంది. అవి తక్కువగా ఉంటే శక్తి తక్కువగాను, తీవ్రంగా ఉంటే శక్తి ఎక్కువగాను ఉంటుంది. అందుచేత ఆలోచనల్ని పరిమితం చేసే శక్తి కూడా

పరిమితంగా విడుదల అవుతుంది. ఒక అభ్యాసి, ''నేను ఉద్ధరించబడాలి, నేను ఉద్ధరించబడాలి" అని పదే పదే ఆలోచన చేస్తుంటే, అందుకొరకు వచ్చే శక్తి మాత్రం అతని కొరకే కాకుండా మిగిలిన అభ్యాసులకు కూడా వర్తిస్తుంది. ఈ విషయంలో ఆ శక్తికి పరిమితం (limit) లేదు. అందరికీ ప్రయోజనం కలిగిస్తుంది. అందుకనే అలౌకిక దృష్టి ఉన్న వాళ్ళు 'నా', 'నీ'కి బదులుగా 'మన' అని ఉపయోగిస్తారు. అలాగే 'నేను', 'నీవు'కు బదులుగా 'మనం' అని ప్రయోగిస్తారు. ధ్యానంలో వచ్చిన శక్తి ఒక అభ్యాసికి అతని స్థితినిబట్టి తక్కువైనా మిగిలిన అభ్యాసులు అందరికీ అది లాభిస్తుంది.

శక్తిని దుర్వినియోగం చేస్తే అది బలహీనపడిపోతుంది. అలా జరిగినట్లు మీకు తెలిస్తే దైవశక్తి దుర్వినియోగమైనట్లు గ్రహించాలి. అలా చేస్తే మనసు దిగజారిపోతుంది. కాని మనస్సును దైవానికి కలిపితే (అనుబంధం కలిగిస్తే) ఇంకా పవర్ వస్తుంది. షట్చక్రాల్లో పవర్ ఉంటుంది. మన సాధనలో అవి తెరవబడి శక్తిని ఇస్తాయి. ఆ శక్తిని వృధా చేస్తే అవి బలహీనపడి మూసుకుపోతాయి.

బాబూజీ, "నేను శక్తిని ఇవ్వటమే కాని, తీసుకోవటం నా పని కాదు" అని అంటారు.

ప్రిసెప్టర్‌కు తన శక్తి మీద నమ్మకం కుదరకపోతే, దాని అర్థం అతను సాధనకు దూరంగా ఉన్నాడన్న మాట. సాధన ద్వారా బాబూజీతో సంబంధం ఎక్కువ కలిగించుకొని శక్తిని పొందవలసి ఉంటుంది.

ప్రతి మిషన్‌లోను ఏదో ఒక సిద్ధాంతం ప్రతిపాదించ బడుతుంది. వారి సిద్ధాంతం ప్రకారం నియమించిన నియమాలు అమలుపరచటానికి గట్టి నిర్ణయం తీసుకుంటారు. బాబూజీ

మహరాజ్ మన సహజమార్గంలో దశ నియమాలు ప్రవేశపెట్టారు. కాని వాటిని పాటించమని ఎవ్వరినీ వత్తిడి చేయలేదు. బాబూజీ ఏర్పాటు చేసిన సహజమార్గ సిస్టమ్ వలన ట్రాన్స్‌మిషన్ (ప్రాణాహుతి) దివ్యశక్తి, వారికి రక్షణ, నిరంతర స్మృతి ఇవన్నీ సమకూరుతాయి. ఇవన్నీ పొందకుండా సాక్షాత్కారం కలగడం సాధ్యం కాదు, కనుక అభ్యాసి దృష్టిని దశ నియమాల మీదకు పూర్తిగా మళ్ళించినట్లయితే, అతని ధ్యేయమైన సాక్షాత్కారానికి చేసే కృషిలో అలసత్వం ఏర్పడవచ్చునే భావంతో, లక్ష్యానికి ప్రాధాన్యతను ఇస్తూ, దశ నియమాలను పాటించాలని గట్టిగా శాసించలేదు. సహజమార్గ సిస్టమ్‌లో ధ్యానం అనుదానిని కల్పించి దాని ద్వారా ప్రాణాహుతి, దివ్యశక్తి, రక్షణ, నిరంతర స్మృతిని ఇస్తున్నారు. ఇవి లేకుండా సాక్షాత్కారం సాధ్యం కాదు. ఈ విధంగా బాబూజీ మన సహజమార్గ విధానాన్ని పరిపూర్ణమైనదిగా రూపొందించారు. మన సిస్టమ్ నిరుపమానమైనది. అందుచేత ధ్యానం ద్వారా వాటిని పొందుతూ దశ నియమాలను పాటించినట్లయితే సాక్షాత్కారం తప్పక లభిస్తుంది. ఈ దశ నియమాలను, ధ్యానం ద్వారా సాక్షాత్కారం పొందే ప్రయాణంలో పది మైలు రాళ్ళుగా బాబూజీ వివరించారు. ధ్యానంలో ఒక కండిషన్ పొందినపుడు దానితో తృప్తి పడకుండా ఇంకా పొందటానికి ప్రయత్నించాలి. అలా కండిషన్ ఒక దాని తర్వాత ఒకటి వస్తాయి. సాక్షాత్కారం వచ్చే వరకు నిరీక్షించాలి. మధ్యలో బాబూజీ దర్శనం ఇస్తారు. బాబూజీ దర్శనం కాగానే ప్రయత్నం విరమించకుండా లక్ష్యం సిద్ధించేవరకు ధ్యానం ద్వారా సాధన చేయాలి. అభ్యాసుల ఉన్నతి కోసం బాబూజీ ఎంత శ్రమకైనా వెనుకాడేవారు కాదు. అభ్యాసులు హృదయ పూర్వకంగా కోరితే

దేశ, విదేశాల్లోని ఏ నగరం, ఏ ప్రదేశానికైనా వెళ్ళేవారు. తమ జీవిత విధానం ద్వారా అన్నీ ఆచరణాత్మకంగా చూపేవారు.

బాబూజీ, అభ్యాసులు తమ లక్ష్యానికి ప్రాధాన్యతను ఇవ్వమనేవారు గాని తాము సెంటర్లను సందర్శించే సందర్భాలలో స్వాగతపు ఏర్పాట్లకు, విందు భోజనాలకు ప్రాధాన్యతను ఇవ్వవద్దనే వారు. కొన్ని సందర్భాలలో తాను రొట్టె మాత్రమే తింటానని, అమితమైన ఏర్పాట్లు చేయవద్దని కరపత్రం పంపేవారు. సెంటరు లోని అభ్యాసులు, నిర్వాహకులు ఆర్భాటాలకు లోనయితే వారి ఆధ్యాత్మిక దృష్టి మరలుతుందని అలా చేసేవారు. అదే విధంగా ఒక సెంటర్ లోని అభ్యాసులు మరొక సెంటర్‌కు వెళ్ళినందు వలన ఆ సెంటర్‌కు భారం కలగకుండా ఉండటానికి అలా వెళ్ళవద్దని చెప్పేవారు. అభ్యాసుల తృప్తి కొరకై ఎన్ని సెంటర్లకయినా వస్తాననేవారు.

పురాణాల్లో ఋషుల గురించీ, రామాయణంలో రాముని పాదధూళి గురించిన ప్రస్తావనల మూలంగా, మహాత్ములు ఏదైనా పారవేసిన దాన్ని దక్కించుకుంటే ఏదో ఫలం తక్కుతుందన్న అభిప్రాయంతో ఒక అభ్యాసి బాబూజీ ఉమ్మిన దానిని సేకరించి భద్రపర్చాడు. సమావేశంలోకి వచ్చాక ఆ అభ్యాసిని ఉద్దేశించి బాబూజీ, “నేను, నాకు అది పనికి రానిదని ఊసివేశాను. దాని వలన నీకు ఉపయోగం ఏమిటి? అలా నీవు ఏదో లాభం పొందుతావు అనుకుంటే నన్ను అనుసరించి నేను ఇచ్చే ఆధ్యాత్మికతను పొందవలసింది. ఇలా పాదాలు తాకిన చోటల్లా ధూళి సేకరణ జరిగితే నేను నేల విడిచి సాము చేసినట్లవుతుంది” అని అన్నారు. ఈ విధంగా అభ్యాసులలో సంస్కరణ ద్వారా ఉన్నత భావాలు ఆదర్శ జీవనం కలిగించటానికి కృషి చేసేవారు.

ఒకసారి బాబూజీ తుఫాను గాలిని కూడా లక్ష్యపెట్టకుండా విజయవాడలో డాక్టర్ పార్థసారధిగారి ఇంటికి వచ్చి తలుపు తట్టుతూ, నేను రామచంద్రని అని చెప్పారంట. అలా తలుపు తట్టుతూ పేరు ఎందుకు చెప్పారు అని నేను అడిగితే – అలా చెప్పకపోతే రాత్రివేళ ఇంటిలో ఆ చప్పుడు విన్నవాళ్ళు ఎవరై ఉంటారోననే భయానికి గురి కాకుండా ఉండటానికి అలా చేశానని అన్నారు. ఆ విధంగా 'వారు' అభ్యాసుల రక్షణ, క్షేమం కాంక్షిస్తూ మనం కూడా ఎలా ప్రవర్తించాలో నేర్పేవారు.

ఒక అభ్యాసీ బాబూజీతో, **"మేము రోజు అంతా కుటుంబ వ్యవహారాల్లోను, ప్రాపంచిక విషయాలలోను మునిగి ఉంటాము. కనుక నాలో దైవము ఉన్నాడని నేను ఎలా భావించగలను"** అని అన్నాడు. అందుకు సమాధానంగా బాబూజీ, "సృష్టికర్త ఏ విధంగా తన సృష్టి నంతటినీ తనలో ఉన్నట్లు భావిస్తాడో అదే విధంగా నీవు నీలో దైవం ఉన్నాడని భావించుకో. అప్పుడు ఆ సృష్టికర్త కూడా నీలోనే ఉన్నట్లవుతుంది" అని అన్నారు.

నేను నిన్న మీ అందరినీ మీ కండిషన్ ఎలా ఉంది అని అడిగినపుడు మీరు ఎవ్వరూ ఏమీ చెప్పలేకపోయారు. నిన్న బాబూజీ యొక్క కృప అపరిమితంగా ప్రవహించింది. మీరంతా బాబూజీ ఒడిలో బిడ్డల్లాగా ఉండిపోయారు. అందుకని మీరు ఏమీ చెప్పలేక పోయారు. మీరే గాకుండా, బాబూజీ మీద దృష్టి నిలిపి ఉన్న ఎంతో దూరాన ఉన్న అభ్యాసులు కూడా అదే స్థితిని పొందారు. 'వారి' కృప అంత అపారంగా వర్షించింది.

కొంతమంది అభ్యాసులు బాబూజీ దర్శనం కోసం షాజహాన్‌పూర్ వెళ్ళాలని కోరిక ఉన్నా వెళ్ళలేకపోయేవారు. కాని

వారిలో తీవ్రమైన కాంక్ష ఉండేది. అప్పుడు బాబూజీ అక్కడకు రాగలిగి, తన ముందు కూర్చుని ఉన్న అభ్యాసులతో ఇలా అన్నారు – "ఇక్కడికి రాగలిగిన మీకే కాకుండా; ఇక్కడకు రావాలని, ట్రాన్స్‌మిషన్ పొందాలని కోరిక కలిగి ఉండి రాలేకపోయిన అభ్యాసులకు కూడా, వారి దృష్టి ఈ వైపే మళ్ళి ఉన్నందున వారికి కూడా ఈ ప్రాణాహుతి అందుతోంది" అని చెప్పారు.

**ప్రశ్న: ధ్యానంలో గొడుగు నీడ వంటిది పడుతూ ఉన్నట్ల నిపించింది. అది ఏమిటై ఉంటుంది?**

**జవాబు:** మీరు బాబూజీ మహరాజ్ ఆశ్రయంలో లేదా రక్షణలో ఉన్నట్లు భావించుకోవాలి. అభ్యాసీ దివ్య స్థితిలో ఉన్నప్పుడు ఆలోచన (thought) వస్తే దాని నంటి పెట్టుకొని శక్తి కూడా ఉంటుంది. ఇంతకు పూర్వం నేను ఇది చూడలేదు. దీనిని కూడా నేను తెలుసుకోవాలని బాబూజీ నాకు చూపించారు. దాని వెనుక ఉన్న డివైన్ పర్సనాలిటీ (దివ్య మూర్తి)ని కూడా మనం చూడాలి. అటువంటపుడు మనకు మంచి ఆలోచనలు కలిగేటట్లుగా చూసుకోవాలి. వాటి వెనుక ఉండే శక్తి కూడా గొప్పదిగా ఉంటుంది. చెడు ఆలోచనలు కలిగినపుడు వాటి వెనుక శక్తి బలహీనంగా ఉంటుంది. ఈ కండిషన్ (స్థితి) కొంచెం సేపు మాత్రమే ఉంటుంది. ఈ స్థితిలో చెడు ఆలోచన వచ్చినా, కోపం కలిగినా అంతగా నష్టం జరగదు. దానిని బాబూజీ నియంత్రిస్తూ ఉంటారు. అందువలన మంచి ఆలోచనలు కలిగేటట్లు, బాబూజీని దర్శించగలిగేట్లు ఉండాలి.

ప్రతిరోజు మీరు ఒకే ప్రదేశం (స్థలం) లో ధ్యానంలో కూర్చుంటూ ఉంటే ఆ ప్రదేశం దివ్యత్వంతో ఛార్జి అవుతుంది (శక్తివంతం అవుతుంది). మీరు అక్కడ కూర్చున్నపుడల్లా ప్రశాంతత

నెలకొని ఉంటుంది. అలాగే మీ దృష్టి, మీ ధ్యాస ధ్యానంవైపు మళ్ళి ప్రాణాహుతి బాగా వస్తుంది. బాబూజీ యొక్క దర్శనాన్ని కూడా పొందగల్గుతారు. 'వారు' మిమ్మల్ని మరచిపోరు. ఈ అభ్యాసం వలన క్లీనింగ్ కంటె కూడా ఎక్కువ ప్రయోజనం ఉంటుంది. క్లీనింగ్‌లో దోషాలు, స్థూలత్వం గుర్తించి అవి తొలగిపోతున్నట్లుగా అనుభూతి చెందవలసి ఉంటుంది. కాని దివ్య ప్రేమ లభిస్తూ ఉందనుకోవటం వలన మనలో అనవసరపు టాలోచనలన్నీ తొలగిపోతాయి. బాబూజీ నీలో ఉన్నట్లు అనుభూతి చెందితే అంతరంగం కూడా నిర్మలమవుతుంది. బాబూజీ, "అభ్యాసీని నిర్మలీకరణం చేయటం నా వంతు, నా ఉనికిని గుర్తించుతూ నిర్మలమవుతున్నట్లు భావించటం అభ్యాసీ వంతు" అని అన్నారు.

**ప్రశ్న: ఒక్కొక్క స్థితిలో కొన్ని రోజులు ఉండటం జరుగుతుంది. ఆ తర్వాత కొన్ని రోజులు ఆలోచనా రహితంగాను, శూన్యంగాను ఉండిపోతుంది. ఇది కూడా ఒక స్థితి అనకోవచ్చునా?**

**జవాబు:** దీనిని స్థితి అనకూడదు. ఇటువంటి స్థితి కొద్ది రోజులు ఉండవచ్చు కాని ఎక్కువ రోజులు ఉండకూడదు. అటువంటి పరిస్థితిలో బాబూజీ స్మరణతో ధ్యానంలో మునిగి ఉండాలి.

**ప్రశ్న: ధ్యానంలో ఆలోచనలు వస్తున్నట్లు అనిపించటం లేదు. అది అస్వాభావికమా?**

**జవాబు:** అటువంటి అనుమానం కలిగినపుడు మాస్టర్ శ్రీ బాబూజీ మహరాజ్ నీలో ఉన్నారు అనుకుంటే చెడు జరగదు. శూన్యత్వం (Blankness) లేదా ఏ అనుభూతి కలగకపోవటం అనేది ఎక్కువ కాలం ఉండకూడదు.

**ప్రశ్న: సూర్యగ్రహణం, చంద్రగ్రహణం సందర్భాలలో ధ్యానం**

**చేస్తే దుష్ఫలితం రెట్టింపుగా ఉంటుందా! అది వాస్తవమేనా?**

**జవాబు:** గ్రహణ సమయాల్లో ధ్యానం చేసినందువలన భేదం ఉండదని బాబూజీ చెప్పారు. హృదయం ఎప్పుడైనా హృదయమే. అది బాబూజీ యొక్క దివ్య శక్తి మీదనే ధ్యానం చేస్తుంది. అందువలన బాహ్యమైన ఈ చర్య వలన ఆంతరికంగా ఎటువంటి ప్రభావమూ ఉండదు. ఇది పురాతనమైన భావం. సూర్యచంద్రులు మనకు వెలుగుని ఇస్తున్నారు కనుక వారు రాహు కేతువుల మూలంగా ఇబ్బంది పాలయ్యారనే భావంతో దాని ఉపశమనానికి మనం జపాలు, కీర్తనలు పాడటం ఆచరిస్తూ ఉంటాం. ఇది సరైన అభిప్రాయం కాదు. హృదయం మీద ఏ ప్రభావమూ ఉండదు.

**ప్రశ్న: ఇటుంటి ఆచారాలు మన మిషన్‌లో ఆచరించవచ్చునా?**

**జవాబు:** ఇది పురాతన కాలంలోని భావన. వాటితో మనకు నిమిత్తం లేదు.

**ప్రశ్న: నేను నడుస్తున్నపుడు చాలా తేలికైనట్లు అనుభూతి కలుగుతుంది. అది ధ్యానం వలన సమకూరినదేనా?**

**జవాబు:** నీ మనస్సు నిర్మలంగా ఉండటం మూలంగానూ, నీవు బాబూజీతో సంబంధం కలిగి ఉండటం మూలంగానూ అలా ఉంటుంది. అంతేగాని అది బాహ్య పరిస్థితుల వలన మాత్రం కాదు. అదే విధంగా మనస్సు మీద కూడా భారం ఉండదు.

**ప్రశ్న: మన మిషన్ ప్రార్థనలో (O! Master) ఓ! మాస్టర్‌కు బదులుగా ఓ! బాబూజీ అని మార్పు చేసి ప్రార్థన చేయవచ్చునా?**

**జవాబు:** ఆ ప్రార్థన అంతిమం నుంచి వచ్చిందని బాబూజీ చెప్పారు. అందుచేత మనం మార్చటానికి వీలు కాదు. ఆ వాక్యాలు

శక్తియుతంగా కూర్చబడ్డాయి. వాటిలో మార్పు చేసినట్లయితే అందులోని శక్తి సన్నగిల్లుతుంది. కనుక యథాతథంగానే ప్రార్థన చేయాలి.

మీ ఆలోచనలు బాహ్యం మీద లగ్నం చేసినట్లయితే మీ ధ్యానం మీద మీకు విశ్వాసం కలగనట్లే. మీరు బాబూజీ మీద విశ్వాసం కలిగి ఉండాలి. శ్రీరామనవమి అని, శ్రీకృష్ణాష్టమి అని ఆ రోజు గుర్తుంచుకొని ఆ రోజు వచ్చే వరకు ఎదురు చూస్తారే కాని వారి మీద అప్పటి వరకు ఏ భక్తీ ఉండదు. కనుక భక్తితో ధ్యానంలో మునిగి ఉండడం అవసరం.

బాబూజీని తలచుకొని భక్తితో ధ్యానంలో లయలీనమై ఉంటే, 'వారు' తమకు తామే మన ఎదుట ప్రత్యక్షమౌతారు. బాబూజీ మీ వారు అనుకుంటూ, వారిలో లీనమైపోతూ, మిమ్మల్ని మీరు మరచిపోండి. వారితో మీరు అనుబంధం కలిగించుకొని వారే మీరు అనుకుంటున్నారు కనుక, దివ్యత్వంలో పూర్తిగా మునిగి ఉంటున్నారు కనుక బాబూజీ భౌతికంగా మీకు తెలియకపోయినా స్వయంగా 'వారే' తెలియజేసుకుంటారు. 'నేను' అనే భావన తొలగినపుడు వారు వ్యక్తమౌతారు.

ఒకప్పుడు నేను జబ్బుగా ఉన్నాను. బాబూజీ నా వారు అనుకుంటున్నాను. ఈ కష్టం అనేది వారికి తెలియకూడదని అనుకొన్నాను. నేను వారికి జాబు వ్రాస్తే వారికి కష్టం కలుగుతుందని నా భావన. కాని బాబూజీకి తెలుసు. వారికి అందరి క్షేమం దృష్టిలో ఉంటుంది కనుక వారే స్వయంగా – "నీవు ఏమీ వ్రాయవద్దు, నీ హృదయంలో భావం ఉంటే చాలు. నీ జబ్బు నాకు ఇబ్బంది కలిగించదు. కాని అనుబంధం (ఆత్మీయతా బంధం) మాత్రం

ఉంటుంది. మాస్టర్ క్షేమంగా ఉంటారు. ఇటువంటి పరస్పర అనుబంధం లేదా అవగాహన (chain) ఈ సిస్టమ్‌లో మాత్రమే ఉంది. ఈ సంబంధం (chain) అనేది దివ్యం నుంచి ఏర్పడుతుంది" అని అన్నారు.

చాలా మంది అభ్యాసులు ఇక్కడకు వస్తూ ఉంటారు. మేము ధ్యానం చేస్తూ ఉంటాము. కాని ఫలితం కనిపించటం లేదు, అని ఫిర్యాదు చేస్తూ ఉంటారు. మీరు ధ్యానం ఏ విధంగా చేస్తున్నారు, అని అడిగితే మాస్టర్ ధ్యానంలో కూర్చుంటున్నారని, మాస్టర్ ధ్యానం చేస్తున్నారని, మాస్టర్ ట్రాన్స్‌మిషన్ పొందుతున్నారని అనగా అన్నీ తమ తరపున వారే చేస్తున్నట్లుగా భావిస్తున్నట్లు చెప్పారు. "అన్నీ వారే చేస్తుంటే అంటే ఇచ్చేది వారే, స్వీకరించేది వారే అయితే మీరు నిర్వహించే పాత్ర ఏమిటి?" అని అడిగాను. అలా అనుకుంటే వారు (ఆ అభ్యాసులు) పొందేది ఏమీ ఉండదు. ఒక సిస్టమ్ అనేది ఉంది. దానికి దివ్య శక్తి తోడై ఉంది. ఒక డివైన్ పర్సనాలిటి (దివ్య మూర్తులు) ఈ విధానాన్ని ప్రవేశపెట్టారు. దివ్యత్వంలో మునిగి ఉండటమే ఈ విధానంలోని ప్రత్యేకత. మీరు ఒక దివ్య క్షేత్రానికి వెళ్ళితే అక్కడ ఒక సరస్సులోనో, కోనేరులోనో, నదిలోనో స్నానంచేసి దైవ దర్శనానికి వెళ్ళతారు. కాని మీలోనే ఉన్న దైవాన్ని చూడలేక, వెదుక్కుంటూ ఎక్కడెక్కడికో వెళ్ళతారు. దీనినే కబీరు మహాశయుడు, కస్తూరి మృగము తన నాభిలోని కస్తూరిని తెలుసుకోలేక ఆ సువాసన ఎక్కడి నుంచి వస్తోందా అని వనమంతా తిరుగుతున్నట్లుంటుంది, అని వివరించాడు. ఈ సిస్టమ్ (విధానం)లో మీరు నదిలో మునకలు వేయవలసిన అవసరం లేకుండా హృదయంలోని దివ్యకాంతిలో మునిగి ఉంటే దైవ సాక్షాత్కారం కలుగుతుంది.

అలహాబాదులో సెమినార్ అక్టోబర్ 3వ తేదీన జరిగింది. ఆ సెమినార్‌లో ప్రిసెప్టర్స్‌కు పరీక్ష జరిపారు. అందులో రెండు పేపర్లు, ఒక్కొక్కటి 45 నిమిషాల వ్యవధిలో జవాబు వ్రాయవలసి ఉంటుంది. ఒక పేపర్‌లో "దేవుడు అంటే నిర్వచనం ఏమిటి?" (Define God) అన్నది ప్రశ్న. ఆ పేపర్ (ప్రశ్నాపత్రం) ను నాకు పంపితే నేను సమాధానాలు వ్రాస్తానని అన్నాను. బాబూజీ మహరాజ్ దేవుడ్ని గురించి చెబుతూ అవును కాదు మధ్య, లేదా ఉన్నాడు లేడు అనే దానికి మధ్య దేవుడు ఉన్నట్లు చెప్పారు. నేను బాగా జవాబు ఇవ్వగలనని అన్నాను. అది దేవుడ్ని నిర్వచించటం కాదు, దైవ సాక్షాత్కారం పొందటమవుతుంది. కనుక ఆ ప్రశ్నే తప్పు.

అలాగే, హైదరాబాదులో అనుకుంటాను, "సాక్షాత్కారం యొక్క ఆవశ్యకత ఏమిటి?" (What is the necessity for Realisation?) అని ఒక ప్రశ్న ఇచ్చారు. వారు ఇచ్చిన వివరణబట్టి ప్రశ్న ఇలా అయి ఉండవచ్చు– "సాక్షాత్కారం పొందడానికి అవసరమైనది ఏమిటి? (What is necessary for Realisation?)

బాబూజీ ఎప్పుడూ కూడా ధ్యానం, స్మరణ (జ్ఞాపకం) ఈ రెండు విషయాలు ప్రస్తావించేవారు. కనుక ధ్యానంలోను, స్మరణలోను మనకు ప్రాణాహుతి లభిస్తూ ఉంటుంది. ప్రశ్నపత్రంలో ధ్యానం, ప్రాణాహుతి గురించిన ప్రస్తావనే లేదు. ఆ విధంగా మీ దృష్టి మరల్చబడుతోంది. బాబూజీ ఇచ్చింది రెండు మార్గాలు. అవి కాకుండా మన దృష్టిని వేరే మళ్ళిస్తే మంచిది కాదు. ధ్యానం అనగా ఎవరో 'వారి' కోసమే వెదకటం (అన్వేషించటం). రెండవది 'వారి'కై తపన చెందటం. వాటి ఫలితం మనం కోరుకునేది ఏదో కావాలని. తపన అనేది ఆత్మ యొక్క దిశ (Direction) అవుతుంది. బాబూజీ గురించి నేను ఎన్నో విషయాలు వ్రాశాను. నేను ఏది వ్రాసినా అది

నేను చూసిన దానినే వ్రాశాను. 'వారి' దివ్య సౌందర్యం గురించి, 'వారి' దివ్య వాక్కు గురించి నేను ఒక పుస్తకం (దివ్యఛవి) వ్రాశాను. "మీ ప్రేమైక దృష్టియే మా మదిలో తలపుకు వస్తోంది" అనే గీతంలోని అర్థం ఏమంటే, అన్నింటిలోను మీ దర్శనమే అవుతుంది. అదే ధ్యాసలో ఉంటాము. అలాగే అందరిలోనూ మీరు ఉంటారు. అందరిపైనా మీ దృష్టి ఉంటుంది అని.

బాబూజీ మొదట అభ్యాసీలో భౌతికమైన శారీరక దృష్టిని తొలగిస్తారు. ఆ తర్వాత ఆత్మ, ధ్యానం, తపన అన్నీ తొలగించి ఒకే ఒక్కటి మిగుల్చుతారు. అలా నాలో మిగిలినది ఏమిటంటే, అంతటా, అందరిలోను నేను బాబూజీ మహరాజ్‌ను దర్శించాలనే కోరిక. 'వారి' దివ్య దర్శనం నాకు సదా కలగాలన్నదే ఆ కోరిక! అందుకు 'వారి' జన్మదిన వేడుకలు కాని, ఇతరత్రా ఏమన్నా కాని అవసరం లేదు. నేను కోరుకుంటున్న ఉత్సవం, నేను వేచి ఉన్నది అందరి హృదయాలలోనూ వారిని చూడాలని. 'వారి' దివ్య ప్రేమతో, 'వారి' దివ్య నేత్రాలతో అలా అంతా చూడగలగాలని నా కోరిక.

నాకు తెలిసినంతవరకు ఈ భౌతిక శరీరాన్ని నిలుపుకొని ఉన్నత శక్తుల్ని వినియోగం చేసుకోవడానికి సూక్ష్మ శరీరం (Subtle body) గాని ఆత్మ గాని సమర్థమైనవి కావు. మరి అలాగైతే లాలాజీగారు బాబూజీ శరీరాన్ని 12 సంవత్సరాలు భద్రంగా ఎలా నిలపగలిగారు? ఒకే ఒక్క సంకల్పమే దానికి కారణం. శక్తి ముందుగా తనతో అనుసంధానమై ఉన్న 'సంకల్పము' లోనికి ప్రవహిస్తుంది. ఇక ఇక్కడ ఆత్మ లేదు. సూక్ష్మ శరీరం లేదు. మరి కార్య నిర్వహణ ఎలా జరుగుతుంది? మరి అలాంటప్పుడు శరీరంలో దానిని (శక్తిని) అనుసంధించాల్సిన అవసరం ఏమి ఉంది? అందుకే "ఒక సంకల్పం" కావాలి. ఆ సంకల్పం ద్వారానే శక్తి దిగి వస్తుంది,

అవతరిస్తుంది. ఈ శక్తి దైవం కాదు. దేవునికి మనస్సు, మైండ్ లేవు. ఆ శక్తి సవ్యంగా ఉపయోగించబడటానికి 'సంకల్పం' ద్వారా వస్తుంది. కనుక అలా సంకల్పం ద్వారా శక్తి ఏ మేరకు వచ్చినా ఆ శక్తి వృధా కానేరదు.

ఈ శరీరం ఎంత భరించగలిగితే అంత శక్తి సంకల్పం ద్వారా వస్తుంది. మరో రకంగా చెప్పాలంటే, స్వయంగా బాబూజీయే ఆ 'సంకల్పం'. (ఈ శరీరాలు – అభ్యాసులమైన మన ఈ శరీరాలు ఎంత దివ్య శక్తిని తీసుకోగలిగితే లేదా జీర్ణించుకోగలిగితే, అంతా ఆ సంకల్ప స్వరూపమైన బాబూజీ మనకు ప్రసాదిస్తూనే ఉండడం దీనికి నిదర్శనం). ఇలాంటి ఈ 'సంకల్పం' ఉన్నతోన్నత శక్తితో అనుసంధించబడి ఉంటుంది. ఈ అనుసంధానం భౌతిక శరీరం వదలిన తర్వాత గాని సిద్ధించదు. అలాంటి ఆ స్థితిని మన ప్రియ బాబూజీ మహరాజ్ సాధకునికి అతడి జీవిత కాలంలోనే ప్రసాదించడానికి ప్రయత్నిస్తున్నారు. కాబట్టి సాధకులు మిక్కిలి శ్రద్ధాళువులై ఉండాలి. లిఖిత పూర్వంగా దీనిని తెలియపర్చమని బాబూజీ వాంఛిస్తున్నారు. ఇలా వ్రాస్తున్న ఈ కలాన్ని వారే వ్రాయిస్తున్నారు.

లాలాజీగారు తమ భౌతిక శరీరాన్ని వదలిన తర్వాత ట్రెయినింగ్ నిమిత్తం 12 సంవత్సరాలు బాబూజీ మహరాజ్‌గారితో పని చేశారట. ఎలాంటిది ఈ ట్రెయినింగ్ అని అలోచించాను. ఎందుకంటే వారు 'అనంతము' యొక్క శక్తికే అధిపతియై ఉండగా ఈ ట్రెయినింగ్ యొక్క అవుసరం వారికి ఏమి ఉంటుంది? అని. అప్పుడు నేను ఒక దృశ్యంను చూసాను. ఆ దృశ్యంలో లాలాజీగారి 'సంకల్పం' గమనించాను. లాలాజీగారు తేజో (కాంతి) మండలంలో ఉన్నందువలన సూక్ష్మ శరీరంగాని, ఆత్మతో గాని లేకపోవడం వలన తమ సంకల్ప మాత్రం చేత ఆ అనంతము యొక్క శక్తిని బాబూజీలో

అవతరింపజేస్తూండడం నాకు దృశ్యమానమైనది. ఆ శక్తి నేరుగా వచ్చినట్లయితే బాబూజీ శరీరం తట్టుకోలేదు. కాబట్టి అలా ఆ శరీరాన్ని రక్షించాలి కనుక లాలాజీగారు తమ సంకల్పం ద్వారా ఆ శక్తిని బాబూజీలో ప్రవేశపెట్టారు.

ప్రేమ అంటే, అలాంటి ప్రేమ అర్థం ఎవరికీ తెలియదు. ప్రేమ అలా పుట్టి దాని అర్థం ఇలా ముగుస్తుంది.

బాబూజీని "మీకు లాలాజీగారి అవుసరం ఇంకేముంది?" అని ఒకరు అడిగారు. దానికి లాలాజీగారే ఇచ్చిన జవాబుగా బాబూజీ, "వారికి నా (లాలాజీ) అవుసరం ఏమీ లేదు. నాకే వారి (బాబూజీ) అవుసరం ఉంది" అని చెప్పారు. ఇందులో ఎంతటి గూఢార్థమో!

ఒకసారి షాజహాన్‌పూర్‌లో బాబూజీతో సహా వరండాలో కూర్చుని ఉన్నాం. బాబూజీ మాటలు ఇలా సాగాయి.

"అక్కడ దొంగలు పడుతుంటే నీవు ఇక్కడ కూర్చున్నావు ఏమిటి?" అని లాలాజీ సాహెబ్ అంటున్నారు.

బాబూజీ నవ్వుతూ అన్నారట "దొంగలు పడుతున్నారని చెబుతున్నారు కాబట్టి మీరే తరిమేయండి" అని. దానికి లాలాజీగారు ఇలా బదులు ఇచ్చారట– "నేను నీ మాష్టర్ని కాని, సేవకుణ్ణి కాదు. నువ్వే చూసుకో" అని.

"మనం ఇప్పుడు 2000వ సంవత్సరానికి వస్తున్నాం. బాబూజీ వచ్చి నూరు సంవత్సరాలు అయ్యింది కదా! ఈ విషయమై మీ అభిప్రాయం ఏమిటి?" అని ఇది ఒకరి ప్రశ్న.

మీరు చూస్తున్నారు కదా! అందరూ చూస్తూనే ఉన్నారు కూడా!

ఒక అభ్యాసి అన్నాడు కదా – "బాబూజీ 2000వ సంవత్సరం తర్వాత వినాశం జరుగుతుంది, అని అన్నారు కదా! నేను ఇంట్లోనే సురక్షితంగా ఉంటాను, ఎటూ కదలకుండా" అని. దానికి నేను "అలా వినాశనం అయ్యేప్పుడు నీ ఇంటిని మాత్రం ఎవ్వరు కాపాడుతారు?" అని అన్నాను. ఇవి అన్నీ మనస్సు మీది ముద్రలేనని (కవరింగ్స్), అవన్నీ తొలగిపోతాయని తెలిసీ భయపడతారు. బాబూజీగారి పుస్తకాల నుండి భయం, మరణం వంటివే గమనిస్తాం. అలాకాకుండా శాంతి, ఆనందం వంటి వాటి గురించి గ్రహించాలి.

నిన్నటిరోజున కర్ణాటక నుండి పది మంది అభ్యాసులు వచ్చారు. అందులో ఒక ఆమె "నేను ఇప్పుడే బాబూజీని కలవాలి" అంది. దానికి బాబూజీయే అద్భుతమైన సమాధానం ఇలా ఇచ్చారు: "నిన్ను అక్కడికి చేరుస్తాను. కాని నేను అక్కడ ఉండను. ఉండాల్సిన విధీ లేదు. ఇక నీవు అక్కడే ఉండాలి. అది నీ విధి. అక్కడే నీవు ఉండి నివసించాలి. అది నీ బాధ్యత. ఈ నీ బాధ్యతను స్వీకరిస్తావా?" అని. దీనికి ఆమె నిరాకరించగా బాబూజీ తిరిగి "ఏ స్థితిలో, ఏ మండలంలో ఉన్నామనే ఆలోచన చేయకుండా భక్తి, ప్రేమ, సమర్పణలతోనే ఉండాలి" అని అన్నారు. ఈ మూడు అలవరచు కుంటే బాబూజీ ఎప్పుడూ నీ సమక్షంలోనే ఉంటారు. 'వారి' పవిత్రపాదాల సన్నిధికి చేరకుండా ఎవ్వరూ ఆపలేరు. దివ్య ప్రాణాహుతి ఆ విధంగా మిమ్మల్ని తీర్చిదిద్ది అక్కడకు చేర్చగా మీరు అక్కడే ఉండిపోతారు.

ధ్యానం అంటే 'వారి'ని అన్వేషించడమే! దివ్యం (డివైన్) అనేది మనలోనే ఉంది. దేవాలయంలోనికి వెళ్ళేముందు మామూలుగా మనం అక్కడి బావి వద్దనో లేదా ఏ కోనేటిలోనో స్నానంచేసి ఆలయ

ప్రవేశం చేసినట్లుగానే, పవిత్ర ఆలోచనలతో మనస్సు అనే మందిరంలోనికి వెళ్ళాలి. దివ్య జీవనం గడుపుతూ దివ్య జ్యోతిలో మునిగి 'వారి'కై అన్వేషించాలి. 'వారి'కై తపించాలి. 'వారి'ని ఎప్పుడు పొందుతామా, ఎప్పుడు 'వారి'లో లయం అవుతామా అని ఆవేదన చెందాలి. ఈ విధమైన అనుభూతి, అనుభవాల ద్వారా మనం 'వారి'ని పొందగలుగుతాం. మనస్సనే హృదయ మందిరంలోనే ఈ పూజ (ధ్యానం) జరుగుతుంది. అక్కడే భగవంతుడు, 'వారు' దర్శనం ఇస్తారు. ఋషులు, మునులు అలాగే ఈ మనస్సనే హృదయ మందిరంలోనే దివ్య సాక్షాత్కారం పొందారు. బాహ్య ప్రపంచంలో నదుల్లో, సముద్రాల్లో స్నానాలు ఆచరించడం, నీటిలో మునగడం అనేది బహుశా ఈ ఆంతరిక స్నానానికి సంకేతమై ఉంటుంది.

డాక్టర్ వరదాచారిగారు బాబూజీతో ఒకసారి ఇలా అన్నారు: "మీ పరిసరాల్లో ఉన్న పక్షులు, జంతువులు కూడా ఆధ్యాత్మికంగా లాభం పొందుతున్నాయి. వాటిని ఇంకా ఎక్కువ సంఖ్యలో ఎందుకు పోషించకూడదు'' అని. అందుకు సమాధానంగా బాబూజీ, "మానవమాత్రులకు బుద్ధి (మైండ్) ఉంది. అర్థించటం వచ్చు. పక్షులకు, జంతువులకు అవి లేవు. వాటంతట అవి అభివృద్ధి చెందలేవు. కనుక అడవిలో సంచరించే పక్షులు, జంతువులు యోగులు కాలేవు. అందుచేత జంతువులు జంతువులే" అని అన్నారు.

బాబూజీ చాలా లోతైన విషయాలు చెప్పేవారు. 'వారు' తరచుగా ఇలా చెప్పేవారు: "సామాన్యంగా నా ఎదుట కూర్చునేవారు గాని, ఆశ్రమంలో నివసించేవారు గాని చాలా తక్కువ ప్రయోజనం పొందుతారు. వారి కంటే దూరంగా ఉండే వారు, నన్ను స్మరించేవారు ఎక్కువ లాభం పొందుతారు. ప్రత్యక్షంగా చూస్తున్నవారు, సమీపంలో

ఉంటున్నవారు తాము బాబూజీ సన్నిధిలోనే ఉంటున్నాము అనే భావంతో ఎక్కువగా స్మరించటానికి ప్రాధాన్యతను ఇవ్వరు. దూరంగా ఉండేవారు లేదా డెన్మార్క్‌లో ఉండేవారు నా యందు ధ్యాస కలిగి నన్నే ఆధారంగా భావించుకుంటూ ఉంటారు. కనుక ఆ స్మరణ, ఎక్కువ తపన వలన వారు ఎక్కువ మేలు పొందుతారు" అని. అనగా బాబూజీ మీద ఆధారపడి ఉండే భావనలోని హెచ్చు తగ్గులే ఇందుకు కారణం.

నేను ట్రాన్స్‌మిషన్ ఇస్తున్న సమయంలో ఒక ప్రిసెప్టర్ కూడా సిట్టింగ్‌లో కూర్చున్నాడు. పది నిమిషాల తర్వాత అతడు ఓమ్ అని శబ్దం చేశాడు. అలా ఎందుకు చేశావని అడిగితే తాను పది నిమిషాల కంటే ఎక్కువ సేపు కూర్చోలేను కనుక అలా ఓమ్ పలికి ముగించానని అన్నాడు. అప్పుడు "నీవు ఇతరులకు భంగం కలిగిస్తున్నావు" అని చెప్పి అవతలికి పంపివేశాను. ధ్యాన సమయంలో ఎవరికీ మనం భంగం కలిగించరాదు.

**"నేను చాలా సంవత్సరాలుగా ధ్యానం చేస్తున్నాను. నేను నా లక్ష్యం (గోల్) ఇంకా చేరలేదనుకుంటున్నాను. ప్రతిచోటా నీ లక్ష్యాన్ని గుర్తుంచుకోవాలని వ్రాస్తారు. నా లక్ష్యాన్ని గుర్తుంచుకోవటం ఎలా? బాబూజీ మహరాజ్ కూడా లక్ష్యాన్ని (గోల్) గుర్తుంచుకోవాలని అన్నారు. కనుక ఆ గమ్యం ఏమిటి? నేను ఆ గమ్యం చేరకుండా, అక్కడ నివసించకుండా, ఆ అనుభవం చెందకుండా దానిని జ్ఞాపకం ఉంచుకోవటం ఎలా?"** ఇది ఒకరి ప్రశ్న.

**జవాబు:** గోల్ అనగా అంతిమం (ULTIMATE). అది మనం చిట్ట చివరకు (ఆఖరికి) చేరవలసిన స్థానం. పట్టుదలతో సాధన చేస్తే అక్కడికి చేరగలం. బాబూజీ మనకు ఆ అంతిమం చేరటం

అనేది లక్ష్యంగా చెప్పారు. కనుక మనం 'వారి' మీద ఆధారపడి ఉండాలి. నీ ఎదుట 'వారు' ఉన్నారు కనుక వారినే తలుచుకుంటూ ఉంటే ఆ లక్ష్యాన్ని చేర్చే బాధ్యత వారే స్వీకరిస్తారు. అంతిమము – అనంతము మన లక్ష్యము అని బాబూజీ మనకి నిర్దేశించడంలోని అర్థం ఏమంటే, జీవిత లక్ష్యం ఇదీ అని చెప్పగలిగిన ఆ బాబూజీని మన వారుగా మన స్వంతమైన వారుగా చేసుకోవాలి. బాబూజీనే స్మరిస్తూ వారికే నిన్ను నీవే అర్పించుకోవాలి. 'వారు' మనల్ని అంతిమానికి తీసుకొని వెళ్ళడానికే అవతరించి ఉన్నారు. కనుక వారే నిన్ను వెంటబెట్టుకుని తీసుకొని వెళ్ళతారు. అంతిమం అనేది ఏమిటో నీకు తెలియదు. నీకు తెలిసింది బాబూజీ. అందుచేత వారితో నీ సంబంధం తెంచుకోకుండా వారినే అంటిపెట్టుకుని వారినే విశ్వసించి వారినే ఆశ్రయించితే వారే అక్కడికి చేర్చుతారు. కనుక అంతిమం సంగతి కన్నా బాబూజీనే మనస్సులో నిరంతరం జ్ఞాపకం ఉంచుకోవాలి.

ఒకసారి ప్రిసెప్టర్ రాఘవేంద్రరావుగారు బాబూజీతో "మనం అంతిమము నుంచి వచ్చాం కనుక నేను అంతిమాన్నే జ్ఞాపకం ఉంచుకుంటాను" అని అన్నారు. అపుడు బాబూజీ కొంతసేపు మౌనంగా ఉండి, "నీవు అలాగే చెయ్యి. నీవు అంతిమాన్నే గుర్తుంచుకో. కాని అంతిమము నిన్ను గుర్తించలేదు. నేను నిన్ను గుర్తించగలను గాని అంతిమమునకు నీవు ఎవరో తెలియదు" అని అన్నారు.

నేను ఒక స్థితిలో ఉన్నపుడు నాతో ఎవరో సాక్షాత్కార స్థితి అంటే ఇదే అని చెప్పినట్లయ్యింది. భగవంతుని ఎవరైనా స్మరించినట్లయితే నేను నా స్థితికి భంగం కలిగినట్లు భావించేదాన్ని. అనగా భగవంతుని స్థానమే నాదై ఉన్నందువలన దేవుని పిలవగానే

నేనే చలించినట్లుండేది. అపుడు బాబూజీకి నేను ఈ విషయాన్ని ఉత్తరంలో వ్రాశాను. దానికి సమాధానంగా, "నీవు చాలా అదృష్ట వంతురాలవు. నా ఆశీస్సులు అందిస్తున్నాను. నీవు సాక్షాత్కారం పొంది భగవంతుని సన్నిధిలో నిలిచి ఉన్నావు కనుక, ఇది సాక్షాత్కారం అని నీతో ఎవరో చెప్పినట్లుగా తోచింది. ఎందుకంటే సాక్షాత్కారం పొందిన ప్రథమ క్షణంలో దానిని నీవు తెలుసుకోలేవు కనుక దైవం నీకు దానిని సాక్షాత్కార స్థితి అని తెలియజేసి నట్లయ్యింది. అపుడు దైవానికి నీవు ఎవరో తెలియదు. ఎవరైనా ఆ స్థితిలో అక్కడికి చేరినపుడు దైవమే తనకు తానుగా దైవం అని గుర్తుచేసుకుంటాడు. అప్పుడు తనకు తానుగా గుర్తించుకోగల్గిన దైవం తానే దైవం అంటాడు" అని స్పష్టం చేశారు.

ఎవరైనా ఆ స్థితికి చేరినపుడు దైవం వలన చెప్పబడకుండా ఆ స్థితికి చేరినట్లు ఎవ్వరికీ తెలియదు. ప్రేమ, భక్తి, సమర్పణతో బాబూజీని ఆశ్రయిస్తేనే యాత్ర అనగా అనంతయాత్ర పూర్తి అవుతుంది.

దేవుడి గురించి అందరూ చెబుతారు. కాని ఆ దేవుడి గురించిన 'అసలు' ఏమీ తెలియదు. బాబూజీ మనకు తెలుసు. అలా బాబూజీ ఇచ్చిన సహజమార్గ విధానమూ తెలుసు. ఎంతో మంది భగవత్ సాక్షాత్కారాన్ని గురించి మాట్లాడతారు. ఈ సాక్షాత్కారం అంటే ఏమిటో దాని అర్థం బాబూజీగారి వలన మనకు తెలుసు.

బాబూజీ మనల్ని గమ్యం చేర్చేందుకు భూమిపై అవతరించారు. కనుక మనం వారికే అర్పితమైపోవాలి. అనగా 'వారి' మీదే భారం వేస్తే 'వారే' సాక్షాత్కార స్థితికి తీసుకుని వెళ్ళతారు. అదే సుళువైనది. సాక్షాత్కారం మనకు ధ్యేయంగా చెప్పారు. 'వారు' అందరినీ ప్రేమిస్తారు. కనుక మనం వారికే వశమై ఉంటే తమకు

తోచినట్లుగా వారే మనకు సాక్షాత్కారం కలిగిస్తారు. సహజమార్గ విధానాన్ని 'వారు' ప్రవేశపెట్టారు. మొదట దానిని గురించి మనకు ఏమీ తెలియదు. మనకు కొంత అనుభూతమయ్యాక సహజమార్గ విధానం చాలా మంచిదని, దాని ద్వారా మనం మన గమ్యం చేరగలమని చెప్పుతాం. మనకు ఒక విధమైన సామీప్యతానుభవం కలిగి విశ్వాసం ఏర్పడుతుంది. ఆ విశ్వాసమే మనల్ని దరి చేర్చుతుంది. కనుక ప్రత్యక్షంగా మానవమాత్రులకు ధ్యేయం బాబూజీయే. చంటి బిడ్డ తల్లి ఒడిలో పూర్తిగా ఎలా అధీనమై ఉంటుందో అలాగే మనం కూడా బాబూజీకి స్వాధీనమైపోయి, "బాబూజీ! మీ ఇష్టం వచ్చినట్లు మమ్మల్ని నడిపించుకోండి" అని వేడుకుంటే వారే మన ప్రోగ్రెస్‌కు బాధ్యత వహిస్తారు.

సహజమార్గ విధానాన్ని గురించిన అవగాహన కలిగి ఉండాలి. "బాబూజీ! మీరే నా సర్వస్వం" అని మాత్రం మనస్సులో అనుకోండి. నోటితో ఉచ్చరించాల్సిన అవుసరం లేదు. హృదయంలో ఆర్తి అనగా తపన ఉండాలి. అపుడే మన అనుభూతి (ఫీలింగ్) సరైనదిగా ఉంటుంది. అందుకనే బాబూజీ అనుభూతి అనేది దైవానికి చెందిన భాష అని అన్నారు. బాబూజీ ఎదుట ప్రార్థన చెప్పుకొని భక్తి భావంతో వారికి సమర్పితమై పోవాలి. ప్రార్థనను మంత్రంగా పలుమార్లు జపించకూడదు.

**అనుభూతి (ఫీలింగ్) గురించి ఇంకా విపులంగా చెప్పగలరా? అనుభూతి దైవభాష అను నిర్వచనం, నేను సంతోషంగా అనుభూతి చెందటం వంటిదా?** – అనేది ఒకరి ప్రశ్న.

'అనుభూతి'ని మాటల్లో వ్యక్తం చేయటం సాధ్యంకాదు. దాని ఫలితం మాత్రం హృదయం ద్వారా అనుభూతమవుతుంది. దానినే మనం అత్యంతానందం అని చెప్పుకుంటాం. ఆ ఫీలింగ్‌ను ఆనందం

ద్వారా సూచిస్తాం. ఫీలింగ్‌కు ఆనందం అనేది ఒక చిహ్నం. ఈ చిహ్నం అనే మాట చాలా బరువైనదే. ఇంకా తేలికగా ఉండాలి. లైట్‌నెస్ అనే అనుభూతి (ఫీలింగ్)కి ఆనందం అనే ఫీలింగ్‌కు తేడా ఉంది. బాబూజీ "ధ్యానం తర్వాత ఎక్స్‌ప్రెషన్ (అనుభూతి) వ్యక్తం కావాలి" అంటారు.

వ్యాప్తి (Expansion) అనే దానిని గురించి మీకు ఒక ఉదాహరణ చెప్తాను. బాబూజీ ఒక అభ్యాసిని, "నీకు ఏమి అనిపించింది" అని ధ్యానమైన తర్వాత అడిగారు. దానికి అతడు సమాధానంగా తాను చాలా వ్యాపించిపోగా తన శిరస్సు ఆకాశాన్ని తాకినట్లనిపించిందని అన్నాడు. అప్పుడు బాబూజీ అతనితో "నీవు ఇక్కడే కూర్చుని ఉన్నావు. నీ శిరస్సు ఆకాశాన్ని అంటిందా!" అన్నారు. కనుక వ్యాప్తి అంటే శారీరకంగా కాదు. మనస్సు యొక్క బంధం అనగా భవబంధం యొక్క హద్దును దాటటమే. నీవు హృదయం మీద ధ్యానం చేస్తున్నావని అనుకుంటావు. నీవు ఎక్కడ చేస్తున్నావో నీకు తెలియదు. అలాగే వ్యాప్తి చెందటమంటే భౌతికంగా కాదు, శరీరమనే భౌతికమైన ఆవరణను దాటి వెళ్ళటం.

ఒకసారి ఒక అభ్యాసి తనకు ట్రాన్స్‌మిషన్ (ప్రాణాహుతి) అపారంగా వస్తోందని చెప్పటానికి చేతులు బారుగా చాపి చూపించాడు. అప్పుడు బాబూజీ "నీ చేతులు ఇంకా బారుగా చాపలేవా!" అని అన్నారు. కనుక ఆధ్యాత్మిక స్థితులను వర్ణించటానికి మాటలు చాలవు.

**ఆధ్యాత్మిక ప్రగతిలో స్వయంగా తెరవబడటం, ఓపెనింగ్ యువర్ సెల్ఫ్ అంటే ఏమిటి?**

ఆధ్యాత్మిక ఉన్నతిలో ఓపెనింగ్ యువర్‌సెల్ఫ్ అంటే 'స్వ' తనమును, స్వంతమును విడబరచుకుని విప్పార్చుకోవడం. ముడుచుకుపోయిన నీ యొక్క దాన్ని భగవంతునివైపు, వాస్తవికత (రియాలిటీ) వైపు నీ హృదయాన్ని విప్పార్చుకోవడం. బాబూజీ మహరాజ్‌వైపు హృదయాన్ని విప్పార్చుకుని ఉండటమే ఇది. నీకు నీవు 'వారి'కి నివేదనగా అయినప్పుడు నీ ఎదుటనే 'వారు' ఉండి పోతారు. నీకు నీవు ఉండవు. ఇదే ఓపెనింగ్ యువర్ సెల్ఫ్ అంటే. ఆ స్థితి యొక్క స్పృహ నీకు ఇంకా ఉండి ఉంటే, 'స్వ' యొక్క జ్ఞాపకం (ఉనికి) ఎంత మిగిలి ఉన్నా, నిన్ను నీవు విప్పార్చుకొనే ప్రయత్నంలో ఉన్నట్లే. నిన్ను నీవు అర్పించుకోవడానికి ప్రయత్నిస్తున్నావన్న మాట. కాబట్టి నీ ఎదుట బాబూజీ మహరాజ్ ఉన్నట్లు భావించు. 'నీవు', 'నీది' మరచిపోవాలి.

బాబూజీ మహరాజ్ ప్రతివారి సంరక్షణా చూస్తారు. దానికి నిదర్శనంగా బాబూజీ, వారే చెప్పిన ఒక విషయం గుర్తొస్తూంది.

బాబూజీ ఇంట్లో ఒక కుక్క ఉండేది. చూడటానికి అసహ్యంగా ఉండేది. బాబూజీ కోర్టు నుంచి ఇంటికి తిరిగి వచ్చేప్పటికి గుమ్మంలో ఎదుట నిలిచి ఉండేది. దాన్ని ఏ విధంగానైనా వదిలించుకోవాలనే ఉద్దేశ్యంతో బాబూజీ దానికి ఏమీ ఆహారం పెట్టవద్దని ఆదేశించారు. అది బాబూజీ వెంటపడి కోర్టు దాకా వెళ్ళేది. మళ్ళీ సాయంత్రం బాబూజీ తిరిగి వచ్చేసరికి గుమ్మంలో ప్రత్యక్షమయ్యేది. ఈ విధంగా మూడు రోజులు గడిచాయి. ఆ కుక్క మాత్రం బాబూజీని విడిచిపోవటంలేదు. ఆ మరుసటి రోజున కోర్టుకు వెళ్ళబోయే ముందు బాబూజీయే స్వయంగా దాన్ని చేరదీసి ఆహారం పెట్టారు. అది వారిని ఆ విధంగా అంటిపెట్టుకోవటం మూలంగా దాని

సంరక్షణ బాధ్యత వారిదైంది. ఆకలి దప్పులతో అది విడిచి వెళ్ళిపోతే బాబూజీకి బాధ్యత ఉండేది కాదు. కనుక అభ్యాసులు గాని, ప్రశిక్షకులుగాని ఎవ్వరైనా సరే బాబూజీనే ఆశ్రయించి ఉండాలనటానికి ఇది ఒక నేర్చుకోవాల్సిన పాఠం.

**తపన అనే దానిని ఎలా అభివృద్ధి చేసుకోవాలి? 'నాది' 'నేను' అనే దానిని ఎలా వదిలిపెట్టాలి?** అనే దానికి జవాబుగా 'నేను' అనిపించినప్పుడల్లా, 'దాని' (that)కి సంబంధించినది అనిపించేటట్లుగా అభ్యాసం చేయాలి. అప్పుడు 'నేను' అనుకున్నది బాబూజీ పేరిట ప్రయోగించినట్లవుతుంది. ఈ విధంగా అన్వయించుకోవటం చాలా సులభం. దీనినే బాబూజీ ఎలా చెప్పారంటే 'ఐ' అనగా 'నేను' అనేది ప్రశ్న అనుకుంటే 'యు' అనగా 'నీవు' అనేది జవాబు అవుతుంది అని. కనుక 'నేను' అనుకున్నపుడల్లా అది 'నీవు'కు చెందినదైపోతుంది. కాబట్టి ప్రశ్నలోనే జవాబు దాగి ఉంటుంది. 'నేను' 'నేను' ఏమిటి ఈ నేను? అని తరచి తరచి ప్రశ్నించుకుంటూ లోపలికి 'నేను' లోపలికి, అంతరంగం లోపలికి పోతే అక్కడ 'యు' 'అసలు' జవాబుగా దొరుకుతుంది.

అభ్యాసులు తరచుగా 'మాస్టర్' ధ్యానంలో కూర్చున్నారు, 'మాస్టర్' ధ్యానం పొందుతున్నారు. 'మాస్టర్ ధ్యానం ఇస్తున్నారు (Giving)' అని అనుకుంటూ ఉంటారు. అలా అనుకుంటూ ఉంటే మీరు ఏమి పొందుతారు? అభ్యాసిగా మీ పాత్ర ఏమిటి? మీరు ధ్యానంలో కూర్చుంటే మీరు పొందుతారు. అలా కాకుండా బాబూజీ ధ్యానంలో కూర్చున్నారనుకుంటే మీకు ఏమీ దక్కదు. 'నీవు' 'నేను' అనే భావన వదిలేసి బాబూజీ ఎదుటనే ఉన్నారు అని అనుకోవాలి. అపుడు బాబూజీ ధ్యానంలో కూర్చున్నారనే ఆలోచన

రాదు. బాబూజీ ఎదుటనే ఉన్నారు కనుక ధ్యానం సంగతి మర్చిపోతావు. బాబూజీనే చూడాలనుకుంటే అందులోనే లగ్నమైపోవాలి. అపుడు 'వారి' అందాన్ని చూడగల్గుతాము. అనుభూతి చెందుతాము. అందులో మునిగిపోతాం కనుక ధ్యానం యొక్క ధ్యాస లేకుండాపోతుంది.

ఒకసారి బాబూజీవద్దకు అభ్యాసి ఒక ఆమె వచ్చింది. తన భర్త పూజ చేయకపోగా, తనను చేయనివ్వడని, సాధుజనులు వచ్చినా చూడనివ్వరని, అలా తాను చెందుతున్న వ్యధను వెళ్ళబుచ్చింది. అపుడు బాబూజీ అన్నారు "చాలా మంది అలా ఉంటారు. మద్యం త్రాగేవారిని, జూదమాడేవారిని వారించలేరు. సోమరితనంతో కాలం వృధా చేస్తున్నా కాదనలేరు. కాని శాంతి కోసం, పవిత్ర వాతావరణం కోసం ఒక యోగిని సందర్శించాలంటే అనుమతించరు" అని. ఆమె ఇంటికి తిరిగి వెళ్ళిన తర్వాత భర్త ప్రవర్తనలో మార్పు కనిపించింది. ఆమెను పూజ చేయనిచ్చేవాడు, తర్వాత తాను కూడా అభ్యాసిగా మారిపోయాడు. అంటే బాబూజీకి మన సమస్యను నివేదించుకుంటే పరిష్కారం 'వారే' చూపిస్తారు.

వైద్యుడు ఎక్స్‌రే ద్వారా భౌతిక రుగ్మతలను పరిశీలించగల్గినట్లే నేను అభ్యాసి యొక్క ఆధ్యాత్మిక స్థితిని, అడ్డంకులను పరిశీలించగలనని బాబూజీకి చెప్పాను. వైద్యుడు ఆరోగ్యానికి వైద్యం చెప్పినట్లే అభ్యాసి ఆధ్యాత్మిక ప్రగతికి సలహా ఇవ్వటం జరుగుతుంది. వైద్యుడు చెప్పినట్లు మందు వాడకపోతే రోగ నిదానం కానట్లే, సహజమార్గపు సలహాను పాటించకపోతే ఉన్నతి సాధ్యం కాదు.

ధ్యానంలో ఆలోచనలు వస్తాయి. అది తప్పు కాదు. అది మనం ఆహ్వానించితే వచ్చేవి కావు. బాబూజీని మన హృదయంలోకి

ఆహ్వానించాం, ఆలోచనల్ని మనం ఆహ్వానించలేదు కనుక వాటిని పట్టించుకోకపోతే అవి స్థానం దొరక్క తొలగిపోతాయి. బాబూజీని (లక్ష్యమును) స్మరించుకుంటే అవి దొంగల్లాగా పారిపోతాయి.

నెగిటివ్ థాట్స్, వ్యతిరేక భావాలు (అవాంఛనీయమైన ఆలోచనలు) రావచ్చు. వచ్చినంతమాత్రాన తప్పు కాదు కాని, వాటిని ఆచరణలో పెట్టితే అది తప్పు మాత్రమే కాదు శిక్షార్హమవుతుంది కూడా. దొంగ, దొంగతనం చేయనంతవరకు, దొంగ అనటానికి వీలు కాదు. బాబూజీ పరమ పాపులను కూడా పునీతులను చేసి ఉద్ధరించటానికే వచ్చారు.

మామూలుగా శుభకార్యాలు, సమావేశాలు జరిగినపుడు మంచిని విడిచి దోషాలనే ఎంచి చర్చించటం జరుగుతుంది. లోపాలే దృష్టికి వస్తాయి. కాని లక్నోలో జరిగిన ఫంక్షన్ గురించి ఇంటికి వెళ్ళాక అంతా మంచిగానే తలచుకుంటారు. ఎందుకంటే హృదయం నుండి ఎంతో ప్రేమను పంచుకోవటం, పొందటం మూలాన్నే అలా అనుభవమవుతుంది.

ధ్యానం చేసేప్పుడు దివ్యకాంతి నీ హృదయంలో ఉందని భావించుకోవాలి. ట్రాన్స్‌మిషన్ (ప్రాణాహుతి) గురించి ఆలోచించు కోనవసరం లేదు. ఆలోచనకు యత్నం (Effort) ఉంటుంది కాని ఆధ్యాత్మికతలో ప్రయత్నం ఉండదు. ధ్యానంలో ఎక్కువగా నిమగ్నమై ఉండటమే ముఖ్యం. దానితోపాటు నీకు వస్తున్న ప్రాణాహుతిని జీర్ణించుకున్నట్లు (ఎబ్జార్పషన్), ధ్యానంలో మునిగిపోతున్నట్లు అనుకోవాలి. అలా కాకుండా ప్రయత్నపూర్వకంగా అలా చేస్తే ఆ భావానికే కట్టుబడిపోయినట్లు అవుతుంది. సంతోషం అనుభవ మవుతుంది. ప్రోగ్రెస్ అనేది ప్రాణాహుతితో వేరై ఉండదు. అందులో

శక్తి ప్రవాహం ఉంటుంది. నీవు ఒకే దానిలో ఉండలేవు. ప్రయత్నం చేయడం వలన అలసిపోవడం జరుగుతుంది.

**ఒక వారం ధ్యానంలో మనస్సు బాగా లగ్నమవుతుంది. మరో వారంలో అలా నిలకడగా ఉండదు, ఎందుచేత?**

ధ్యానంలో లగ్నమై ఉండమని, దాని మీద ధ్యాస కలిగి ఉండమని బాబూజీ చెప్పారు.

దివ్యకాంతి ఉంది. బాబూజీ మహరాజ్‌ను చూస్తున్నాం. వెదుకుతున్నాం. ప్రాణాహుతి పొందుతున్నాం. దానిలో నుంచి బయటకు రాకుండా అందులోనే ఉండటానికి ప్రయత్నించండి. ఎంత వస్తే అంతే వస్తుంది. మధ్యలో ధ్యానం ఆపవద్దు. బాహ్యఆలోచనలతో ధ్యానాన్ని భంగపరుచుకోవద్దు. ధ్యానం సాగించు.

బాబూజీ తాము సిట్టింగ్ ఇచ్చిన అభ్యాసిని ఎలాంటి అనుభూతి చెందావు అని ప్రశ్నిస్తే, దానికి అతడు చాలా ఆలోచనలు వచ్చాయి, అని సమాధానం ఇచ్చాడు. అపుడు బాబూజీ, నీకు ఎన్ని ఆలోచనలు వచ్చాయి, ఎవరెవరు వచ్చారని నేను అడగడంలేదు. నీకు ఏమి (ఫీలింగ్) అనిపించిందో చెప్పు అన్నారు. అందుకు అతడు సమాధానం చెప్పలేకపోయాడు. అనగా ఫీలింగ్ మాటల్లో చెప్పతరం కాదు.

**నిన్న నాకు బాగా ప్రాణాహుతి జీర్ణించుకున్నట్లు అనిపించింది. ఈ రోజు అంతగా అనిపించలేదు. ఎందుచేత?**

అది అభ్యాసి యొక్క అవసరాన్నిబట్టి ఉంటుంది. నీకు ఎంత అవుసరమో అంతే లభిస్తుంది.

1995వ సంవత్సరం మద్రాసులో ఫంక్షన్స్ (ఉత్సవాలు) జరిగేటప్పుడు చారిగారు సిట్టింగ్స్ ఇవ్వవద్దని అన్నారు. బాబూజీ అనుగ్రహం కురుస్తోంది కనుక సిట్టింగ్స్ అవుసరంలేదని అన్నారు. అనుచరులు అడిగిన మీదట నేను రోజంతా సిట్టింగ్స్ ఇచ్చాను. చారిగారు నన్ను ఎందుకు ఇస్తున్నావని ప్రశ్నించారు. అపుడు నేను చెప్పాను, అభ్యాసులు ఏదో పొందాలని వస్తారు. లేకపోతే ఇక్కడికి రావలసిన అవుసరం, రోజంతా కాలక్షేపం చేయాల్సిన అవుసరం ఉండదే! వారు కావాలని కోరుకుంటున్నపుడు ఇస్తే వారికి లాభం కలుగుతుంది. బాబూజీ మహరాజ్ కూడా సంతోషిస్తారు. కనుక ఈ సందర్భాన్ని సద్వినియోగం చేస్తాను అని చెప్పి ఉదయం నుంచి సాయంకాలం వరకు సిట్టింగ్స్ ఇచ్చాను.

ఒకసారి బాబూజీ తమ ఇంటి వద్ద వరండాలో కూర్చుని ఉన్నారు. అపుడు పూజగదిలో ఉన్న అభ్యాసులతో ఒక ప్రిసెప్టర్ పదే పదే నేను ప్రిసెప్టర్, నేను ప్రిసెప్టర్ అని ఏదేదో చెబుతున్నాడు. అపుడు బాబూజీ అతని దగ్గరకు వెళ్ళి, "నేను నిన్ను నీవు ధ్యానం ఇచ్చే సమయంలో మాత్రమే ప్రిసెప్టర్‌గా చేశాను. ఇప్పుడు నీవు మామూలు అభ్యాసివే" అన్నారు.

**భయం గురించి వివరించండి. నేను ఇక్కడకు వచ్చినపుడు నిర్భయంగా ప్రశాంతంగా ఉంటాను. డెన్మార్కులో మన మిషన్‌లో ఉన్నప్పుడు భయం చెందుతాను, ఎందుచేత?**

బాబూజీ మహరాజ్ మన సంరక్షకులు. కాని బాండేజ్ అయి బాహ్య పరిస్థితులకు లోబడి ఉండటం జరుగుతోంది. అందుకే భయం కలుగుతుంది. అలా బంధం లేకుండా చేసుకుంటే భయం కలగదు. కనుక బాండేజ్‌యే (బంధమే) భయానికి కారణం.

ఒకసారి అలహాబాద్ ఉత్సవంలో చూశాను. ఒక అభ్యాసి చపాతీ అడగ్గా పది రూపాయలు ఇవ్వమని అడిగారు. అక్కడ దానికి పది రూపాయలు కిమ్మతు అని బోర్డు పెట్టారు. ఆ విధంగా వారు డబ్బు సంపాదించటం నాకు నచ్చలేదు. నేను వారితో ఇది చాలా అమర్యాదకరం, ఆధ్యాత్మికంగా ఇది అనుచితమనీ చెప్పాను. నేను అలా డబ్బు ఇవ్వడానికి కూడా నిరాకరించాను. మీకు డబ్బు లేకపోతే డబ్బు ఇస్తాను గాని ఇలా చపాతీకి (ఆహారానికి) విలువగా చెల్లించనన్నాను. కనుక ఆశ్రమంలో సంపాదనగా అలా డబ్బు వసూలు చేయటం భావ్యంగా ఉండదు.

**అయితే అది భయం కాదన్నమాట. మీరు ఎప్పుడూ భయానుభూతి చెందలేదా?**

బాబూజీ తమ పుస్తకంలో భయము, ప్రేమ రెండూ కలిసి ఉండలేవు అని వ్రాశారు. దానికి సరైన అర్థం నాకు తెలియదు. కాని నేను చెప్పింది చాలా కరక్ట్. సంతోషంగా ఉన్నట్లనిపిస్తే తేలికగా ఉన్నట్లనిపిస్తుంది. అనగా ఆనందం అనే ఫీలింగ్‌తో తేలికదనం (లైట్‌నెస్) అనేది అంటిపెట్టుకొని ఉంటుంది. అసంతృప్తి అనేది ఆందోళన లేదా భయానికి కారణమైతే సంతృప్తి లేదా ఆనందం అనేది ప్రేమకు కారణమౌతుంది. బాబూజీ ప్రేమ అనబడు తండ్రి వంటి వారు. 'వారి' ఆశీస్సులు వృథా కావు. అంతా వారికే వదిలి వేయాలి.

ఒక సాధువు నన్ను బాగా అభిమానించేవారు. నేను వారిని కలుసుకున్నప్పుడల్లా భగవద్గీతను గురించి చెప్పేవారు. నేను ఎప్పుడూ భగవద్గీత బాగా చదవలేదు. ఒక గీతా జయింతి రోజున సభ నిర్వహించబడింది. చాలా మంది సన్యాసులు, గీతా జ్ఞానం కలిగిన

వారు సమావేశమై ఉన్నారు. ఆ సభలో ప్రసంగించమని నన్ను బాబూజీ ఆదేశించారు. నిర్వాహకులు ఇరవై నిమిషాలు వ్యవధి ఇచ్చారు. వేదిక మీదకు వెళ్ళాను. ఏమి మాట్లాడాలో తోచటం లేదు. నా ఎదుట బాబూజీ, మరో సన్యాసి మాత్రమే ఉన్నట్లు కనిపిస్తున్నారు. మిగిలినవారు నాకు కనిపించటంలేదు. ఆ సమావేశంలో లాలాజీ మహరాజ్ సోదరుడు, కుమార్తె కూడా ఉన్నారు. అంతా నిశ్శబ్దంగా ఉంది. ఒక్కసారిగా నా నోరు మెదపాలని నిర్ణయించుకున్నాను. భౌతికంగా మాటలు బయటకు రాలేదు. కాని ప్రసంగం ముప్పై నిమిషాలు సాగింది. ఆ భారం బాబూజీ వహించారు. చివరకు ప్రసంగం ఎలా ఉంది అని అడిగితే ఆ సమయమంతా మాటల్లేకుండా ప్రాణాహుతి ప్రసారమైందని అన్నారు. అందరూ ధ్యానంలో మునిగిపోయారు. ఆ విధంగా బాబూజీ నాకు రచించటం, మాట్లాడటం, పాడటం కూడా నేర్పారు. అప్పటి నుండి నేను ఉపన్యసించగల్గుతున్నాను. 'వారు' ప్రోత్సహించక పూర్వం నాకు హార్మోనియం వాయించటం కూడా రాదు. అన్నింటికీ బాబూజీ తప్ప నాకు మరో మాస్టర్ లేరు.

ఒకసారి బాబూజీతో నేను, "బహుశా మీరు పాడతారను కుంటున్నాను" అని అన్నాను. దానికి వారు, "నీవు అలా ఎందుకు ప్రశ్నించావు" అని అడిగారు. ఎందుకంటే నేను ఏదైనా పాట వ్రాసేటపుడు, పాడేటపుడు వారు నా ఎదుట కూర్చునే వారు. "పాడటానికి ప్రయత్నించు, అవసరమనుకుంటే అంతిమం శక్తి నుంచీ స్వరం పలుకుతుంది" అని అనేవారు. "నేను ఆధ్యాత్మిక విషయాల్లో మాస్టర్‌ను! కావాలనుకుంటే నీవు పరీక్షించుకో" అన్నారు. కనుక 'వారి' ప్రేమతో మనం ఏదైనా అభ్యాసించవచ్చు. లెక్కలు, ఇంగ్లీషు రాని వారు వాటిని ఎలా బోధించలేరో, తాను కూడా

ఆధ్యాత్మికతా విషయం తప్ప మిగిలినవి బోధించలేనని అన్నారు. బాబూజీ, "నేను నీకు ఏదైనా ఇవ్వగలను. ఈ ప్రపంచం సృష్టికర్త ఆధీనంలో ఉంది. ఆ సృష్టికర్త, మానవమాత్రులను అంతిమానికి తీసుకొని వెళ్ళటానికి నాకు ఒక అవకాశమిచ్చి నన్ను ఇక్కడికి పంపారు" అన్నారు.

లాలాజీ మహరాజ్ గానం చేసేవారు. బాబూజీ మహరాజ్ కూడా బసంత్ పంచమి సందర్భంలో 20, 25 నిమిషాలు పాడేవారు. 'వారి' గాన తరంగాలు అప్పుడప్పుడు నాకు వినిపిస్తూ ఉంటాయి. బాబూజీ తాము చెప్పేవి రికార్డు చేసినా వ్రాసినా వద్దనే వారు కాదు. కాని ఆ రోజుల్లో రికార్డు చేసుకోవటానికి ఈ సాధనాలు ఉండేవి కావు. 'వారి' గొంతు (voice) మనం బాగా శ్రద్ధగా వినగలిగితే వినిపిస్తుంది. 'వారి' స్మృతిలోకి బాగా లోతుగా లీనమైపోతాం. బాబూజీ ఎల్లప్పుడూ ఉన్నారు. 'వారి' నుంచి ప్రేమ ఎల్లప్పుడూ ప్రవహిస్తూనే ఉంటుంది. దానికి ముగింపు అనేది ఉండదు.

గ్రంథులు (నాట్స్) గురించిన చిత్రం నా కళ్ళకు కట్టింది. గ్రంథి అనేది ఏలా ఉంటుందో, అంతిమం (Ultimate) నుంచి ఎలా ఏర్పడిందో నేను చూసిన దానిని సోదరుడు ప్రసాద్ చిత్రీకరించారు. అంతిమం నుంచి శక్తి క్రిందకు ప్రవహించినపుడు అది ప్రవహించిన వాతావరణాన్ని బట్టి అంచెలంచెలుగా ఒక్కొక్క గ్రంథి ఏర్పడటం జరిగింది. ఇలా ఏర్పడిన ముఖ్యమైన పదమూడు గ్రంథులలోను వేర్వేరు స్థితులు ఉన్నాయి. ఋషులు ఏ విధంగా ఇటువంటి విషయాలు గ్రహించగల్గేవారో ఆ జ్ఞానాన్ని బాబూజీ నాకు ప్రసాదించి వాటి యొక్క వాస్తవిక స్థితులను నాకు చూపించారు. వాటిని యథాతథంగా వ్రాయటానికి నేను నా శక్తి వంచన లేకుండా

ప్రయత్నించాను. ఏ విధమైన అణువులు ఇక్కడ ఉంటాయో తెలియదు కాని మనం ఇక్కడి నుంచి పైకి మూలశక్తి వైపు వెళ్ళుతుంటే అణువులలో మార్పు కనిపిస్తుంది. గ్రంథుల్లో మార్పుకు కారణం శక్తి యొక్క సూక్ష్మత్వానిదై ఉంటుంది. మనం ధ్యానంతో ఉన్నత లక్ష్యంవైపు ప్రయాణం ప్రారంభించినపుడు స్థూలత్వం (Grossness) నుంచి సూక్ష్మత్వం (Subtleness) చెందటం మొదలవుతుంది. ఆ విధంగా అత్యంత సూక్ష్మత్వం చెందినపుడు ఆత్మ తన పరిధిని అనగా గ్రంథుల సరిహద్దు దాటినట్లవుతుంది. పరమాత్మ శక్తిని ఆత్మ పొందుతుంది.

బాబూజీ గుప్త చలనం లేదా అంతర్గత చలనం అని చెప్పారు. అది ఎటువంటిదని నేను ప్రశ్నించినపుడు నాకు ఒక దృశ్యం చూపించారు. దాని స్వరూపమే "గ్రంథి దర్పణం" పుస్తకానికి ముఖచిత్రంగా ప్రింట్ అయ్యింది. ఆ దృశ్యాన్ని చూస్తూ నేను దాని రంగు రేఖల స్వరూపాన్ని చిత్రించాను. ఆ రూపకల్పనే ముఖచిత్రానికి ఆధారం. ఈ గుప్త అంతర్గత చలనం గురించి వ్రాయమని ఆదేశించారు బాబూజీ. రచనలు చదివి దానిని వ్రాయటానికి చాలా సమయం పడ్తుందని అన్నాను. అప్పుడు 'వారు' చూపించిన ఆ స్థితులను చూసిన తర్వాత పుస్తకంలో విషయం చదివి వ్రాయమన్నారు. ఆ విధంగా అంతర్గత చలనం యొక్క భావం నా కలానికి అప్రయత్నంగా కలుగుతూ ఉండటంతో దానిని యథాతథంగా వ్రాయగల్గాను.

ఆ విధంగా నేను వ్రాయటానికి కావలిసిన విషయమంతా వారే ఇచ్చారు. నిండుపాత్రలోని నీటిలో ఏదైనా వస్తువు వేస్తే నీరు పొంగుతుంది. అది చుక్కలుగా క్రింద పడుతుంది. అలాగే ఆలోచనా

చలనం అనేది అంతిమంలో కలిగినపుడు దానిలో శక్తి అనేది బిందువులుగా జారి అధోముఖంగా పడుతుంది. అలా పడుతున్నపుడు దాని వాతావరణ స్థితులను బట్టి మార్పు చెందుతూ ఒక్కో బిందువు ఒక్కొక్క స్థితిని కలిగి ఉంటాయి. ఆ శక్తి బిందువులే గ్రంథులు.

పార్షద్, మహాపార్షద్ స్థితులను నాకు ప్రత్యక్షం చేశారు. బాబూజీ ఈ స్థితులు అన్నిటినీ వ్రాత పూర్వకంగా తెలియజేయాలని కోరారు. దానిని బట్టి ఏ ఒక్క అభ్యాసినైనా అంతిమానికి తాను తీసుకెళ్ళగల్గినట్లు మానవాళి గ్రహించితే ప్రతి ఒక్కరినీ అక్కడికి తీసుకొని వెళ్ళగలనని అన్నారు. ఈ విధంగా బాబూజీ నాకు గ్రహింపజేసిన వాటినన్నిటినీ పగలంతా వ్రాయటంలో నిమగ్నమై ఉండవలసి వచ్చేది, ఆ సమయంలో ఏదైనా ఎవరైనా అడిగితే నాకు తీరికలేదని చెప్పవలసి వచ్చేది. ఆ సందర్భంలో ఎవరికైనా నా మీద కోపం వచ్చి ఉండవచ్చు. బాబూజీ నా ఎదుట ఉండి చెప్తున్నపుడు నేను ఆ పనిలో (వ్రాత పనిలో) నిమగ్నమై ఉండిపోవలసిందే గదా!

ఒకసారి ఫరీదాబాద్‌లో ఉంటున్న మా సోదరుడు తన ఇంటికి వచ్చి రచనా కార్యక్రమం చేసుకోమన్నాడు. అక్కడయితే తీరిక చిక్కుతుందని అభిప్రాయం. అలాగే వెళ్ళాను. అక్కడికి కూడా లండన్‌లో ప్రిసెప్టర్ అయిన పరమ్‌జిత్ కౌర్ అనే ఆమె వచ్చి సిట్టింగ్ తీసుకున్నారు. ఆమె చాలా ఆనందించింది. ఆమె చారిగారిని కలుసుకోవలసి ఉంది. అప్పుడాయన ఢిల్లీ ఆశ్రమంలో ఉన్నారు. వారి ప్రోగ్రాం ఆమెకు తెలుసు. మా సోదరుడు ఆమె అక్కడకు వెళ్ళి రావటానికి కారు కూడా ఏర్పాటు చేసి ఉంచాడట. కాని

ఆమె ఆ సంగతి మరచిపోయి ఆఖరి క్షణంలో లండన్‌కు బయలుదేరి వెళ్ళిపోయింది. ఈ విధంగా అక్కడ కూడా చాలా మంది వస్తూ ఉండటంతో నా రచనా కార్యక్రమం సాగలేదు.

లాలాజీ బాబూజీతో ఒకసారి "నేను నీతో ఉండటం నా అదృష్టంగా భావిస్తున్నాను. ఎందుకంటే జనులు నిన్ను జ్ఞాపకం చేసుకున్నప్పుడల్లా నన్ను కూడా జ్ఞాపకం చేసుకుంటారు" అన్నారు. అయినప్పటికీ లాలాజీ ఎన్నడూ బాబూజీతో నేను నీ మాస్టర్‌ను అని అనలేదు.

భగవంతునికి మైండ్ (మనస్సు, ఆలోచన) లేదు. సాధకుడు దైవం ఉన్న మండలానికి చేరినపుడు ప్రశ్నలు అతడిని తాకవు. జవాబు (Response) మాత్రం ఆ మండలం నుంచే వస్తుంది. సాధకుడు కూడా దానిని వినగల్గుతాడు. అంటే అక్కడ కూడా బాబూజీయే అంతా తానే అయి ఆ పని నిర్వహిస్తారు. దీనినే సిబర్‌కాన్ సిస్టమ్ అని అంటారు.

ఒకసారి వరదాచారిగారు నన్ను "మీరు కాఫీ ఎందుకు తీసుకోరు. చాయ్ మాత్రమే ఎందుకు తీసుకుంటారు" అని ప్రశ్నించారు. నేను దానికి జవాబుగా, "కాఫీ అనగా హిందీలో చాలినంత అని అర్థం. కనుక (ఆధ్యాత్మికంగా) నాకు సరిపోయింది అనుకోవటం నాకు ఇష్టం ఉండదు. అలాగే చాయ్‌ను చాయ్యంగా తీసుకుంటే కోరిక అవుతుంది. నేను ఇంకా (ఆధ్యాత్మికతను) కోరుకుంటాను గనుక నేను దానినే తీసుకంటాను" అన్నాను.

మరొకసారి వరదాచారిగారే బాబూజీని "మీరు ప్రతి ఒక్కరూ దైవ సాక్షాత్కారం పొందగలరని అంటున్నారు, అది సంభవమా?" అని ప్రశ్నించారు. దానికి సమాధానంగా బాబూజీ, "అవును, అది

సంభవమేనని నేను చెబుతున్నాను. అది ఎలా అంటే, నేను ఇక్కడ కూర్చుని ఆకాశాన్ని చూడగల్గుతున్నట్లే, అందరూ చూడగల్గుతున్నారు. అదే విధంగా అందరూ ఆ సృష్టికర్తను చూడగల్గుతారు" అన్నారు. అంటే బాబూజీ మహరాజ్ సిస్టమ్ అందరి కొరకు.

**నేను ధ్యానం చేసేటపుడు లెక్చర్ (ఉపన్యాసం) ఇస్తున్నట్లుగా అనుకుంటాను. దానిని కూడా ధ్యానమే అనవచ్చునా! అది కూడా ధ్యానమే అవుతుందా? ఒకరి ప్రశ్న.**

లెక్చర్ ఇస్తున్నట్లు నీవే చెబుతుంటే అది ధ్యానం ఎలా అవుతుంది. ధ్యానం అంటే బాహ్యాఆలోచన లేకుండా మునిగిపోవటం. అలా మునగకపోతే ఎన్నో విషయాలు వస్తాయి. కనుక ధ్యానంలో మునిగి బయటకు వచ్చాకనే మాట్లాడాలి.

ఫ్రాన్స్‌లో ఒక అభ్యాసి బాబూజీతో, **"మీరు వ్యక్తి మంచివాడైనా కావచ్చు చెడ్డవాడైనా కావచ్చు అంటున్నారు, దాని అర్థం ఏమిటి? మంచి చెడులు ఎలా నిర్ణయిస్తారు, తేడా ఏమిటి?"** అని అడిగాడు. దానికి సమాధానంగా "తేడా చాలా స్వల్పం" అని చెప్పారు. ఉదాహరణకు రెండు ఆంగ్లపదాలు సిన్, సన్ (SIN, SUN) ఉన్నట్లు, వాటిలో మొదటి చివరి అక్షరాలు ఒక్కటే అయినా మధ్యలో ఒక మాటలో 'ఐ' (I), రెండో మాటలో 'యు' (U) ఉన్నాయని విడమర్చి చెప్పారు. అప్పుడు నీవు అనగా 'ఐ' (I) 'నేను' అనే ఫీలింగ్‌తో ఏ పని అయినా చేసినట్లయితే అది 'సిన్' (SIN) అవుతుంది. అనగా ఆధ్యాత్మిక దృష్టిలో అది 'అహం' అవుతుంది. అట్లా కాకుండా ఏ పనినైనా దైవాన్ని దృష్టిలో ఉంచుకొని 'నీవు' (U) చేస్తున్నావని భావించితే (ఫీలయితే) అది 'వారి'కి చెందుతుంది.

అది సద్భావమవుతుంది అని చెప్పారు. అక్కడ చాలా ప్రశ్నలు వేశారు. జవాబు చెప్పారు గాని జ్ఞాపకం లేవు.

బాబూజీ మహరాజ్‌కు ఒకసారి ఉత్తరం వ్రాస్తూ ఏదైనా వ్రాసినపుడు తప్పు ఉందని తెలిస్తే నాకు చాలా బాధ కలుగుతుంది అని వ్రాశాను. అందుకు సమాధానంగా బాబూజీ "నీవు వ్రాసేటపుడు అందులో నిమగ్నమైపో, నీవు తప్పు ఒప్పు అని తర్కించుకోవలసి వచ్చినపుడు నన్ను స్మరించుకో, ఆ తర్వాత నీవు తప్పు వలన కలిగిన ఫీలింగ్ నుంచి బయటపడతావు" అని సలహా ఇచ్చారు. తప్పు చేయకుండా లేదా జరగకుండా చూడాలి. ఒకవేళ తప్పు జరిగినా లేదా చేసినా మళ్ళీ పునారావృతం కాకుండా చూడాలి. కరక్టు చేసుకోవటానికి మళ్ళీ మళ్ళీ ప్రయత్నించాలి అన్నారు.

సత్యము అనే స్థితి యొక్క అన్ని స్థితులలోను తాము సత్యము మాత్రమే మాట్లాడతామని ఋషులందరూ చెప్పారు. నేను బాబూజీ మహరాజ్‌కు ఒకసారి ఇలా వ్రాశాను– "నేను మధనపడుతున్నాను. ఎందుకంటే, నా నాలుక మీద ఏదో పొర లాంటిది ఏర్పడినట్లుంది. అప్పటి నుండి నేను ఏదైనా అసత్యం పలకాలన్నా అది సత్యమే పలుకుతోంది" అని. అప్పుడు బాబూజీ, "సత్యము అనేది దైవత్వానికి చెందింది. ఇదే సత్యస్థితి. ఋషులందరూ ఈ స్థితి నుంచే మాట్లాడతారు. ఇది ట్రూత్ ఎటర్నల్ పుస్తకంలో ఉంది" అని సమాధానం ఇచ్చారు.

బాబూజీ ఎక్కువగా చెప్తూ ఉండేవారు. ఏమంటే, "మీరు అంతా కలిసి కూర్చున్నపుడు ఏదో అనుభూతి కలుగుతుంది. అంతా మంచి విషయాలే మాట్లాడండి. మీకు ఏదో ఒకటి అందుతూ ఉంటుంది" అని. ఒకసారి రాజగోపాలన్ నాతో, "మీరు ఎప్పుడు

మాట్లాడినా బాబూజీ గురించే చెప్తూ ఉంటారు. అది ఒక విధంగా స్తుతించటమేమో గదా!" అని అన్నాడు. నేను అప్పుడు స్తుతి అన్నా, బాబూజీ గొప్పదనమన్నా నీకు ఏమీ తెలియదు. నేను వారిని చూస్తున్నాను కనుక, నేను చెపుతున్నవన్నీ 'వారు' ఇస్తున్నవే కనుక 'వారి' గురించి నాకు తెలుసు. నీవు ఇంతటి వాడివి, అంతటివాడివి అని ముఖస్తుతి చేసే వారికి వారిని గురించి ఏమీ తెలియదు. నేను తెలుసుకున్న దానిలో వాస్తవికత ఉంది. మీకు అది స్తుతిగా కనిపిస్తుందని అన్నాను.

లోకులు సామాన్యంగా, "సెల్ఫ్‌లెస్ సర్వీస్" నిస్వార్థసేవ అంటూ ఉంటారు. అది చాలా కష్టము అన్నారు బాబూజీ. అందుకు మళ్ళీ అర్థం చెపుతూ 'సెల్ఫ్' అనగా 'నా' అనే ఫీలింగ్ ఉన్నంతవరకు మీరు అది చేయలేరు అని చమత్కరించారు.

అభ్యాసులమై మనం బాబూజీ వెంటపడటమే కాదు, బాబూజీ కూడా మనల్ని తరుముతూ ఎలా తొందరపెడ్తారో అన్నదానికి ఉదాహరణగా నేను షాజహాన్‌పూర్ వెళ్ళినపుడు, ఆశ్రమానికి వెళ్ళటానికి రిక్షా వచ్చేస్తోంది త్వరగా తయారుకమ్మని చెప్పి, బయలుదేరేవరకు రెడీ అయ్యావా లేదా అంటూ అనేకసార్లు హెచ్చరిస్తూ ఉండేవారు. బయలుదేరాక కూడా వస్తున్నావా లేదా అంటూ వెనక్కు తిరిగి చూస్తూ ఎప్పటికప్పుడు గమనిస్తూ నడిచేవారు. అనగా మన విషయంలో 'వారు' అంతగా శ్రద్ధ తీసుకుంటారు. ఇది ఒక విధంగా ఫిజికల్ రియాలిటీ అనగా భౌతికమైన వాస్తవికత అనబడుతుంది.

**మరపు స్థితి (ఫర్‌గెట్‌ఫుల్ స్టేట్) :**

ఫిజికల్ రియాలిటీ అనగా భౌతికమైన వాస్తవికతలో కూడా

బోండేజి (Bondage) అనగా ఒక బంధం ఉన్నట్లవుతుంది. బాబూజీని మనం గుర్తు చేసుకుంటున్నామంటే మనల్ని మనం మరచిపోతాం. ఇది మరపు స్థితి. మనం వారి ధ్యానంలో ఉంటూనే ఉన్నా మధ్యలో 'వారు' ఏదో మెరుపులా జ్ఞాపకం వచ్చినట్లుంటుంది. అపుడది మనకు షాక్ లాగా అనిపిస్తుంది. మనం దివ్యప్రకాశంలో ప్రవేశిస్తాం. ఆ ప్రకాశంలోనే ఉంటాము. అందులోనే మునిగి అనగా కళ్ళు మూసుకొని ఆ లోవెలుగునే చూస్తూ ఉంటాము. ఆ బంధం (Bondage) సడలిపోకుండా అలాగే కొనసాగుతూ ఉంటుంది. ఇదే ఎడతెగని బంధము (Craving), కోరిక. అక్కడే మన జీవనం (లివింగ్) అనగా నిలకడ ఉంటుంది. ఆ ప్రకాశం వెనుక 'వారు' ఉంటారు. ధ్యానంలో నిమగ్నమైనపుడు మన ఉనికి మరచి వారి తలంపులోనే లీనమవుతాం. మళ్ళీ జ్ఞాపకం వచ్చినట్లు షాక్ లాగా అనిపించగానే మనం వేరుగా ఉన్నట్లు అనిపిస్తుంది. అలా వేరుగా ఉన్న భావం కలగగానే మళ్ళీ ప్రేమాతిశయంతో వారియందే మనస్సు లీనమవుతుంది. 'వారు' మనలో లేరనే భావం కలగకూడదు. కాని మధ్యలో మనం ఎక్కడో ఉన్నామనే తలంపు రాకపోతే వారియందు మనకు ప్రేమాతిశయం కలగదు. మనం వారిని స్మరించి నిద్రపోయినా మన అంతర్‌దృష్టి వారి మీదనే ఉంటుంది. వారి దృష్టి మన మీద ఉంటుంది. 'వారు' మనల్ని అంటిలేరనే భావం ఉండకూడదు. 'వారు' ఎప్పుడూ మన వెంటే ఉన్నారు, ఉంటున్నారు, ఉంటారు – అని భావించుకోవాలి. మనం వారి ధ్యానంలో వారి చరణాలనే అంటి ఉండాలి. 'వారు' నాతో "బిటియా! ఆధ్యాత్మికంగా అందరూ ఒక్కటే, అందరిలోనూ ఈశ్వరుడు ఉన్నాడు" అనేవారు.

ఒక్కొక్క శబ్దానికి సందర్భాన్నిబట్టి అర్థం వేరుగా ఉంటుందని చెప్తూ శ్రీ బాబూజీ మహరాజ్ ఇలా అన్నారు: "భాషాపరంగా ఒక

వాక్యానికి చివర పాయింట్ అనగా పుల్‌స్టాప్ ఉంటే అది ఆ వాక్యానికి అంతం అవుతుంది. కాని ధ్యాన సమయంలో స్టాప్ అంటే అది ధ్యానానికి ముగింపు కాదు. దైనందిన జీవితంలో ఇతర కార్యకలాపాలు నిర్వర్తించుకోవటానికి ధ్యానానికి తాత్కాలిక విరామమే కాని సమాప్తం కాదు. ఒకవేళ దానిని సమాప్తం లేదా పుల్‌స్టాప్ అనుకుంటే అది పూల్స్‌స్టాప్ మాత్రమే అవుతుంది. అనగా మూర్ఖత్వమే అవుతుంది."

మనం ధ్యానంలో మునిగి ఉంటూ దివ్యదర్శనం కొరకు అన్వేషణ జరుపుతూ ఉండాలి. మనకు కనిపించే దివ్యకాంతి ఎక్కడి నుండి వస్తోందో, ఎవరి నుండి వస్తోందో అన్వేషించాలి. మన సహజమార్గంలో దివ్య ప్రాణాహుతి ప్రవాహం నిరవధికంగా (ఏకధాటిగా) ప్రవహిస్తూ ఉంటుందే కాని ఆగిపోవటం అనేది ఉండదు. పూర్తిగా నిలిచిపోవటమన్నది మనం సాక్షాత్కారం పొందినపుడు మాత్రమే! ఆగిపోతుంది అనుకోవటం అజ్ఞానం.

ఆలోచనా రహిత స్థితి అన్నది కేవలం మస్తిష్కం (మైండ్) యొక్క తాత్కాలిక మళ్ళింపు మాత్రమే. ఆలోచన లేకుండా ఉండటమన్నది మానవ మాత్రులకు అసాధ్యం. ఆ స్థితి దైవానిది మాత్రమే. ఎందుకంటే దైవానికి మైండ్ (మస్తిష్కం) లేదు కనుక. ఈ స్థితిలో మానవుని మనస్సు బాహ్యదృష్టి నుంచి ఆంతరిక దృష్టిగా మార్పు చెందటం మాత్రమే అవుతుంది. మానసిక క్రియ ఏదో రీతిలో జరుగుతూనే ఉంటుంది. ధ్యానం మన స్వాధీనంలో ఉండదు. మనమే దాని వశమై ఉండాలి. ధ్యానంలో మునిగి ఉంటే సమయోచితంగా, మనకు ఆత్మ దర్శనమవుతుంది. నేత్రాలు బాహ్యప్రపంచాన్ని చూడగలవేగాని ఆంతరంగిక దృశ్యాలను

చూడలేవు. అందుచేత మన దృష్టి అంతర్‌ముఖమై (లోపలికి) ఉంటే, దివ్య నేత్రాల ద్వారా అనగా దివ్యదృష్టి ద్వారానే మనకు దివ్య దర్శనం కలుగుతుంది. అర్జునునికి శ్రీకృష్ణపరమాత్మ తన విశ్వరూప సందర్శనాన్ని దివ్యదృష్టి ద్వారానే చూపించారు. బాహ్య దృష్టి మనల్ని ప్రాపంచిక విషయాలవైపు మళ్ళిస్తుంది. కాని బాబూజీ మన దృష్టిని తనవైపు ఆకర్షించినందువల్ల బాహ్యదృష్టికి భంగం కలుగుతుంది.

**ప్రశ్న: ఆది, అంతము ఏమిటి?**

**జవాబు:** సృష్టికర్త సృష్టి రచన చేయటం ఆరంభించినది 'ఆది' అనబడుతుంది. దాని వినాశము గావించబడినపుడు 'అంతం' అవుతుంది. అనగా సృష్టి, స్థితి, లయలు అన్నీ సృష్టికర్తవే అయి ఉంటాయి.

**ప్రశ్న: సెయింట్ (అనగా యోగి) అంటే ఎవరు?**

**జవాబు:** సెయింట్ అను దానిని బాబూజీ ఇలా నిర్వచించారు:

సెయింట్ అయిన వారు తమ ముందుకు వచ్చిన వ్యక్తి ముఖం చూసి తమ పరిశీలన ద్వారా అతని అంతర్గత స్థితిని విశ్లేషిస్తారు. ఇది ఎక్స్‌రే ద్వారా మానవుని భౌతిక శరీరాన్ని పరిశోధించి లోపాలను, రోగాలను వైద్యుడు నిర్ణయించగల్గినట్లుగా ఉంటుంది. అనగా ఎక్స్‌రే భౌతిక స్థితిని పసిగట్టితే, సెయింట్ మానసిక స్థితిని, దాని రుగ్మతలను గ్రహిస్తారు. ఈ విషయం బాబూజీ నాకు చెప్పినపుడు అర్థంకాలేదు. ఆ తర్వాత కొంతకాలానికి, నా ముందుగా వెళ్ళిన వ్యక్తి యొక్క స్థితిని నేను గుర్తించగల్గుతున్నట్లుగా బాబూజీకి వ్రాసినపుడు, నా శరీరం యొక్క ప్రతి అణువు సామ్యావస్థ (సమస్థితి)లో ఉన్నట్లు, నాకు ఇంతకు పూర్వం వారు సెయింట్ (యోగి) గురించి వర్ణించిన స్థితికి నేను చేరుకొని, ఇంకా ఉన్నత

స్థాయికి అనగా పరమయోగి స్థితిని చెందబోతున్నట్లు 'వారు' వ్రాశారు. నేను నా ఆలోచనతోనో లేదా కోరికతోనో గాకుండా ఎవరో నన్ను అలా గ్రహించగల్గేట్లు చేస్తున్నారేమోనని నాకు అప్పుడు అనిపించింది. దీనినే బాబూజీ 'పరమయోగి' స్థితి అని అన్నారు. అలాగే నేను వ్రాసేది ఒకటి, అనుభవం చెందేది మరొకటి అన్నట్లుగా ఉండేది. కనుక అభ్యాసి యొక్క ఆధ్యాత్మిక స్థితిని ఎక్స్‌రే తీయగలనేగాని భౌతిక రుగ్మతలు కనిపెట్టే డాక్టర్‌ను కాదు. ఒక అభ్యాసి యొక్క ఆధ్యాత్మిక స్థితిని బాగుచేయవలసి వచ్చినపుడు, అతడు నా సమక్షంలో లేకపోయినా అతని స్థితిని గ్రహించగల శక్తి కూడా నాకు బాబూజీ కృప వలన కలిగింది.

ప్రతి ఒక్కరికీ ఎవరి గురువు వారికే గొప్పగా అనిపిస్తుంది అనడానికి చిన్న ఉదాహరణ చెప్తున్నాను. ఇద్దరు స్నేహితులు ఉన్నారు. వారి ఇద్దరికీ వేర్వేరు గురువులు ఉన్నారు. ఇందులో ఒకరు తన మిత్రుణ్ణి తన గురువు వద్దకు రమ్మని ఆహ్వానించగా అతను వెళ్ళటం జరిగింది. అలా అతను వెళ్ళాడే కాని ఏ విధమైన వ్యాఖ్యలు చేయలేదు. కొంత కాలానికి రెండవ వ్యక్తి తన స్నేహితుడిని తన గురువు వద్దకు, మొదటి వ్యక్తి చూపించమని కోరిన మీదట తీసుకొని వెళ్ళాడు. ఆ గురువును చూసి మొదటి వ్యక్తి ఆ గురువు యొక్క భౌతిక రూపం చాలా అసహ్యంగాను, అక్కడి వాతావరణం కూడా ఆహ్లాదకరంగా లేదని వ్యాఖ్యానించాడు. అంటే అతను ఆ గురువు యొక్క బాహ్య రూపానికేగాని ఆంతరిక రూపాన్ని గాని, ఆధ్యాత్మికతనుగాని తెలుసుకోవడానికి ప్రాధాన్యతను ఇవ్వలేదు. ఎవరి దృష్టి వారిది. ఒకరు మరొకరి దృష్టితో చూడలేరు. కనుక ఇతరులను విమర్శించటం తగదు. ఒకసారి బాబూజీ వద్దకు మహేష్ యోగి యొక్క అనుచరుడు వచ్చాడు. ఆ సందర్భంలో అభ్యాసులు

మహేష్ యోగిని విమర్శించటం గమనించిన బాబూజీ వారికి అలా విమర్శించటం తగదని చెప్పటానికి గుణపాఠంగా మహేష్ యోగి యొక్క శిష్యునితో – "మహేష్ యోగి తనకు ఉన్న ఆధ్యాత్మిక శక్తితో సమాజానికి తన చేతనైనంతగా సహాయపడుతున్నారు. వారికి నా అభినందనలు తెలియజేయండి. వారిని నేను గౌరవిస్తున్నాని చెప్పండి'' అని చెప్పారు. దీనినిబట్టి ఇతరులలో మంచిని గ్రహించాలేగాని విమర్శ చేయకూడదని బాబూజీ విశదం చేసినట్లయింది.

## ప్రశ్న: సహజమార్గంలో అభ్యాసి ఒక స్థాయి నుండి క్రిందికి దిగజారే అవకాశం ఉందా?

**జవాబు:** అభ్యాసి నిష్కల్మషంగా, విశ్వాస పూర్వకంగా సహజమార్గాన్ని అనుసరించినట్లయితే తాను చేరిన స్థాయి నుంచి పతనం చెందే అవకాశం లేదు. అందుచేత చిత్తశుద్ధితో సహజమార్గాన్ని అనుసరించటం అంటే బాబూజీ యొక్క చరణాల మీద తనను తాను సమర్పించుకోవటమే. ఈ ఆత్మ సమర్పణ గురించి బాబూజీ ఒకసారి ఇలా వివరించారు. సీనియర్ ప్రిసెప్టర్ రాఘవేంద్రరావుగారు ఒకసారి బాబూజీతో ఇలా తమ సందేహం వెలిబుచ్చారు, "కొన్ని మిషన్స్‌లో అభ్యాసుల సంఖ్య చాలా త్వరగా పెరుగుతోంది, మరి మన మిషన్‌లో చాలా మందకొడిగా ఎందుకు ఉంటోంది?" అని ప్రశ్నించారు. బాబూజీ అందుకు సమాధానంగా, "ఇతర సంస్థల్లో గురువు తానుగా తన శిష్యులకు, వారి కోరికలు తీర్చేందుకు సమర్పితమైపోతాడు. ఆ ఆకర్షణతో శిష్యగణం పెరుగుతూ ఉంటుంది. ఈ సంస్థలో అభ్యాసి నాకు అనగా సహజమార్గానికి

సమర్పితం కావాలి గాని నేను అభ్యాసికి సమర్పితం కాను" అని వివరించారు. ఎవరికైతే ఏది కావలసి ఉంటుందో దాని కోసం కావలసినవారే వెంటపడాల్సి ఉంటుంది.

అదే సందర్భంలో బాబూజీ ఇలా చెప్పారు: "ఆశ్రమ నిర్మాణ సమయంలో ధనాభావం ఏర్పడింది. అందుకు నేను చింతించలేదు. సద్గురు లాలాజీ దాని నిర్మాణం తలపెట్టారు కనుక దానిని పూర్తి చేయటానికి కావలసిన ధనం వారే సమకూర్చాలి. కనుక ధనం కొరకు నేను వారికి అర్పితం కాలేదు. ఆ భారం వారికే వదిలివేశాను" అని. అభ్యాసి గురువుకు సమర్పితం కావాలిగాని, గురువు అభ్యాసికి లోబడగూడదు. ఆధ్యాత్మికంగా అభ్యాసి గురువుకు సమర్పితమైపోతే అతని బాగోగులు అనగా ఆధ్యాత్మికోన్నతి గురించి గురువే శ్రద్ధ వహిస్తాడు.

బాబూజీతో ఒక అభ్యాసి, ధ్యానం చేయటానికి సమయం దొరకటంలేదని, తనకైతే ధ్యానం చేయాలనే అభిలాష ఉందని చెప్పాడు. అపుడు బాబూజీ, తీరిక లేదనుకుంటూ కాలం గడిపివేస్తే మృత్యువు ముంచుకొచ్చాక ఇంక ధ్యానం చేసేది ఏముంటుందని అన్నారు. అందుకు ఉదాహరణగా ఒక చిన్న సంఘటన చెప్పారు. ఇద్దరు ప్రాణ స్నేహితులు ఉన్నారు. అందులో ఒకరు న్యాయస్థానంలో మున్సిఫ్. అతను తన మిత్రునితో "నీవద్దకు వచ్చి చూడాలనిఉంది, కాని తీరిక దొరకటం లేదు" అని ఉత్తరం వ్రాస్తూ ఉండేవారు. ఇలా కాలం గడిచేసరికి రెండవ మిత్రుడు తానే వెళ్ళి మున్సిఫ్ అయిన తన మిత్రుణ్ణి చూడాలని బయలుదేరి ఆ ఊరికి వెళ్ళి తన మిత్రుని ఇంటికి వెళ్ళాడు. అక్కడ జన సమూహం ఉంది. ఏమిటో తెలుసుకోవాలని గుంపును తోసుకుంటూ వెళ్ళి చూసేసరికి తన

మిత్రుడు మరణించి ఉన్నాడు. అతను మనస్సులో, “ఇప్పటివరకు నీకు తీరిక చిక్కలేదు, మరణం ముంచుకొచ్చింది, కాటిలోనయినా కలుసుకుందాం పద” అని అనుకున్నాడు. కుటుంబ సభ్యులతో స్మశానానికి తరలించే ప్రయత్నం చేయమని చెప్పాడు. అప్పుడు వారు, ఆ మున్సిఫ్ ఒక కవి కూడా అయినందువలన, ఒక పద్యపాదం వ్రాశాడని, దాని రెండవ పాదం ఎవరైనా పూరించేవరకు తన శవాన్ని కదలించటానికి వీల్లేదని కోరాడని చెప్పారు. అపుడా మిత్రుడు మున్సిఫ్ వ్రాసిన పద్యపాదాన్ని తనకు ఇవ్వమని కోరాడు. అది చదివితే దానిలో “ఇస్ దునియాఁ సే సిధారా మున్సిఫ్” అనగా జీవితయాత్రలో ఈ ప్రపంచాన్ని విడిచి వెళ్ళిపోయాడు మున్సిఫ్ అనే అర్థంతో ఉంది. దానికి రెండవ పాదంగా “మౌత్ కీ విజయీ హుయీ, ఓర్ హారా మున్సిఫ్” అని పూరించాడు. అనగా మృత్యువు జయించింది, ఓడిపోయాడు మున్సిఫ్ అని అర్థం వచ్చింది. అక్కడి వారందరికి తృప్తి కలిగిన మీదట ఆ శవం తరలించబడింది. ఈ విధంగా బాబూజీ అభ్యాసులతో తీరికగా ముచ్చటించే సమయాల్లో అభ్యాసుల సందేహాలకు ఇటువంటి ఉదాహరణలు, చమత్కారంగా చెప్తుతుండేవారు.

మనం ధ్యానం ద్వారా పురోగమించాలన్నా, సాక్షాత్కారం పొందాలన్నా అందుకు తగిన సాధన, తపన ఉండి తీరాలి. తనకు ఏమీ అనుభూతి కలగటంలేదని ఫిర్యాదు చేసేకంటే అభ్యాసి తన లక్ష్యం కొరకు అనగా సాక్షాత్కారం కొరకు తపన చెంది సాధన చేయటం అవసరం. ఉదాహరణకు రామాయణంలో శబరి తన ప్రియదైవం రాముడు వస్తాడు, తనను తరింపజేస్తాడనే ఆత్మ విశ్వాసంతో ఎదురు తెన్నులు చూసింది. అతని స్మరణతోనే గడిపింది.

చివరకు శ్రీరాముని రాకతో పరవశించిపోయింది. ఈ విధంగా ఇతరులను చూసియైనా ఎలా తపన చెందాలో తెలుసుకోవాలి.

బాబూజీ చెప్తూ ఉండేవారు – మౌనంగా ఉండే మనిషి అస్తమానమూ మాట్లాడే వ్యక్తి కంటే మెరుగు అని. అలాగే మీరు ఏమీ ప్రశ్నించకుండా మౌనం వహిస్తున్నారంటే ధ్యానంలో మీరు ఏదో కోరుకుంటున్నారు. కనుక దానిని ఇవ్వవలసిన బాధ్యత నా మీద ఉందనుకుంటున్నాను. ధ్యానంలో ఒక స్థితి వలన కలిగే శక్తి దానితోనే మిళితమై ఉంటుంది. కాని బాబూజీ ఇస్తున్న శక్తితో నేను మీతో మాట్లాడటం వలన ఆధ్యాత్మికంగా ఉపయోగం కలుగుతుందని అనుకుంటున్నాను.

'అనుభవసరిత' పుస్తకంలోని ఒక పద్యాన్ని గురించి అర్థం చెప్తున్నాను. ఉప్పెనగాలి  వచ్చినపుడు దాని వేగానికి దుమ్మూ ధూళి, చెత్తా చెదారం సుడులు తిరుగుతూ పైకి ఎగిరిపోయి దాని తీవ్రత పలచబడిన తరువాత ఎక్కడో భూమి మీద పడి పేరుకు పోతుంది. కాని బాబూజీ సృష్టించిన లేదా కల్పించిన ఆధ్యాత్మిక చైతన్యమనే తుఫానులో పైకి ఎగసిన వారు మళ్ళీ క్రిందపడటం జరగదు.

**ప్రశ్న: సహజమార్గంలో ప్రోగ్రెస్ అవుతున్నట్లు తెలుసుకోవడం ఎలా?**

**జవాబు:** బాబూజీకి మనం సన్నిహితమవుతున్నట్లు అనుభూతి చెందటం ద్వారా మన ప్రోగ్రెస్ తెలుస్తుంది. వారి పుస్తకాలు చదవటం ద్వారా, వారు చెప్పినవి జీర్ణించుకోవటం ద్వారా మనం 'వారి'కి దగ్గరవుతున్నట్లు అనుభవం కలుగుతుంది. ఇలా దగ్గరై వారి ధ్యానంలోనే లగ్నమై ఉండటం మూలంగా మన నిర్మలీకరణ కూడా జరుగుతూ ప్రోగ్రెస్ అవుతూ ఉంటాము.

**ప్రశ్న: డెత్ టు డెత్ మరణం నుంచి మరణం వరకు అంటే ఏమిటి?**

**జవాబు:** అభ్యాసికి మరణం యొక్క మొదటి స్థితిలో, బాబూజీలో పూర్తిగా లయమైపోయినపుడు, బాబూజీ సమక్షంలో తన అస్తిత్వాన్ని (ఉనికిని) కోల్పోవటం జరుగుతుంది. తాను ఉన్నట్లే తనకు తెలియ కుండా ఉంటుంది.

మరణం యొక్క రెండవ దశలో, సాక్షాత్కారం పొందిన తరువాత, ఎవ్వరైనా పిలిస్తే తననే పిలిచినట్లు, ఎవ్వరైనా దైవం గురించి మాట్లాడుకుంటూ ఉంటే తన గురించే మాట్లాడుకుంటున్నట్లు ఉంటుంది. అంతేగాకుండా ఎవ్వరైనా పిలిచినపుడు తనకు తెలియకుండానే తానే సమాధానం ఇవ్వటం జరుగుతుంది.

ఇందుకు ఉదాహరణగా నా స్వవిషయం చెపుతాను. నేను పూర్తిగా ఆరోగ్యం కోల్పోయినపుడు నా జాతక చక్రం తీసుకొనివెళ్ళి మా నాన్నగారు ఒక జ్యోతిష్కునికి చూపించారు. అది చూసి అతను ఈ జాతకం తాలూకు వ్యక్తి మరణించడం జరిగిపోయిందని అన్నాడు. అప్పుడు మా తండ్రిగారు బాబూజీవద్దకు వెళ్ళి ఈ విషయం చెప్పగా, “మీ కుమార్తె కస్తూరి ఎప్పుడో చనిపోయింది. కాని ఇప్పుడు జీవించి ఉన్న కస్తూరి నా ఆధ్యాత్మిక కస్తూరి” అని అన్నారు.

**ప్రశ్న: బాబూజీ జన్మ శతాబ్ది ఉత్సవానికి హాజరైన వారికి మాత్రమే ముక్తి లభిస్తుందా? ఇతరులకు కూడా లభిస్తుందా?**

**జవాబు:** ఇక్కడకు వచ్చిన వారికే కాదు, అనారోగ్యంగా గాని, మరి ఏమైనా ముఖ్యమైన పనుల వలన గాని ఈ ఉత్సవానికి రాకపోయినా, బాబూజీపట్ల భక్తి ప్రపత్తులు ఉన్నవారికి, సహజమార్గంలో దీక్షతో

సాధన చేస్తున్న వారికి కూడా ముక్తి లభిస్తుంది. (శతాబ్ది ఉత్సవంలో కస్తూరిగారు అందరికీ పునర్జన్మ లేకుండా వరం ఇచ్చానని అన్నారు) పునర్జన్మకూ ముక్తికీ చాలా తేడా ఉంది. పునర్జన్మ ముగిసిన తర్వాత ఆధ్యాత్మికోన్నతి ద్వారా ముక్తి సాధించబడుతుంది.

దీక్షతో ధ్యానంలో మగ్నమైపోవటమంటే తన్మయత్నం చెందటమే. ఆ సమయంలో శారీరక ధ్యాస ఉండదు.

**ప్రశ్న: మీ జీవితంలో అత్యంత ఆనందం ఎప్పుడు అనుభూతి చెందారు?**

**జవాబు:** శ్రీ బాబూజీ మహరాజ్ మొట్టమొదటగా నాకు ప్రత్యక్షమై ఎంతకాలం నుంచో నీ కోసమే వెదుకుతున్నాను అన్నప్పుడు, శ్రీ బాబూజీ మహరాజ్ పాదాల వద్ద ఆశ్రయం పొందినప్పుడు, సహజమార్గంలో అత్యున్నత స్థితిని పొందినప్పుడు నాకు అత్యంత ఆనందం కలిగింది. ఈ విషయం నా పుస్తకాల్లో కూడా వ్రాశాను.

**ప్రశ్న: శ్రీ రామచంద్రమిషన్‌లో చేరిన ప్రతి అభ్యాసికి ముక్తి లభిస్తుందని గ్యారంటి ఇవ్వగలరా?**

**జవాబు:** తప్పకుండా వస్తుంది. ఎవ్వరైతే సిన్సియర్‌గా క్రమం తప్పకుండా దీక్షతో సాధన చేస్తారో వారికి ముక్తి లభిస్తుంది. సిన్సియర్ అంటే నియమాలు పాటిస్తూ తపనతో 'వారి'కి (బాబూజీకి) శరణాగతి అయితే (సరెండర్) తప్పక ముక్తి లభిస్తుంది. సాధన, భక్తి, అర్పణ అన్నీ ఉండాలి.

**ప్రశ్న: ముక్తి పొందిన ఆత్మ మరల జన్మిస్తుందా? పునర్జన్మ, ముక్తికి గల భేదం ఏమిటి?**

**జవాబు:** ఆత్మ జన్మించదు. పునర్జన్మ (Rebirth) రాహిత్యానికి ముక్తికి

(Liberation) చాలా భేదం ఉంది. ఆత్మ పునర్జన్మ పొందిన తర్వాత గత జన్మలో పొందిన ఆధ్యాత్మిక స్థితి నుంచి ఇంకా ఉన్నత స్థితికి సాధన చేసి ముక్తి పొందుతుంది. ఏ ఒక్క సంస్కారమూ లేనప్పుడే ముక్తి సిద్ధిస్తుంది. ఉదాహరణకు గంగా నదిలో కాళ్ళు పెట్టితే పునర్జన్మ ఉండదు అనుకుంటే దానిలో పూర్తిగా మునిగితే ముక్తి లభించడం వంటిది. (దైవకార్యం కొరకు ఆదేశించబడితే జన్మించవచ్చు)

**ప్రశ్న: టెన్ కమాండ్‌మెంట్స్ (దశ నియమాలు) గురించి మీరు ఏమీ చెప్పరేమిటి?**

**జవాబు:** అన్ని మిషన్‌లలోనూ, వాటిని ఏర్పాటు చేసినవారు ఎవ్వరికి వారు స్వయంగా ఆ నియమాలను నిర్ణయించుకుంటారు. సభ్యులందరూ వాటిని ఆచరించాల్సిందే. కాని మన మిషన్‌లో అనగా సహజమార్గంలో సాధకుడికి బాబూజీ తన కోరిక ప్రకారం ఇచ్చే ప్రాణాహుతి ద్వారా, వారికి దగ్గరగా అనుభూతి చెందుతున్న కొద్దీ, ఒక్కొక్కటి ఆచరించబడుతున్నట్లుగా తెలుసుకోవచ్చు. ఒక్కొక్కటిగా ఆచరణకు వచ్చి పూర్తి ఆదేశాలు ఆచరించగలిగిన స్థితికి చేరుకుంటే సాక్షాత్కారం లభించినట్లే.

**ప్రశ్న: శ్రీ బాబూజీ మహరాజ్‌గారి భౌతిక రూపం సహాయ పడుతుందా?**

**జవాబు:** బాబూజీ భౌతిక రూపం రెండు నిమిషాలు కూడా జ్ఞాపకం ఉండదు. ఎందుకంటే అది దివ్యరూపం కనుక. ఆ భౌతిక రూపం నుండి దివ్యశక్తి ప్రసారమవుతుంది. వారికి ఎదురుగా కూర్చున్నా, ఒక్క క్షణంలో వారి భౌతిక రూపం అదృశ్యమైపోయి దివ్యరూపం సాక్షాత్కరిస్తుంది. అనగా ఛాయ కనిపిస్తుంది. బాబూజీ ఏదైనా

చేప్పేటప్పుడు కూడా వారి ఛాయ మన హృదయంలో ప్రవేశించి భాషరాని వారికైనా అర్థమౌతుంది. బాబూజీ నుంచి దేనినయితే పొందానో దానిని హృదయంలోంచి మీకు అందిస్తాను.

**ప్రశ్న: డాక్టర్‌గారికి ఏమి చెప్పమంటారు?**

**జవాబు:** డాక్టర్‌గారు చాలా బాగా పనిచేస్తున్నారు. వారి ఆరోగ్యం కుదుటపడుతోంది. వారు ఇంకా ఆరోగ్యవంతులు కావాలని నేను బాబూజీని ప్రార్థిస్తున్నాను. వారు ఇంకా ఆరోగ్యవంతులై, బాగా కృషి చేస్తారు.

మీరందరూ బాబూజీ కృపతో ఆధ్యాత్మికంగా ఉన్నత స్థాయికి ఎదుగుతున్నారు. ఎంతో కొంత ఆధ్యాత్మికతను పొంది సంతోషంగా తిరిగి వెళ్ళుతున్నారు. ఇంకా మీకు ఉన్నత స్థాయి కలగాలని వారిని ప్రార్థిస్తున్నాను.

సహజమార్గ విధానాన్ని బాబూజీ మహరాజ్ చెప్పినట్లుగా సక్రమంగా ఆచరించాలి. అలా కానట్లయితే పురోభివృద్ధి కనిపించదు. **"ఆధ్యాత్మికతకు ఎన్నో మార్గాలు ఉండగా సహజమార్గ విధానం యొక్క అవుసరం ఏమిటి?"** అని బాబూజీని ఎవ్వరో ప్రశ్నించారు. దానికి బదులిస్తూ బాబూజీ మహరాజ్ "నీ ప్రశ్నలోనే సమాధానం ఉంది. ఇప్పటి వరకూ ఉన్న మార్గాలన్నీ ప్రకృతి యొక్క లక్ష్యాన్ని సాధించగల్గి ఉంటే దీని అవుసరం ఉండేది కాదు. అందుచేత ఎప్పుడు ఏ విధానం అవసరమవుతుందో అది ప్రవేశపెట్టబడుతుంది. దీనిని ఆచరించి చూసినట్లయితే మిగతా వాటికంటే ఇది చాలా తేలికైనదని గ్రహిస్తావు" అని అన్నారు. ప్రార్థన అనేది మనం చేస్తూనే ఉన్నాం. స్కూల్సులో విద్యార్థులు చేస్తూనే ఉన్నారు. మరైతే ఈ ప్రార్థన ఎందుకు? అన్న ప్రశ్నకు జవాబుగా "నీవు చేసే ప్రార్థన, ఎవ్వరో

ఒకరు తన ఆలోచనలతో వ్రాసినటువంటిది, కాని నేను ప్రవేశపెట్టిన ప్రార్థనలో దైవాలోచన లేదా దైవచింతన యొక్క ప్రవాహం ఉంది" అన్నారు బాబూజీ.

ఒకసారి ఈశ్వర్‌సహాయ్‌గారు బాబూజీతో, **"సిస్టర్ ఎప్పుడూ మిమ్మల్ని గురించే ప్రస్తావిస్తూ ఉంటుంది, మేము ఎప్పుడూ మిమ్మల్నే గుర్తు పెట్టుకోవలసి ఉంటుందా!"** అని అన్నారు. బాబూజీ దానికి సమాధానం ఇస్తూ, "నేను మిమ్మల్ని జ్ఞాపకం ఉంచుకోవాల్సిన అవసరం ఉన్నప్పుడు మీరు నన్ను జ్ఞాపకం ఉంచుకోవాల్సిన అవసరం ఉండదా! మరో విషయం ఏమిటంటే, నేను మిమ్మల్ని తలచుకున్నప్పుడు నాకు ట్రాన్స్‌మిషన్ రాదు; కాని మీరు నన్ను తలచుకున్నప్పుడు మీకు ట్రాన్స్‌మిషన్ వస్తుంది" అని అన్నారు.

మీకు మిగతా విధానాల్లో పది నిమిషాలు సంతోషంగా ఉన్నట్లుంటుంది. కాని సహజమార్గంలో మీకు శాంతి, సుఖము, సంతోషము అన్నీ సమకూరుతున్నట్లు అనుభవమవుతుంది. ఒక సెయింట్ వద్దకు వెళ్ళితే ప్రశాంతంగా ఉన్నట్లు ఉంటుంది. కాని బాబూజీ వద్దకు వెళ్ళితే కలిగే అనుభూతి దానికంటే మిన్నగా ఉంటుంది. సిస్టమ్‌లో ఉన్న తేడాయే అందుకు కారణం. అనేక మంది అనేక పేర్లతో ఉంటారు. వ్యక్తులు వేరుగా ఉన్నా మనిషి అనే వాడు ఒక్కడే. అలాగే సాధనలు అనేకం ఉన్నా సాధ్యం (లక్ష్యం) ఒక్కటే. ఇతర సాధనల్లో లక్ష్యం సాధించటానికి ఎంతో సమయం వృధా అవుతుంది. ఇందులో తక్కువ కాలంలోనే సాధ్యపడుతుంది. ఇందులో ఎడతెగని దివ్య ప్రవాహం ఉంటుంది. కొంతమంది ధ్యానంలో కూర్చున్నప్పుడు ఏమీ రావటం లేదనుకుంటారు. ఆలోచనలు వస్తూ ఉంటున్నాయి అని అంటారు. వాటిని మీరు

ఆహ్వానించని వాటిగా భావించాలి. ఎలా భావించాలి అంటే ఈ అనవసరమైన ఆలోచనలు నన్ను వదలి వెళ్ళుతున్నాయి, బాబూజీ నాలో ప్రవేశిస్తున్నారు అని అనుకోవాలి. అప్పుడు ఆ ఆలోచనలు తొలగిపోతాయి. బాబూజీ చెప్పారు, "నేను మీలో నిలుపుకోమని ఇచ్చిన ఆలోచనలనే నిలుపుకోండి. మిగిలిన వాటిని గురించి ఆలోచించవద్దు" అని.

## ప్రశ్న: దివ్యస్థితి యొక్క పురోగతి తెలుసుకోవడం ఎలా?

**జవాబు:** బాబూజీ ఇలా అన్నారు – "నేను దైవకార్యాన్ని నిర్వహించడానికే వచ్చాను" అని. 'వారు' మన నుంచి కోరే సేవ ఏమిటి? వారే మళ్ళీ అన్నారు, "మీలో దైవం ఉన్నాడని మాత్రం కొంచెమైనా దృష్టిలో ఉంచుకోండి. అది ఎందుకంటే, మీరు దైవానికి మీ అంతరంగంలో స్థానం ఇచ్చినట్లయితే, నేను మీ కొరకు తెచ్చిన దానిని అనగా మీకు కానుకగా తెచ్చిన దానిని మీలో ఉంచి వెళ్ళటానికి స్థానం లభిస్తుంది. నేను కోరేది ఇంతే!" అని.

బాబూజీ గదిలో బల్ల మీద కూర్చుని ఉండేవారు. అభ్యాసులు వారికి పాదాభివందనం చేసే అలవాటుతో గుమ్మం ముందు నిలబడి ఉన్నారు. ఒకరికంటే ముందు ఒకరు రావాలని నెట్టుకుంటూ వస్తారు. అది క్రమశిక్షణ కాదు. మనుషుల్లో రెండు రకాల తృష్ణగల వారు ఉంటారు. ఒకరు స్వార్థంతో తాను పైకి పోవటానికి ఇతరులను నొక్కి వేయటానికి ప్రయత్నిస్తారు. అది చాలా భయంకరమైన ప్రవృత్తి. అలాంటి వారు ప్రోగ్రెస్ పొందాలంటే ఇంకొక జన్మ తీసుకోవాల్సిందే. మరొకరు తాము ముందుకు వెళ్ళుతూ వెనుక వచ్చేవారి కొరకు కూడా వేచి ఉండి కలుపుకు పోవాలనే ప్రవృత్తితో ఉంటారు. దీనిలో దైవత్వం ఉంది. బాబూజీ వద్దకు వెళ్ళి అభ్యాసులు ఇతరుల మీద

నిందలు వేసేవారు. అది విని వారు "చాలా మంచిది" అని మాత్రమే అనేవారు. ఎవ్వరైనా సరే ఒక మహాపురుషుని వద్దకు వెళ్ళి అటువంటి చెడు విషయాలు మాట్లాడకూడదు. ప్రతి ఒక్క క్రియకు ప్రతిక్రియ ఉంటుంది. మనం చెడు చేస్తే మనకే కీడు కలుగుతుంది. చెరపకురా చెడేవు అంటాము కదా! కనుక మన మాటల్లో, చేతల్లో యదార్థం, స్వచ్ఛత ఉండాలి.

**అభ్యాసి: అవాంతరాల (Distrubance) వలన ధ్యానం కొనసాగదు, ఎలా?**

**జవాబు:** ఒకతను, తన భార్య ధ్యానం చేసుకోనివ్వదు, ఏవో అవాంతరాలు కల్పిస్తూ ఉంటుంది, మనస్సు లగ్నం కావటం లేదు అని అంటాడు. దానికి కారణం ఆమె కాదు, నీ మైండ్, నీ మనస్సులో నీవు చేయాలి అనుకుంటే చేయగల్గుతావు. నీవు ధ్యానం చేయాలనుకోనందువలన దీనికి ఆమె కారణం అనుకుంటావు. అలా అనుకుంటే బాహ్య వాతావరణంలో ఎప్పుడూ ఏదో ఒక విధంగా మన తలంపుకు భంగం కలుగుతూనే ఉంటుంది. మనం మనస్సును అంతర్ముఖం చేసుకుంటే అవి అడ్డురావు.

ఎవ్వరైనా చెడుగా మాట్లాడినట్లయితే, అది బాధ కలిగించినపుడు బాబూజీని స్మరించి ఆ చెడు మాటల ప్రభావం తన మీద పడకుండా ఉండాలని, ఆ చెడుగా మాట్లాడిన వారిని క్షమించమని వేడుకున్నట్లయితే ఇద్దరికీ ప్రయోజనం ఉంటుంది.

ప్రారంభంలో మూడు సిట్టింగులు తీసుకుంటాం. అప్పుడు ధ్యానం ప్రాక్టీస్ ప్రారంభించినపుడు ఏ రూపమూ లేకుండా దేని మీద దృష్టి నిలపాలనే సందిగ్ధం ఏర్పడుతుంది. క్రమంగా, దివ్యకాంతి ఉందను కొని ధ్యానంలో దృష్టి నిలిపి సాధన చేస్తూ ఉంటే అటువంటి

సందిగ్ధావస్థ తొలగిపోయి ప్రాణాహుతి యొక్క అనుభూతి కలుగుతూ ఉంటుంది.

**ప్రశ్న: ఎవ్వరి మీదైనా ఒక్కోసారి ప్రేమ, ఒక్కోసారి ద్వేషము కలుగుతూ ఉంటాయి. హృదయంలో ప్రేరణ రెండు భాగాలుగా ఉంటుందా?**

**జవాబు:** ఇందులో ద్వేషం అన్నది బాహ్య ప్రపంచం నుంచి ఉత్తేజం కలిగిస్తుంది. మనస్సు బాహ్య విషయాలలో లగ్నమైనప్పుడు దానికి ప్రేరణ కలుగుతుంది. కాని మనస్సును అంతర్ముఖం చేసినపుడు బాహ్య విషయాల ప్రభావం తగ్గి, దివ్య శక్తి వలన, దివ్య కాంతి వలన, దివ్య ప్రేమ వలన ఒక్కో సమయంలో ద్వేషం కలిగిన వ్యక్తి మీదైనా సరే ప్రేమ కలుగుతుంది. క్రోధం, ద్వేషం మానవ లక్షణాలు. కాని బాబూజీ దయ వలన మన అంతరంగం నిర్మలీకరణ చెంది దివ్యభావాలతో ప్రేమ దృష్టి అలవడుతుంది.

మనకు ఒక స్థితి కలుగుతుంది, ఎవ్వరిని గురించి చెడుగా మాట్లాడలేనటువంటిది. బాబూజీ అన్నారు, “అసలు ఒకరిని గురించి చెడుగా ప్రస్తావనే చేయకుండా ఉంటే చెడుగా మాట్లాడటమనే ప్రశ్నే ఉండదు. అప్పుడు దానికదే మంచిది అవుతుంది” అని.

**అభ్యాసి: నిన్న సిట్టింగ్‌లో ఇక్కడ కూర్చున్నప్పుడు నా నుంచి ఏదో తొలగిపోయినట్లయింది. దానికి ఏమైనా అర్థం ఉందా?**

**జవాబు:** దేహం పాంచభౌతికం. (అనగా భూమి, ఆకాశం, గాలి, నీరు, అగ్ని అనేవి ఐదు భూతాలు) అందులోని భూతాలు (Elements) బాబూజీ కృపతో ప్రవర్తిస్తూ ఉంటాయి. శరీరంలోని స్థూలత (Grossness) ఈ చక్రాలలో ఉంటుంది. ఇది మన స్థితినిబట్టి నిర్మలీకరణ చేయబడతాయి. మనలో అది అనవసరం

అనుకున్నప్పుడు బాబూజీయే దానిని తొలగిస్తూ ఉంటారు. అది మీ స్థితిలో ఉన్న అగ్నితత్వం. దానిని బాబూజీ తొలగించివేశారు. కనుక మీకు బాబూజీ అనుగ్రహంతో అది కలిగింది. ఈ సహజమార్గ విధానం మీద ఎవ్వరైతే పూర్ణ విశ్వాసం ఉంచి బాబూజీ చెప్పినట్లుగా అనుసరిస్తారో వారికి ఈ శరీరం విడిచిపెట్టాక ముక్తి కలుగుతుంది. మళ్ళీ ఈ ప్రపంచంలోకి అడుగు పెట్టాల్సిన పని ఉండదు. ఒక పుష్పంలో సుగంధం ఇమిడి ఉంటుంది. దాని మహత్తుతో అది వ్యాపించినప్పుడు దానిని మనం ఆఘ్రాణించగల్గుతాము. (సువాసన అనుభవిస్తాం) ఎక్కడి నుంచో వ్యాపించిన సువాసనే మనకంత ఆనందం కలిగిస్తే, అది వెలువడుతున్న పుష్పం దగ్గరకే చేరితే అది ఇంకెంత ఆనందమో గదా! అదే విధంగా బాబూజీ కల్పించిన ఈ సహజమార్గమే మనల్ని ఇంతగా పైకి తీసుకొనిపోతూ ఉంటే, మనం బాబూజీని చేరుకున్నప్పుడు కలిగే తన్మయత్వానికి ఇంక అవధి ఏమి ఉంటుంది!

**ప్రశ్న: రియాలిటీ (సత్యతత్వం)తో అనుసంధానమైతే కూడా ట్రాన్స్‌మిషన్ తీసుకుంటామా? సిట్టింగ్ అవుసరమా?**

**జవాబు:** మీరు వారితో సంబంధం కలిగి ఉన్నామని విశ్వాసం కలిగి ఉన్నంత వరకు వారి నుంచి మీకు ఆ పూర్ణ చైతన్యం (ప్రాణాహుతి) అందుతూనే ఉంటుంది. అప్పుడు మీకు ఇంకా మీ అస్థిత్వ భావం అనగా మీరు ఉన్నారనే భావం ఉంటుంది. వారి నుండి పొందుతున్నామనే భావం కాకుండా అందులోనే ఉండి పోయినట్లయితే మీ అస్థిత్వం ముగిసిపోయి వారిలో లయమైపోయి ముక్తి చెందట మవుతుంది. మీరు ఆ లయావస్థ స్థితికి చేరాక మీకు ఎక్కడికి వెళ్ళినా మీ నుండి కూడా అ ట్రాన్స్‌మిషన్ జరుగుతూనే ఉంటుంది. అది మీ ప్రయత్నంతో నిమిత్తం లేకుండానే జరిగిపోతుంది. ఆ స్థితిలో ట్రాన్స్‌మిషన్ ఇవ్వటమేగాని తీసుకోవటం ఉండదు.

పార్షద్, మహాపార్షద్ కండిషన్ రెండూ ఒక్కటే అనటం తప్పు. బాబూజీ నన్ను ఆ స్థితికి చేర్చారు. ఆ స్థితికి ఎవ్వరైనా చేరవచ్చు అనటం అసంభవం. చేరగల్గితే ఆ స్థితిని గురించి వర్ణించగల్గి ఉండాలి గదా! అలాగే దాని గురించి వ్రాయవచ్చు కూడా. అందుకని కండిషన్ తెలియకుండా ఆ శబ్దం ఉపయోగించకూడదు. నేను ఆ స్థితిని చూశాను గనుక చెప్పగలను. అక్కడ ఎటువంటి శక్తి ఉందో, అక్కడి స్థితి ఏమిటో తెలుసుకోగల్గాలి. ఎవ్వరో ఒకరిని ప్రధానమంత్రి అని చెప్పితే చాలదు. ప్రజలలోకి వెళ్ళితేగాని ప్రధానమంత్రి ఎవ్వరో తెలియదు.

బాబూజీ శ్రీకృష్ణుని గురించి చెప్పారు. అభ్యాసి ఒకతను శ్రీకృష్ణుని గురించి, అతడు అహంకారి అని, అన్నింటికి నేనే అంటున్నాడని, అందరినీ తనను ప్రేమించమంటున్నాడనీ, కనుక అది అహంభావం అని, ఒకరు విమర్శిస్తున్నారని చెప్పాడు. అప్పుడు బాబూజీ అతని వద్దకు (విమర్శించిన వారి వద్దకు) వెళ్ళి అతని పరిచయం ఏమని చెప్తుతాడో, అతని శక్తి ఏమిటో తెలుసుకొని రమ్మని అభ్యాసీకి చెప్పారు. ఎవ్వరైనా మహాశక్తివంతులు అవతరించినప్పుడు ఆ విధంగా శక్తితో వచ్చిన వారిలో తాను 108వ వాడో, 1008వ వాడో అని చెపుతారు. ఆ విధంగా చెప్పటంలో వారు ఆ మహాశక్తికి చెందినవారమని, ఆ శక్తి యొక్క మహిమను గురించి పరిచయం చేయటమేగాని అహంభావమని అనిపించుకోదు. ఆ శక్తికి ప్రతిరూపంగా మీ ఎదుటనే ఉన్నాను కనుక ఆత్మ సమర్పణ చేసుకొమ్మని భావం.

బాబూజీ మహరాజ్ నన్ను ఒక సెయింట్‌గా తయారు చేశారు. ఆ సెయింట్ అనే దానిలో ఎంత సమతుల్యం (Balance) ఉంటుందంటే, ఎవ్వరినీ తప్పు బట్టే తత్వం ఉండదు. ఒక ప్రక్క

ఈ విధంగా ఉంటే మరోప్రక్క సెంట్రల్ రీజియన్ ఉంటుంది. సెయింట్ పైకి పోయినకొద్దీ బాబూజీ ప్రతి స్థితిలోను, అనగా ప్రతి ఘాట్‌లోనూ (దివ్య ప్రవాహ తీరంలోనూ) దివ్యతను త్రాగించి తీసుకొని వెళ్ళుతున్నట్లుగా అక్కడి శక్తితోను, అక్కడ ఉన్నటువంటి విషయాలలోను, ఆ కండిషన్‌లోను లయం చేసి ముందుకు తీసుకొని వెళ్ళుతున్నట్లుగా ఉంటుంది. ఇక్కడ వ్యక్తిత్వం ఉంటుంది. ఈ విధంగా ప్రతి చోట అనగా ప్రతి దశలోను దాని యొక్క పూర్ణ స్థితి గతులలో లయం చేసి సెంట్రల్ రీజియన్‌కు తీసుకొని వెళ్ళటం జరుగుతుంది. ఎవ్వరినైనా ఒక్కసారిగా (ఎకాఎకిన) సెంట్రల్ రీజియన్‌లో ప్రవేశపెట్టవచ్చు. కాని అక్కడ ప్రవేశం పొందాలంటే అభ్యాసి సాధనచేసి దాని స్థాయికి తగినట్లుగా శ్రేష్టుడై ఉండాలి, శక్తిమంతుడై ఉండాలి. ప్రాపంచిక విషయాలలో తన్మయుడైన వ్యక్తికీ, అన్ని కేంద్రాల్లోను అక్కడి స్థితుల్లో లీనమై, ఎక్కడికి అక్కడ శక్తిని పుంజుకుంటూ వెళ్ళే సెయింట్‌కూ తేడా ఉంది. ఆ విధంగా ఎక్కడికి అక్కడ లయావస్థను పొందకుండా ఉన్నవారెవ్వరినీ బాబూజీ సెంట్రల్ రీజియన్‌కు తీసుకొనివెళ్ళరు. అక్కడికి తీసుకొని వెళ్ళటానికి బాబూజీలో కోరిక జనించాలి. వారికి ప్రేమ కలగాలి. సెంట్రల్ రీజియన్‌కు ఇవతలి నుంచి చూసినట్లయితే దర్వాజాలో ఒక రంధ్రం నుంచి అవతలివైపు దృశ్యాన్ని చూసినట్లుగా ఉంటుంది. కాని ద్వారం నుంచి ప్రవేశించాలంటే బాబూజీకి మనపై ప్రేమ, దాని ద్వారా మనల్ని అక్కడకు తీసుకొనిపోవాలనే కోర్కె ఉండాలి. అది వారి ఇచ్ఛాశక్తి వలన జరిగేది కాదు, ప్రేమతో కూడిన కోరిక వలన జరిగేది. వారి కోరిక అనేదే ఆ దర్వాజ. వేరే దర్వాజా ఉండదు. ఎప్పుడైతే వారి కోరిక అనే దర్వాజా తెరుచుకుంటుందో అప్పుడు

మనకు ప్రవేశం కలుగుతుంది. కనుక వారి అనుగ్రహానికి పాత్రులు కావాలంటే వారిపట్ల మన ప్రేమ పెంచుకొని తద్వారా వారి ప్రేమను పొందాలి. కనుక ప్రేమతోనే ముక్తిని సాధించవచ్చును గాని మరి దేనితోనూ కాదు.

కొన్నిచోట్ల ప్లీజ్ స్టార్ట్ మెడిటేషన్ (ధ్యానం ప్రారంభించండి) అని అంటారు. అది తప్పు. ఎందుకంటే మనం ఎప్పుడూ ధ్యానంలో ఉన్నట్లే నిరంతర స్మరణలో ఉంటాము కనుక. కాని భౌతిక అవసరాల నిమిత్తం మన దృష్టి మరల్చుతాం. మళ్ళీ ధ్యానంలోకి వెళ్ళవలసి ఉంటుంది. మన దృష్టిని మరల్చడం కోసం అలా చెప్పవలసి ఉంటుంది. ఆ విధంగా చెప్పడానికి బాబూజీ 'ధ్యానంలో ఉండండి' అని ప్రయోగించమన్నారు.

ఒక అభ్యాసి తన ఉద్యోగంలో చాలా సమస్యలు ఉన్నాయి, కష్టమనిపిస్తోంది అని అంటాడు. నిజానికి అది సమస్య కాదు. ఉద్యోగం పోతే సమస్య అవుతుంది. కాని ప్రతిదీ సమస్యగా భావించుకుంటే మనమే స్వయంగా సమస్యను సృష్టించుకొన్నట్లు అవుతుంది. కనుక సమస్య పరిష్కారానికి మార్గ అన్వేషణ చేయాలి, ప్రయత్నించాలి. అప్పటికీ శక్తికి మించిన పనయితే 'వారి'ని ధ్యానంలో ఉంచుకోవాలి, నీ సమస్య పరిష్కారమవుతుంది.

ఒక అభ్యాసీ బాబూజీని మీకు కడుపులో బాధ ఉంది గదా! అది మీ ఆధ్యాత్మిక కృషికి ఇబ్బంది పెట్టదా! అన్నప్పుడు 'వారు' చెప్పారు, "మనకు కడుపులో బాధ ఉంటుంది. అయినా సహనంతో పని చేస్తూనే ఉంటాము. ఆ బాధ శరీరానిది, దాని నివారణకు మందును వెదకి తీసుకుంటాము. మందు వాడిన తర్వాత ఆ బాధ నివారణవుతుంది. అందుచేత అది నాకు నివేదించాల్సిన సమస్య

కాదు. శారీరకమైన వాటికి నీ శరీరాన్ని, మైండ్‌ను ఉపయోగించు. ఆధ్యాత్మిక సమస్యను నాకు తెలియజేయి" అన్నారు. భౌతికంగా నీ ప్రయత్నం ఫలించకపోతే అప్పుడు వారిని కోరితే పరిష్కారం చూపుతారు. అంతేగాని ప్రతిదీ 'వారి' మీద భారం వేయకూడదు.

పిల్లవాడికి ఏదైనా జబ్బు వస్తే ఆపరేషన్ అవుసరం కావచ్చు. అటువంటప్పుడు అదే తగ్గిపోతుందనే (Positive way) సద్భావంతో ఉండకుండా పిల్లవాడు ఆపరేషన్ చేయించుకోవటానికి వద్దని మొత్తుకున్నా, సర్జన్‌చేత ఆపరేషన్ చేయించి అతని బాధను నివారించాలి. మన వ్యవహారం సమయోచితంగా ఉండాలి. పిల్లవానికి సర్జరీ వలన బాధ తెలుసును గాని, ఆ తర్వాత కలిగే ఆరోగ్యాన్ని గురించి ఆలోచించలేడు. అలాగే మనకు కూడా సాధన కష్టమే కాని ఫలితం అనంతం.

ఏ సెయింట్ దగ్గరైనా మన సమస్యలు తీరలేదని చెప్ప కూడదు. అవిశ్వాసం ప్రకటించకూడదు. విశ్వాసంతోనే ఏ పనైనా చేయాలి. మనం చేసేప్పుడు నిమిత్తమాత్రులం అనుకొని అంతా వారే చేస్తున్నారని అనుకోవాలి. ఇందులో ఒకటి భౌతికమైన దయితే రెండవది ఆధ్యాత్మికమైనది. మనకు వారి మీద ఆధారపడి ఉండటం అలవాటైతే, మాటల్లో వారిదే భారం అని చెప్పుకోక పోయినా మన అంతరంగంలో అదే మూడ్ (భావం) ఉంటుంది. ఇది సాధన ద్వారా కలుగుతుంది. ఇది కూడా ఒక కండిషన్ (స్థితి). వారికి తోచినట్లుగా జరుగుతుందని అనుకుంటాము. ఇది ఆ స్థితి యొక్క భావం. దీనిలో (డిమాండ్) కోరిక ఉండదు.

వారి యందు నమ్మకం ఉంచి, దానిలోనే మునిగి ఉండమన్నారు. (Drown yourself in Divine) అప్పుడు అంతా దైవానికే సమర్పించినట్లు అవుతుంది.

ఒక అభ్యాసీ బాబూజీకి వ్రాసిన ఉత్తరంలో, తాను ఉదయం 4 గం॥లకు లేచి బయలుదేరి ట్రైన్ ఎక్కి 6 గం॥లకు షాజహాన్‌పూర్ చేరి బాబూజీ పాదాలకు ప్రణామం చేసి తరువాత ఏ పనైనా ప్రారంభిస్తానని వ్రాశాడు. ఇదే విధంగా అతను అనేక ఉత్తరాలు వ్రాశాడే కాని అతని మానసిక ప్రణాళిక కార్యరూపం దాల్చలేదు. అలా చేయాలని అతని మానసిక సంకల్పమేగాని అది నెరవేరలేదు. బాబూజీ అది గ్రహించి, ఏదైనా జవాబు వ్రాయకపోతే అతను అలాగే కొనసాగిస్తాడని ఇలా వ్రాశారు: “నీవు అనుకున్నట్లు రావచ్చు. కాని నీవు దారిలో ఎక్కడైనా నిలిచిపోతే నిన్ను విడిపించటానికి నేను రాను. కనుక నీవు ఇంటి వద్దనే ఉండి మనస్సులో నీవు ఊహించింది ఆచరించు” అని. ఇది ఒక రకంగా ఆలోచనకు, ఆచరణకు మధ్య ఉన్న అగాధాన్ని తెలియజేస్తుంది.

ఒక అభ్యాసి బాబూజీతో కలిసి తింటూ ఉండేవాడు. వేడిగా తయారై వచ్చిన రొట్టెను బాబూజీ అతనికి వడ్డిస్తూ ఉండేవారు. అతడు దానిని తింటూ బాబూజీ జ్ఞాపకంలో ‘వారే’ తింటున్నట్లుగా భావిస్తున్నానని అన్నాడు. అప్పుడు బాబూజీ, “నేను తింటున్నాను అనుకుంటే వాటి రుచి నాకు తెలియాలి కాని నీవు చెబుతున్నావు నేను తింటున్నానని కాని వాటి రుచి నాకు తెలియడంలేదు” అని అన్నారు. దీని అర్థం ఏమిటంటే, మనం చెప్పే దానిలో కేవలం భావం (ఆలోచన) ఉండటం కాదు, ఫీలింగ్ అనగా అనుభూతి ఉండాలి. అంతేకాని వాస్తవానికి దూరంగా ఉండకూడదు. ఆధ్యాత్మికంగా మనకు ఏదైనా కండిషన్ గురించి ఫీలింగ్ వచ్చినట్లు తెలియజేస్తే దానిని బాబూజీ అది ఏ స్థితియో చెపుతారు. అంతేగాని కృత్రిమంగా (false) ఉండకూడదు.

**ప్రశ్న: ధ్యానంలో ఆలోచన కలుగుతుంది, ఏమి చేయాలి?**

**జవాబు:** ఈ విషయం ఎన్నోసార్లు చెబుతూనే ఉన్నాను. ధ్యానం (మెడిటేషన్) లో కూర్చోబోయే ముందు మీరు ఆలోచనలతో కూర్చుంటే అవి మిమ్మల్ని వెంటాడతాయి. బాబూజీని మీ స్మృతిలో ఉంచుకొని వాటిని బాబూజీవైపు తరలించితే అవి తొలగిపోతాయి. బాబూజీ ఈ విషయంలో చాలా తేలికైన ఉదాహరణగా ఏమన్నారంటే, మీ ఇరుగు పొరుగున ఉన్నవారు మీ ఇంటికి వచ్చి వెళ్ళినట్లు భావించమన్నారు. అనగా మన ప్రాపంచిక జీవితంలోని ఆలోచనలు మనలో నిలిచి ఉంటాయి. మన పొరుగున ఉన్నవారు ఎప్పుడైనా మర్యాదకి మనల్ని కలిసి వెళ్ళదామని వచ్చినట్లే అవి కూడా ధ్యానంలో తొంగి చూస్తాయి. ఈ విషయం గురించే చాలా మంది చాలాసార్లు ప్రశ్నిస్తూ ఉంటారు కనుక ఈ రోజు ఉదయం నా మనస్సు దాని మీదికి దృష్టి మళ్ళింది. అప్పుడు నాకు అనిపించింది ఏమిటంటే, ఎవ్వరైనా మనం ఆహ్వానించని వ్యక్తి వచ్చాడనుకుందాం. అతనితో మాట్లాడటానికి ఇష్టం లేదనుకోండి, అప్పుడు అతన్ని లోనికి ఆహ్వానించి సుఖంగా కూర్చుండబెట్టి ఇప్పుడే వస్తానని చెప్పి లోపలికి వెళ్ళి మర్యాదలు చేసినట్లయితే, వాటి అన్నిటికి తృప్తి చెంది తాను వచ్చిన విషయాన్ని కూడా పట్టించుకోడు. అదే విధంగా మనకు అయిష్టమైన ఆలోచనల్ని మళ్ళించవచ్చు.

**ప్రశ్న: 'నేను' అనేది ఏమిటి?**

**జవాబు:** 'నేను' అనేది శరీరానికి సంబంధించింది. ఆధ్యాత్మికత అనే రైలు ప్రయాణంలో 'ఐ' అనగా 'నేను' అను శరీరానికి రిజర్వేషన్ లేదు కనుక ఆ 'ఐ' అనగా శరీరాన్ని ఇక్కడ వదిలేసి వెనక్కి వెళ్ళిపోవటమే.

మనం ఎవ్వరైనా ఆహ్వానించినప్పుడు, అక్కడ సమావేశమయ్యేవారు సామాన్యులైతే మనం కూడా సామాన్యమైన అలంకారంతో వెళ్ళతాము. అదే కనుక ఉన్నత సమాజానికి చెందినవారైతే అందుకు తగినట్లుగా ఉన్నతమైన వేషధారణతో వెళ్ళతాం. అదే విధంగా మనం ఉన్నతమైన గమ్యం చేరటానికి వెళ్ళుతున్నాం కనుక ఆధ్యాత్మిక అలంకారాలైన దశనియమాల సంపూర్ణతను అలంకరించుకొని వెళ్ళితే మనం ముక్తితో గౌరవించబడతాం.

మన సహజమార్గ అభ్యాసులు ఏ విధంగా ఉండాలంటే, దశ నియమాలు స్వచ్ఛందంగా అమలు పరచుకోవటం ద్వారాను, సత్ర్పవర్తనతో ఆచరించటం ద్వారాను మన సహజమార్గ అభ్యాసులుగా గుర్తింపబడేటట్లు ఉండాలి.

ఈ భౌతిక ప్రపంచంలో నిత్యం సూర్యోదయం జరుగుతూనే ఉంటుంది. వేకువజామున లేచి, పనుల్లో నిమగ్నమవుతూ ఉంటారు. పూజాదికాలు చేసేవారు చేస్తూ ఉంటారు. అదే విధంగా మన ఆధ్యాత్మిక సూర్యుడైన మన బాబూజీని వారి దివ్య తేజస్సును హృదయంలో నిలుపుకొని ధ్యానం చేసుకోవాలి.

ఏ మిషన్‌లోనైనా మన దశ నియమాల వంటివి ఉంటాయి. వాటిని విధిగా అమలు చేయటానికి ప్రయత్నిస్తారు. వారి లక్ష్యం అదే. ఆ మిషన్ ద్వారా ప్రాణాహుతి (ట్రాన్స్‌మిషన్) రాదు. శక్తి లభించదు. మన మిషన్‌లో బాబూజీ దశ నియమాలను సూచించారు. విధిగా పాటించమని చెప్పలేదు. కాని ప్రవర్తన ద్వారా వాటిని అలవరచుకొని, ఆ విధంగా పూర్ణత్వం సాధించుకోగల్గితే మనం ముక్తికి అర్హులమవుతామని చెప్పారు.

ప్రార్థన అనేది అభ్యాసి ధ్యానంలో నిమగ్నం కావటానికి, పరివర్తనం చెందటానికి చేసే స్మరణ. అంతేకాని పదే పదే జపించటానికి కాదు. అది దైనందిన వ్యవహారాల నుంచి మనస్సును మళ్ళించటానికి ఉపయోగం. అందుచేత ప్రార్థన ద్వారా ధ్యానంలో ప్రవేశించి అందులో మునిగి దైవాన్ని పొందాలి. బాబూజీ చెప్పినట్లుగా ఆచరించి, వారిని అనుసరించి, వారి స్మరణ కలిగి ఉంటే మనల్ని మన లక్ష్యానికి చేర్చుతారు. ప్రార్థనలో యాచన లేదు. అది ఒక విధంగా మన భావాన్ని, ధ్యాస (Mood) ను దైవ ధ్యానానికి అనుగుణంగా మార్చుకోవటానికి, శరణాగతి లేదా ఆత్మసమర్పణ చేసుకోవటానికి అని గ్రహించాలి.

బాబూజీ చెప్పే మాటల్లో చాలా ఆంతర్యం (మర్మం) ఉంటుంది. దీనిని విశ్లేషించుకొంటే (విడమర్చుకొంటే) అసలు భావం తెలుస్తుంది. ఒకసారి బాబూజీ వద్దకు ఒక అభ్యాసీ వచ్చి నాకు ఉద్యోగం లేదు, ఎక్కడా ఖాళీలు లేవు అని అన్నాడు. అప్పుడు బాబూజీ, "ఖాళీలు లేని చోటుకు తిరిగితే ఏమి లాభం, నా దగ్గర చాలా ఖాళీలు ఉన్నాయి. నీవు దరఖాస్తు చేసుకో, ఏది కావాలంటే అది ఇస్తాను" అని అన్నారు. 'వారి' ఉద్దేశ్యంలో భగవత్ సాక్షాత్కారం పొందుటకు ఆకాంక్షించే వారికి చాలా చోటు ఉందని, వారి కోసం ఎన్నో సీట్లు భర్తీ కాకుండా ఉన్నాయని భావం. అందుచేత 'వారి' మాటలు చాలా బాగా లోతుగా ఉంటాయి.

బాబూజీని ఒకరు భగవంతుడు ఎక్కడ ఉంటాడు, ఎలా ఉంటాడు అని అడిగితే 'వారు' ఇలా చెప్పారు: "నేను తలవంచుకొని ఎప్పుడు కావాలంటే అప్పుడు నా హృదయంలోకి చూస్తే నాకు కనిపిస్తూ ఉంటారు" అని. ఆ విధంగా బాబూజీ మనకు 'వారి' జవాబుల ద్వారా శిక్షణ ఇస్తారు.

నేను ఏదైనా కండిషన్ గురించి వ్రాసినప్పుడు దానిని దృష్టిలో పెట్టుకొని బాబూజీగారు ఇలా అంటూ ఉండేవారు: “నీ ఉత్తరం చదువుతూ ఉంటే, నీవు నాకు ఎదురుగా నిలబడి మాట్లాడుతున్నట్లే ఉంటుంది. నీకు జవాబు వ్రాయటం ఎందుకా అనిపిస్తుంది” అని. అనగా ‘వారు’ తమ హృదయానికి మనల్ని అంత సమీపంగా ఉంచుకుంటున్నారన్న మాట.

ఒక విషయం ఏమిటంటే, బాబూజీ దృష్టిలో, ఒక్కరినైనా ఆ విధంగా అన్ని కండిషన్స్ చూపించి, అర్థం చేసుకోగల్గినట్లుగా చేయగల్గితే, ఇంకా ఎందరో ఆ విధంగా తెలుసుకోగలుగుతారని భావం. అంటే ఒక కస్తూరిని అలా తయారు చేస్తే, ఎందరో కస్తూరీలు తయారు కావచ్చునని వారి భావం. ఆ విధంగా అందరూ ఆ స్థితులు గుండా ప్రయాణించి అంతిమం చేరుకొని ముక్తి పొందాలని ‘వారి’ సంకల్పం.

బాబూజీ ఒకసారి లాన్ (గార్డెన్) లో ఉండగా అభ్యాసులు ఒకచోట ఉండి, వారి దగ్గరికి ఇద్దరు, ముగ్గురు చొప్పున వెళ్ళు తున్నారు. అప్పుడు బాబూజీ మమ్మల్ని ఉద్దేశించి “ఏమిటి అలా ఉండిపోయారు” అని అడిగితే, “మేము వెయిటింగ్ లిస్టులో ఉన్నాము” అని అన్నాను. అందుకు జవాబుగా బాబూజీ, “నేను మీ కోసం వేచి ఉన్నాను. వేచి ఉండటానికి జాబితా (Waiting list) లేదు” అని అన్నారు. అప్పుడు నేను అన్నాను, “మేము మీ ఎదుట ఉన్న జాబితాలో ఉన్నాము” అని.

(బాబూజీ ఆ విధంగా అర్థోక్తితో మాట్లాడుతారు. దీనిలో అంతరార్థం ఏమిటంటే, బాబూజీ మనందరికి అంతిమంలో స్వాగతం పలకడానికి వేచి ఉన్నారని. అలాగే సిస్టర్ అన్న మాటల్లో,

బాబూజీ అనుగ్రహానికి పాత్రులై 'వారి'కి ఎదురుగా నిలబడి ఉన్నట్లు భావించుకోవచ్చు)

**అభ్యాసి: బాబూజీని ఎట్లా అర్థం చేసుకునేవారు?**

**జవాబు:** బాబూజీని చాలామంది ప్రిసెప్టర్స్ కూడా అర్థం చేసుకోగల్గేవారు కాదు. అందుకని బాబూజీ ఇలా అంటూ ఉండేవారు: "జనం నన్ను చూడడానికి వస్తారు కాని చూడకుండనే వెళ్ళిపోతారు" అని.

బాబూజీ అవతరించక పూర్వం రాముణ్ణి, కృష్ణుణ్ణి పూజించేవారు. అలాగే పూజించమని ఇతరులకు చెప్పేవారు. కాని ఒక మహత్తర వ్యక్తి ఎవ్వరైనా అవతరించినప్పుడు వారిని ఎవ్వరు చూశారనే ప్రశ్న రాదు. వారి దర్శనం కావాలంటే ఒక దివ్య ఆచ్ఛాదనం (కవరింగ్, ముసుగు) ఉంటుంది. వారిని దర్శించాలంటే వారిలో లయం కాగలిగితే చూడగలుగుతాం. వారు అవతరించారంటే, వారి నుంచి మనకు ట్రాన్స్‌మిషన్ వస్తోంది, శక్తి లభిస్తోంది. వారి సామీప్యతా భావం కలుగుతోంది. వారి ఆప్యాయత తెలుస్తోంది. ఈ సామీప్యత అనేది వారి జీవితంతో కాదు. జీవితం అంటే శరీరం జీవించి ఉండటం. శరీరం అశాశ్వతమైనది, నశింపు కలది. నీవు నశింపు కలిగిన శరీర రూపంతో సంబంధం పెట్టుకుంటే నీకు ప్రోగ్రెస్ ఉండదు. అందుకని బాబూజీ మానవరూపం మీద దృష్టి నిలిపి ధ్యానం చేయవద్దని చెప్పారు. నీకు ఆ రూపమే తప్పనిసరి అయితే, ఆకారమనే ముసుగు లోపలికి వెళ్ళి అందులో ఉన్న దివ్యత్వాన్ని, ఆ రూపంలో వచ్చిన దైవాన్ని చూడటానికి ప్రయత్నించాలి.

ఒక అభ్యాసి, "బాబూజీ తమ మాస్టర్‌ను అనగా వారి

రూపాన్ని మనస్సులో నిలుపుకొని ధ్యానం చేసినట్లు వ్రాశారు గదా!" అని సందేహం వ్యక్తం చేసినప్పుడు సిస్టర్ ఇలా అన్నారు: "బాబూజీ వ్రాసిన దానిలో మీరు ఒక్క లైను మాత్రమే చదివి ఉంటారు. ఆ తర్వాత చదివి ఉండరు. మహాత్ములు ఏమి చేశారో అది చేయటం కాదు. వారు ఏది చెప్పారో దానిని ఆచరించాలి. ఎందుకంటే ఇందులో భేదం ఉంది" అని.

లాలాజీ సాహెబ్‌కు వారి మాస్టర్ ఒక దైవకార్యం నిర్వహించమని ఆజ్ఞాపించారు. అది ఏమిటంటే, ఒక మహత్తర శక్తిని, అంతిమం (భూమా) యొక్క శక్తి నుంచి అవతరింపజేయటం. ఏడు మాసాల వారి తపస్సు ఫలించి వారి ప్రార్థన అంతిమం యొక్క శక్తిని స్పందింపచేయగల్గింది. అప్పుడు ఆ శక్తి బాబూజీ మహరాజ్ రూపంలో భూమిపై అవతరించటం జరిగింది. వారు ఆ విధంగా అవతరించినప్పుడు, లాలాజీకి తాను ఎవ్వరి కోసమైతే తపస్సు చేశారో, ఆ దివ్య శక్తి ధరణిపై దిగినట్లు వాతావరణాన్నిబట్టి తెలుసుకున్నారు. లాలాజీ అప్పుడు తమ ధ్యానంలో దివ్యదృష్టి ద్వారా ఆ దివ్య వ్యక్తి ఎక్కడ ఉన్నారు, ఎలా ఉన్నారు అని పరిశోధించారు. అప్పటికి బాబూజీ మహరాజ్ ఆరు రోజుల పసివానిగా ఉన్నారు. తాను గుర్తించిన విషయాన్ని ధృవ పరచుకోవటానికి వారు ఆ అనంతశక్తిని ప్రవహింపజేసి పరీక్షించారు. ఆ ఆరు రోజుల బాలుడు దానిని పూర్తిగా స్వీకరించగల్గాడు. అప్పుడు లాలాజీకి తాము అవతరింపజేసిన దివ్య శక్తి సమన్వితుడు ఆ బాలకుని రూపంలో ఉన్న వారేనని ధృవపడింది. ఆ దివ్యశక్తికి ఆ శిశువు ఎవ్వరో తెలియదు. అందువలన లాలాజీ సాహెబ్ ఆ శిశువు శరీరంలో, ఆ శక్తిని భరించటానికి ప్రవేశించారు. బాబూజీ తనకు తెలివి రాకపూర్వం రూపాన్నే దృష్టిలో నిలుపుకొని ధ్యానం చేశారు. (Form-

Meditation) కాని వారికి తమ రూపం తెలియదు. తమ అంతరంగంలో ఉన్న లాలాజీ సాహెబ్‌ను గుర్తించగల్గారు కాని తమ రూపం మాత్రం చూసుకోలేదు.

అందుచేత ఆ విధంగా మాహాత్ముల విషయాలు ఊహ కందనివిగా ఉంటాయి. మనం వాటిని గ్రహించలేము. మనం మన రూపాన్ని చూసుకుంటాము, కాని 'వారు' తమ రూపాన్ని చూసుకోలేదంటే అసాధారణమైన విషయం. అందుచేత మనం అటువంటి స్థితిని పొందే ప్రయత్నం చేసి నశించిపోయే శరీర రూపం మీద కాకుండా బాబూజీ స్మృతితోనే ధ్యానం చేయాలి.

బాబూజీ మహరాజ్ మనకు దివ్యకాంతిని హృదయంలో నిలుపుకొని ధ్యానం చేసే విధానాన్ని అందించారు. కనుక ఆ విధంగానే సాధన చేయాలి. నేను బాబూజీ మహరాజ్‌కు, "మీరు అనేకసార్లు ధ్యానం చేసే సమయంలో నా హృదయంలో కనిపిస్తున్నారు" అని వ్రాశాను. దానికి సమాధానంగా బాబూజీ ఏమి వ్రాశారంటే, ధ్యానంలో మాస్టర్‌ను చూడటంతోనే సరికాదు, అటువంటి సమయంలో ఈశ్వరీయధార వస్తూ ఉందనుకోవాలి అని వ్రాశారు. తమ రూపాన్ని (form) మర్చిపొమ్మనారు. కనుక 'వారు' ఏర్పరచిన విధానం (సిస్టమ్)లో ఒక పవిత్రత, దివ్యత్వము ఉన్నాయి. బాబూజీ తాము చేశారు కనుక అలా చేయమని ఉద్దేశ్యం కలిగి ఉంటే ఈ సిస్టమ్ ఎందుకు ప్రవేశపెట్టతారు! 'వారు' చేసిన విధానం వలన లాభం కలుగుతుందనుకుంటే దానినే ఈ విధానంలో ఎందుకు ప్రవేశపెట్టలేదు! జనం సరిగ్గా అర్థం చేసుకోలేకపోతున్నారు.

బాబూజీ మహరాజ్ నాకు ప్రతి ఉత్తరంలోనూ, లయను గురించి ప్రస్తావిస్తూ, నదులు వెళ్ళి సాగరంలో లయమవుతాయే

కాని సాగరం వచ్చి నదిలో లయం కాదు అని వ్రాసేవారు. కొందరు ఏదో అనుకొని ఏదో చెప్తూ ఉంటారు. ఒక అబద్ధం చెప్పితే పది అబద్ధాలు చెప్పవలసి ఉంటుంది. కనుక యదార్థమే మంచిది.

**అభ్యాసి: చాలా సందిగ్ధం కలుగుతూ ఉంటుంది!**

**జవాబు:** సరిగ్గా అర్థం చేసుకోవాలి. నేను ఎక్కడికి వెళ్ళినా అభ్యాసులు గుంపులుగా వస్తారు. ఎందుకంటే, బాబూజీని గురించిన విషయ చర్చ వారికి ఆనందం కలిగిస్తుంది కనుక, వారి హృదయానికి హత్తుకుంటుంది కనుక మనం తెలుసుకోగలం. బాబూజీ గురించిన విషయ చర్చలో దివ్యాకర్షణ ఉంటుంది. కాని క్రొత్త అభ్యాసులు ఈ విషయం గ్రహించలేరు. అసలు విషయం ఏమిటంటే, ఈ సందిగ్ధం (confusion) అనేది మనస్సుకు చెందినది. అది దానిని అంగీకరిస్తుంది. ఎవ్వరైనా మిమ్మల్ని గొప్ప వ్యక్తి అని పొగిడారనుకోండి, మీరు అంగీకరిస్తారా! అందుకని వివేకంతో సహేతుకంగా నిర్ణయించుకోవాలి.

లాలాజీ ప్రార్థన ద్వారా భూమి మీదకు దింపినది దివ్య తేజస్సును. ఆ దివ్యకాంతి అలా రూపం దాల్చింది. అనంతశక్తి అయిన బాబూజీలో లాలాజీ లయమయ్యారు. కాని బాబూజీ లాలాజీలో లయం కాలేదు.

**ప్రశ్న: బాబూజీ మహరాజ్ ఒకచోట ప్రత్యేక వ్యక్తి ఇప్పటికే అవతరించి తమ పని కొనసాగిస్తున్నారు అని వ్రాశారు గదా! అది వారిని గురించియేనా?**

**జవాబు:** బహుశా 'వారి'కి తమ పేరు కూడా తెలిసి ఉండలేదేమో! 'వారు' లాలాజీ సాహెబ్‌ను తప్ప మరి ఎవ్వరినీ చూసి ఉండలేదు. దాని అర్థం ఏమిటంటే, 'వారు' తమ శరీరాకారాన్ని ఎన్నడూ చూసి

ఉండలేదని. ఎవ్వరైతే తమ ఆకారాన్ని చూడలేని వారై ఉంటారో అటువంటి వారు బాబూజీని చూడగల్గుతారు.

ఒక మహత్తర వ్యక్తి (స్పెషల్ పర్సనాలిటి) యొక్క పని ఎలా ఉంటుందో చూడండి. బాబూజీని అవతారంగా ఎవ్వరూ తీసుకొనిరాలేదు. రాముడు అవతరించి రావణాసురుణ్ని, కృష్ణుడు అవతారమెత్తి కంసుడ్ని చంపి వాళ్ళు వచ్చిన ధ్యేయాన్ని ముగించుకొని వెళ్ళిపోయారు. బాబూజీ అలా కాదు. సమస్త సృష్టి అతలాకుతలమైపోయి, అది సంచరించవలసిన విధానం ముగింపుకు వచ్చినపుడు ఆ సృష్టిని మళ్ళీ సవరించటానికీ, తనలో ఈశ్వరుడు ఉన్నాడన్న విషయాన్ని విస్మరించి, తన కర్తవ్యాన్నే మరచిన మానవాళికి మళ్ళీ దైవాన్ని గుర్తింపజేయటానికి, దైవ సాక్షాత్కారం పొందాలనే కోరికను మానవులలో చైతన్య పరచటానికీ ఇటువంటి మహత్తర వ్యక్తిగా బాబూజీ వచ్చి, ఈ ప్రత్యేకమైన పనిని నిర్వహిస్తున్నారు. ఏడు నెలల కఠిన తపస్సు ద్వారా లాలాజీ సాహెబ్ బాబూజీని శక్తి సమేతంగా భూమి మీదకు ఇటువంటి మహత్తర సృష్టి కార్యం కొరకు ఆహ్వానించి తీసుకుని వచ్చారు. అందువలన సమస్త సృష్టిని దివ్యత్వంలో నింపటానికి, దివ్య సౌందర్యంతో అలరించటానికీ వచ్చారు కనుక, ఆ పనే చేస్తున్నారు బాబూజీ. అటువంటి మహత్తర వ్యక్తి మన మధ్యకు వచ్చి, మనలో చైతన్యం కలిగిస్తున్నారంటే అది మన మహద్భాగ్యం. వారిని మరచిపోవటం క్షంతవ్యం కాదు (క్షమార్హం కాదు). బాబూజీ భౌతిక శరీరాన్ని విడిచి వెళ్ళిన తర్వాత, 'వారు' లేరని అనడం, 'వారు' లేరు కనుక 'వారి' నుంచి ట్రాన్స్‌మిషన్, శక్తి లభించవని అనటం ఒక విధంగా వారి పోకడ ప్రక్కదారి పట్టినట్లవుతుంది. సహజమార్గ విధానం ప్రకారం మానవమాత్రులు అంతిమం చేరటానికి బాబూజీ వారధి వంటివారు.

వారి శిష్యులకు వారు నచ్చుతారు. వీరి మూలంగా వారు బాబూజీకి ఇంకా దూరమవుతున్నారు. బాబూజీ నన్ను, "నీవు సత్యాన్ని వ్రాశావు, కనుక నీవు ఎక్కడో ఒక చోట జీవించే ఉంటావు" అని అన్నారు. బాబూజీ లేరు, వారి నుంచి ట్రాన్స్‌మిషన్ రాదు అని ప్రచారం చేస్తున్న వారిని వారించకపోయినా, మౌనంగా ఉన్నా, ప్రత్యక్షంగా కాని, పరోక్షంగా గాని వారి వాదనకు సహకరించినట్లే. అటువంటి ప్రచారం వీరికీ తృప్తి కలిగిస్తోందా?

నేను నా కండిషన్స్ గురించి బాబూజీకి వ్రాసినప్పుడు, వారు "నీ ప్రోగ్రెస్ బాగుంది. నీవు ఇంకా బ్రతికే ఉన్నావు. నీవు చాలా వినయంగా నమ్రతగా నాకు జాబు వ్రాస్తున్నావు" అని అన్నారు. వారి ప్రతిస్పందనలో ఒక సునిశితమైన ధోరణి నాకు తోచింది. వారు అలా వ్రాశాక నాలో ప్రతికూల విషయాలు వినాలనే తలంపు తొలగిపోయింది. ఆ విధంగా బాబూజీ నాకు శాంతి చేకూర్చారు.

అభ్యాసి ధ్యానం గాని, క్లీనింగ్ కాని ఎంతసేపు చేసుకున్నాను అనేది లెక్కకు రాదు. ధ్యానంలో ఉన్నంతసేపూ వారి ఆకారం మీద గాని, ఫోటో మీద గాని దృష్టి నిలపకుండా కేవలం వారి స్మృతి (జ్ఞాపకం, రిమెంబరెన్స్) లోనే మునిగి ఉండాలి. మనం 'వారి' చరణాలవద్ద ఉన్నట్లుగానే అనుభూతి పొందుతూ తదేకంగా ధ్యానంలో మునిగిపోవాలి. హృదయం బాబూజీలో నింపుకోవడం, వారిలో ఐక్యం కావటం అవసరం. బాబూజీ చెప్పినట్లు (ఫర్ గెట్ దై సెల్ఫ్) 'నిన్ను నీవు మర్చిపో' అన్న కండిషన్‌లో ఉండాలి.

సాక్షాత్కారం పొందటం మన లక్ష్యం. దానిని ప్రేమతోనే పొందాలి. 'ప్రేమ్' అనే దానిని విడదీస్తే 'పరమ్ + ఎయిమ్' అంటే ఉన్నతమైన లేదా శ్రేష్టమైన లక్ష్యం అని అర్థం వస్తుంది. అలాగే

ప్యార్ ఉండాలి. 'ప్యార్' ను కూడా విడదీస్తే 'పా + యార్'; పా అంటే పొందుట, యార్ అంటే ప్రియుడు, కనుక 'ప్రియుని పొందుట' అని అర్థం వస్తుంది. ప్రేమలో స్థిరత్వం ఉంటే ప్యార్ అన్నదానిలో ప్రవాహం ఉంటుంది. భక్తి ప్రేమలతో బాబూజీకి మనల్ని మనం అర్పించుకుంటే 'వారి' నుంచి ప్రేమ ప్రవహిస్తుంది. అనగా భక్తి అభ్యాసీ వంతు అయితే ప్రేమ బాబూజీ వంతు అవుతుంది. ఆ విధంగా భక్తి, విశ్వాసాలతో బాబూజీ యందు సమర్పణ భావం కలిగి, 'వారు' మన ముందు ఉన్నారనుకుంటే 'వారి' నుంచి మనకు ప్రాణాహుతి వస్తుంది. ఆ ప్రాణాహుతి అను దివ్యధార మనలో ప్రవేశిస్తూ ఉంటే మనలో కలిగే అవాంఛిత (అనవసరమైన) ఆలోచనలు కూడా తొలగిపోతాయి. క్లీనింగ్ (నిర్మలీకరణ) చేసుకోవాలనుకున్నప్పుడు కూడా మనస్సులో ఒకసారి సంకల్పం చేసుకుంటే చాలు. సాయంకాలం నిర్మలీకరణ చేసుకోదలచినప్పుడు కూడా మన సంస్కారాలు తొలగిపోతున్నాయని భావన చేసుకుంటే అవి తొలగిపోతాయి. మనలో దృఢమైన ఆత్మ విశ్వాసం ఉంటే, ఆ సంస్కారాలు కూడా ఏర్పడవు. మీలో ఏ సంస్కారాలు లేవు అని నిశ్చితాభిప్రాయం ఉంటే నిర్మలీకరణ (క్లీనింగ్) చేసుకోకుండా కూడా ధ్యానం చేయవచ్చు. ఈ క్లీనింగ్ అనేది కేవలం తలచుకున్నట్లుగా కాకుండా క్లీనింగ్ అయ్యింది అన్న ఆంతరంగిక (feeling) అనుభూతి ఉండాలి.

ఒకసారి అభ్యాసి ఒకరు బాబూజీవద్దకు వచ్చి నేను రోజూ నాలుగుసార్లు స్నానం చేస్తాను. చాలా శుభ్రంగా ఉంటాను అన్నాడు. అతడు అక్కడ నుంచి వెళ్ళిపోయిన తర్వాత అక్కడ ఉన్న అభ్యాసులతో బాబూజీ అప్పుడు "బహుశా ఇతడు గత జన్మలో క్లీనర్ అయి ఉంటాడు'' అని అన్నారు. క్లీనింగ్ అన్నది

ఆంతరంగికమైనది కాని బాహ్య శరీరానిది కాదు. అనుపమానమైన వారు, అసామాన్యమైన వారు మన బాబూజీ –అనే గీతం ఆలాపించారు. ఇది వారి 'సంధ్యాకే గీత్' పుస్తకంలో పదహారవది.

సాక్షాత్కారం అనేది హృదయ మందిరంలోనే లభిస్తుంది. దానికి ఎవ్వరి ద్వారానో వెళ్ళవలసిన పని లేదు. దానికి ఎవ్వరి తోడూ అవసరం లేదు. బాబూజీ మనల్ని తీసుకుని వెళ్ళటానికే భూమి మీదికి వచ్చారు. అందుచేత కస్తూరిగాని, మరెవ్వరుకాని (channel) మాధ్యమం (మధ్యవర్తులు) కాదు. మనం తల్లి ఒడిలో పండుకోవటానికి ఎవ్వరి తోడూ అవసరం లేదు. ఆ తల్లియే బిడ్డను సాకినట్లుగా మనమూ సహజమార్గంతో పోషించబడతాము. అంతా బాబూజీ మహరాజ్‌కే సమర్పితం. ఛానల్ (మధ్యవర్తిత్వం) అంటూ ఉంటే అది మళ్ళీ బంధనానికి (bondage) తావిస్తుంది. మన అందరమూ నిస్సంకోచంగా నిరభ్యంతరంగా వెళ్ళి బాబూజీతో మాట్లాడవచ్చు. అలాగే మనల్ని వారికి అర్పించుకోవచ్చు.

**ప్రశ్న: అభ్యాసీని ప్రిసెప్టర్‌గా ఎప్పుడు నిర్ణయిస్తారు?**

**జవాబు:** బాబూజీ ఏమన్నారంటే "ఆ వ్యక్తి ఎక్కడికి వెళ్ళినా చుట్టూరా దివ్యత్వం (Divinity) వ్యాపించి ఉండాలి. మూలశక్తి నుండి శక్తిని గ్రహించే స్థితికి చేరగల్గాలి. అటువంటి స్థితిని పొందాకే ఆ వ్యక్తికి ప్రిసెప్టర్ కావటానికి అర్హత కలుగుతుంది" అని చెప్పారు. బాబూజీ ఆ వ్యక్తిని దివ్యశక్తితో అనుసంధానం చేసి శక్తి ప్రసారం చేసినప్పుడు ఆ వ్యక్తి ప్రిసెప్టర్‌గా పనిచేయటం జరుగుతుంది. ఆ శక్తి ప్రవాహం ఉన్నంతవరకే గాని ఇరవై నాలుగు గంటలూ ప్రిసెప్టర్‌గా ఉండటం

జరగదు. ఆ పని లేనప్పుడు ఆ వ్యక్తి కూడా మామూలు అభ్యాసియే. కనుక ప్రిసెప్టర్ అనగా దివ్యశక్తిని స్వీకరిస్తూ దానిని అభ్యాసులకు ప్రసరింపజేసే వారై ఉండాలి.

**ప్రశ్న: బాబూజీ మహాసమాధి తర్వాత ప్రిసెప్టర్ అయిన వారికి కూడా ఈ శక్తి ఉంటుందా?**

**జవాబు:** అసలు బాబూజీ మహరాజ్ ఎప్పుడు మహాసమాధి అయ్యారు? 'వారు' ఇప్పటికీ నా ఎదుటే ఉన్నారు. బాబూజీ నా ఎదుటనే ఉండి ఇది వ్రాయి, అది వ్రాయి, ఇలా వ్రాయి, అలా వ్రాయి అంటూ నన్ను ఆదేశిస్తూ ఉంటే 'వారు' లేనిది ఎప్పుడు, లేనిది ఎక్కడ? కనుక అది నిరర్థకమైన ఆలోచన. మహా సమాధి అనేది పూర్వపు మాట. పూర్వం కొందరు తనకు తానుగా సంక్షేపించుకొని ఈ లోకంతో సంబంధం లేకుండా తన కొరకే దైవ అన్వేషణలో నిశ్చలంగా ఉండిపోవటం జరిగేది. వారి నుండి ఇతరులకు ఏ శక్తీ లభించేది కాదు. కాని బాబూజీ అంతటా వ్యాపించి ఉన్నారు. అందరిలోను, అందరి ఎదుట ఉన్నారు. 'వారి' నుండి మనందరికీ శక్తి ప్రవహిస్తోంది. కనుక 'వారి' మహాసమాధి అనేది లేదు. (సమాధి అనేది భౌతిక కాయానికి మాత్రమే అని భావించుకోవాలి)

**అభ్యాసి: రిమెంబ్రన్స్ 'స్మృతి' గురించిన పుస్తకం వచ్చింది. చాలా బాగుంది. బాబూజీ చెప్పినవే ఉన్నాయి.**

**కస్తూరిజీ:** అవును, అది డెన్మార్క్ నుంచి విడుదల అయ్యింది. శ్రీ రామచంద్ర మిషన్ ఉన్నంత వరకు బాబూజీయే దాని మాస్టర్‌గా ఉంటారు. 'వారు' ప్రవేశపెట్టిన సహజమార్గ విధానానికి 'వారి' నుండే శక్తి లభిస్తుంది. అలా మరి ఎవ్వరి తరమూ కాదు.

**ప్రశ్న: కొన్ని అరుదైన సందర్భాలలో అభ్యాసి సూటిగా (డైరక్టుగా) అంతిమంతో సంబంధం పొందుతాడని అంటారు, అది ఏమిటి?**

**జవాబు:** బాబూజీయే అలా కలిగిస్తారు. స్వతహాగా అభ్యాసి వలన కాదు. అది సాధ్యపడితే ఎవ్వరికి వారు మరొకరికి అలా సంబంధం కలిగించవచ్చు గదా!

**ప్రశ్న: 1974వ సంవత్సరంలో బాబూజీ మిమ్మల్ని సహజమార్గ (ఆశ్రమ) బాధ్యత తీసుకోమని అన్నారట కదా!**

**జవాబు:** బాబూజీ వెళ్ళి పోతారేమోననే భావం మాకు ఎప్పుడూ కలగలేదు. 'వారు' వెళ్ళిపోలేదు కూడా. 'వారు' మనతోనే ఉన్నారు. శ్రీరాముడు భరతునికి రాజ్యం అప్పగించి వెళ్ళాడు. కాని భరతుడు రాముని పాదుకలను ప్రతినిధిగా ఉంచి రాజ్యమేలాడు. దాని వలన భరతుని ప్రతిష్ఠ ఎంతగా పెరిగిందో చూడండి. ఎవ్వరైనా విలువైన కుర్చీ మీద కూర్చోమని కోరారనుకోండి, అప్పుడు దాని మీద కాకుండా క్రింద కూర్చుంటేనే మనకు గౌరవం దక్కుతుంది.

**ప్రశ్న: బాబూజీ ఎప్పుడూ సాధకుడు తన శక్తిని లూటీ చేయాలని అంటారు. లూటీ చేయటం అంటే ఏమిటి? ఎలా?**

**జవాబు:** మనది కాని వస్తువును దేనినైనా పొందాలంటే దానిని దోచుకోవాలి. కాని మహత్తర శక్తిని పొందాలంటే మనల్ని మనం పోగొట్టుకోవాలి. అంటే మనం అహంను వదిలించుకోవాలి. ఒక స్థానంలో ఒకరు కూర్చుని ఉండగా అదే స్థానంలో మరొకరు కూర్చోవడానికి వీలుపడదు. ఎవ్వరూ లేకపోతే మరొకరు కూర్చునే అవకాశం ఉంటుంది. అదే విధంగా మన హృదయమనే స్థానంలో అహంను తొలగించినట్లయితే దివ్యత్వం అక్కడ చోటు చేసుకుంటుంది. మహత్తర శక్తి అక్కడ ప్రవేశిస్తుంది. ఆ తర్వాత

మనం 'నేను' అని భావించినప్పుడల్లా ఆ దివ్యశక్తినే ఉద్దేశించినట్లవుతుంది. మన హృదయం బాబూజీకే అర్పిస్తే నేను అనుకున్నప్పుడల్లా అది వారికే చెందుతుంది. అహం తొలగించుకోవటం కష్టమనుకుంటారు. కాని ఈ విధంగా చేస్తే చాలా సులభమే అవుతుంది. 'నేను' అను దానికి సంకేతం ఆ మహాపురుషునిదో లేక ఆ మహాశక్తిదో అయి ఉంటుంది. బాబూజీ ఇంకా ఏమన్నారంటే, "నేను ఇవ్వటం కన్నా అభ్యాసీకి తీసుకోవటం సులభం. ఎందుకంటే ఇవ్వటమనేదే నా భావం అయినా కాని తీసుకోవలసిన వారు యోగ్యత పొంది నా దృష్టిని పొందాలనే ఉద్దేశ్యంతో, ధ్యేయంతో నా మీద తపన నిలిపితే వారికి అది సులభంగా అందుతుంది" అని అన్నారు. కనుక ఆ కండిషన్ అలవరచుకోవాలి. భౌతికంగా లేదా ప్రాపంచికంగా మనం ఏదైనా తస్కరిస్తే అది శిక్షార్హమవుతుంది. కాని దివ్యశక్తిని కొల్లగొట్టినట్లయితే ఆ పని గౌరవించబడి ఆ వ్యక్తికి 'సెయింట్' (యోగి) అనే ఖ్యాతి దక్కుతుంది. బాబూజీపట్ల ప్రేమ పెంచుకోవటం, వారే ఆసరా అని ఆశ్రయించటం వలన దివ్యశక్తిని పొందటానికి అవకాశం కలుగుతుంది.

బాబూజీ ఒకసారి విద్వాన్ (విద్య కలవాడు)కు, భక్తునకు గల తేడాను కూడా వివరించారు.

భక్తుడు తాను ఎవ్వరిచేత ఎక్కడ కోరబడతాడో అక్కడికి వెళ్ళతాడు. ఇతరుల కోరిక మీద ఆధ్యాత్మికంగా అతని దృష్టి అటు ప్రసరిస్తుంది. అతని హృదయంలో దైవమే ధ్యేయంగా, దైవ ప్రేమకై తపన ఉంటుంది. దానిని వ్యాప్తి చేస్తాడు.

విద్వాన్ అనగా పండితుడి మనస్సు ఎప్పుడూ వివిధ విషయాల మీద ఆసక్తితో ఆలోచనా బద్ధమై ఉంటుంది. హృదయంలో

దివ్య స్పందన ఉండదు. అనగా భక్తుడు దైవం కోసం హృదయం తెరిచి ఉంచితే విద్వాన్ మెదడు ఆలోచనలతో చీరుకోవటం లాగా ఉంటుంది.

దివ్యత్వం కోసం హృదయం తెరిచి ఉంచితే నిద్రలోనైనా కూడా ఆ దివ్యత్వం ప్రవేశిస్తూనే ఉంటుంది.

ఆధ్యాత్మిక స్థితితోపాటు సరిపెట్టుకు పోగల స్థితిని కూడా అలవరచుకోవాలని బాబూజీ చెప్పారు. ఎలాగంటే, ధ్యానంలో మీకు శాంతి, ప్రేమ కలిగాయి అనుకోండి. వాటిని మీకు ఆధ్యాత్మికంగా కలుగుతున్న స్థితితో ఇముడ్చుకోవాలి. అలాగే మీరు ఉన్న వాతావరణ పరిస్థితులతోను, ప్రాపంచిక వ్యవహారంలోను సరిపెట్టుకొని ఇమిడిపోయే స్వభావాన్ని అలవరచుకోవాలి. బాబూజీ వద్దకు వెళ్ళే అభ్యాసులలో వారి ఆధ్యాత్మిక వృద్ధి అతడి స్థితినిబట్టి పైకి పంపుతూ ఉంటే దానికి కొందరు బాధపడటం వారికి ఇష్టం ఉండేదికాదు. అటువంటి పరిస్థితుల్లో తోటి అభ్యాసులు దిగులు పడకుండా సమాధాన పడటం అవుసరం. ధ్యానంలో కూర్చున్నప్పుడు మనకు కలిగే ఆధ్యాత్మిక స్థితులలో లీనమై 'వారు' ఏది అనుగ్రహిస్తే దానితో సంతృప్తి చెందేటట్లు ఉండాలి. ఇదే విధంగా నిత్యజీవితంలో మన జీవన విధానంలోను, ప్రాపంచిక విషయాల్లోనూ సరిపెట్టుకోవటం అవుసరం. మిత్రునితో మాట్లాడినా, శత్రువుతో మాట్లాడినా మనం మాట్లాడుతున్నది వారికి ఇష్టమో, అయిష్టమో తెలుసుకొని దానిని బట్టి వ్యవహరించాలి. బాబూజీని గురించి చర్చించుకునే సందర్భంలోనైనా సరే ఎదుటి వారికి సంతృప్తి, ఇష్టము లేనప్పుడు ఆ చర్చ నిలిపివేయాలి. వారికి నచ్చనందుకుగాని, వారిని మెప్పించలేక పోయినందకు గాని బాధపడకూడదు. అలాగే ఇతరులు

మనకు చెప్పేటప్పుడు కూడా సహనం వహించాలి. ఇష్టమైన దానినే గ్రహించాలి. ఎవ్వరి విషయంలోనైనా సరే నిరసన కలుగకుండా మసలుకోవాలి. మన ప్రవర్తన సౌమ్యంగా ఉండాలి. మాటల్లో తీయదనం, చూపులో ప్రేమ వ్యక్తం కావాలి. ఇవి ఆధ్యాత్మిక జీవికి ముఖ్య అవుసరాలు. బాబూజీ తమ ఇంటివద్ద కొందరిని లోనికి అనుమతించేవారు, మరొ కొందరిని అనుమతించేవారు కాదు. అలా అనుమతించబడని వారు ఏదో విధంగా అక్కడి కార్యకలాపాల్లో పాల్గొని బాబూజీ అభిమానం పొందాలని ఆరాటపడేవారు. బాబూజీకి అది అయిష్టంగా ఉండేది. అటువంటప్పుడు మనం మానసికంగా సరిపెట్టుకొని వారి అభీష్టానికి అనుకూలంగా మసలుకుని వారు ఇచ్చే దానితో తృప్తి చెందవలసి ఉంటుందే కాని అయిష్టత, అసంతృప్తి, ద్వేష భావాలకు తావివ్వకూడదు. మానసిక ప్రశాంతిని పొందటానికి ప్రయత్నించాలి. మనం ఎదుటి వారితో మాట్లాడేటప్పుడు వారి అభిరుచిని బట్టి ప్రియమైన దానినే మాట్లాడాలి. వారికి మనం చెప్పేది అప్రియమైనది అనుకుంటే దానిని నిలిపివేయాలి. ఈ విషయం బాబూజీ కూడా స్వయంగా పాటించేవారు. అభ్యాసులలో తమకు నచ్చని అలవాట్లు ఉన్నా పట్టించుకునే వారు కాదు. క్రమంగా వారే మార్పు చెందుతారనే భావంతో సర్దుబాటు ధోరణితోనే వ్యవహరించేవారు.

బాబూజీ చెప్పేవారు, “నేను విడిచి పెట్టమని ఎవ్వరికీ చెప్పటానికి రాలేదు. పట్టుకొమ్మని చెప్పటానికే వచ్చాను” అని. ఎవ్వరైనా అభ్యాసులు తాము పూజలు, ఆచార వ్యవహారాలు మానివేశామని చెప్పబోతుంటే వాటిని గురించి తాము ప్రశ్నించటం లేదనే వారు. నేను స్వయంగా పూజలు, పండుగలు, పబ్బాలు జరిపేదాన్ని. క్రమంగా నాకు వాటి మీద మక్కువ తగ్గిపోయాక,

ఒకసారి బాబూజీ, "నీవు ఇప్పుడు సరైన మార్గంలోకి వచ్చావు" అని అన్నారు. అప్పుడు నేను బాబూజీతో "మీరు ఇంతకు పూర్వమే హెచ్చరించి ఉంటే అప్పుడే మానివేసేదాన్ని గదా! మరి మీరు అలా ఎందుకు చెప్పలేదు" అని అడిగాను. అందుకు బాబూజీ, "ఎప్పుడూ ఎవ్వరినీ తప్పు పట్టకూడదు. అలా చేసినట్లైతే దాని ప్రభావం వారి మనస్సు మీద గాఢ ముద్ర వేస్తుంది. అదే ధ్యాసతో మధనపడతారు. కనుక మనస్సులో శ్రద్ధ కలిగినప్పుడే చేయాలి. మనస్సుకు నచ్చకపోతే వదిలివేయాలి" అనేవారు. ఆ విధంగా వదిలిపెట్టాల్సిన విషయాలు ప్రస్తావించకుండా పొందవలసిన ఆధాత్మిక విషయాలే వివరించే వారు. అభ్యాసుల్లో క్రమంగా మార్పు వస్తుందనే భావంతో సమాధానపడిపోయేవారు.

ఇటీవల సామాజికంగా, కుటుంబపరంగా సరిపెట్టుకుపోయే స్వభావం సన్నగిల్లిపోతుంది. గృహంలో స్త్రీలు, తాము ఎంత కష్టపడినా మెప్పు పొందలేకపోతున్నామని భావిస్తున్నారు. తాను లేకపోతేగాని ఆ శ్రమ సంగతి గ్రహించలేరని అనుకుంటారు. పిల్లల విషయంలో కూడా ఎంత ఖర్చు చేసినా చాలటం లేదని బాధ చెందుతారు. ఆ విధంగా విచార గ్రస్తం కాకుండా సాఫీగా ఆలోచించి ఎవ్వరికీ ఇబ్బంది కలగకుండా, అసంతృప్తి కలగకుండా మసలుకోవాలి. బాబూజీ చెప్పేవారు, "ఏదైనా ఇబ్బంది వచ్చినప్పుడు దానిని తర్కించుకొని వాదులాడుకుంటే ఇంటిలో అశాంతి అలముకుంటుంది. దాని వలన ఆధ్యాత్మికతకు భంగం వాటిల్లుతుంది. విధి నిర్వహణలో ఏ విధమైన ఇబ్బందులను ఎదుర్కోవలసి వచ్చినా దైవాన్ని స్మరించుకొని, ఆ భారం దైవానికి వదిలి మన ప్రయత్నం మనం చెయ్యాలి" అని. ఈ విధంగా ఆధ్యాత్మిక జీవనం చేసేవారికి సర్దుబాటు ధోరణి, సహనం చాలా

అవుసరమని వివరిస్తూ తమ స్వానుభవం ఒకటి ఇలా చెప్పారు: "సర్వేష్ తల్లి (బాబూజీ సతీమణి, ఉత్తర భారతదేశంలో భార్య అని నేరుగా చెప్పకుండా వారి బిడ్డల తల్లిగా పిలుస్తుంటారు) నన్ను చాలా చిరాకు పెడ్తుండేది. ఒకసారి కోర్టు నుంచి తిరిగి వచ్చాక ఫలహారం, టీ అందిస్తూనే చాలా చికాకు ప్రదర్శించింది. దానితో నేను ఆవేశపడి వాటిని తిరస్కరించాను. ఆ వ్యథతో లాలాజీకి ఉత్తరం వ్రాశాను. సర్వేష్ తల్లి నన్ను చాలా చికాకు పెట్తోంది, భరించలేకపోతున్నాను అని. అందుకు సమాధానంగా లాలాజీ, 'సర్వేష్ తల్లికి నా అభినందనలు. ఆమె ప్రవర్తన వలన నీలో సహన శక్తి పెరగటానికి అవకాశం కలుగుతోంది. ఆమె కోపం వలన నీలో సహన శక్తి పెరుగుతుందని ఆశిస్తాను. ఆధ్యాత్మిక వ్యక్తులకు సహనం చాలా అవుసరం' అని వ్రాశారు." లాలాజీ బాబూజీలో అసహనం ఉందని వేలెత్తి చూపకుండా మరో విధంగా చెప్పారు. బాబూజీ కూడా అదే విధంగా ఇతరుల లోపాలను ప్రస్తావించకుండా లోపం ఉందని గ్రహించగల్గినప్పుడు ఎవ్వరికి వారినే సరిచేసుకోమనే వారు. వారికీ సమస్యలు ఉన్నాయి. లాలాజీ తమ బీదరికాన్ని కూడా దాచుకోలేదు. అలాగే మనం సహనంతో సాధన చేస్తూ ఉంటే ఎన్నో అనుభవాలు వస్తూ ఉంటాయి. అన్నీ వచ్చి వచ్చి చివరకు రియలైజేషన్ (సాక్షాత్కారం) కలుగుతుంది. కనుక మనం వారిని ఏది కావాలని ప్రార్థిస్తామో అది దక్కుతుంది. నా స్వవిషయంలో, నేను వారిని ఏది కావాలని కోరితే దాని నల్లా వారు నాకు ప్రత్యక్షం చేశారు. సహజమార్గ అభ్యాసులు నిత్య జీవితంలో ఈ విధమైన జీవన శైలిని అలవర్చుకోవాలి. మన మిషన్ ఒక గృహస్థ సంస్థ. దీనిలో మనందరం కలిసిమెలసి మన లక్ష్యాన్ని సాధించుకునేందుకు కృషి చేయాలి. ధ్యానంలో లయావస్థను పొందలేకపోయినట్లయితే

అతని పూజ సరిగ్గా జరగటం లేదని అర్థం అన్నట్లుగా చెప్పారు. ఒక టీచర్ ఎంతగా శ్రమపడినప్పటికీ విద్యార్థులందరూ ఒకే స్థాయిని పొందలేరు. కొందరిలో తక్కువ జీర్ణించుకునే శక్తి ఉంటుంది. అప్పుడు వారిలో దానిని పెంచటానికి ప్రయత్నించాలి. అంతమాత్రం చేత అది టీచర్ తప్పు కాదు. బాబూజీ మహరాజ్ సాక్షాత్కారం కలిగించటానికే వచ్చారు. దీనిని మనందరం అంగీకరిస్తున్నాం. వారిలో ఇచ్ఛాశక్తి ఉంది. వారి ప్రేమలో పడి, దాని (వారి) కోసమే తపన చెందితే లక్ష్యాన్ని పొందుతాము. మనం అంతిమం చేరాలని బాబూజీ చెప్పారు. దానికి ముందు భగవత్ సాక్షాత్కారం పొందకుండా అంతిమం చేరటం సాధ్యం కాదు. కాబట్టి బాబూజీనే ఆశ్రయించి భగవత్ సాక్షాత్కారం పొంది తరువాత అంతిమం చేరాలి. అందుకు లక్ష్యం, దీక్ష రెండూ ఉండాలి. పక్షి రెండు రెక్కలు లేకుండా ఎలా ఎగరలేదో ఈ రెండు లేకుండా ఉన్నతిని పొందటం సాధ్యం కాదని బాబూజీ అన్నారు. ఎవ్వరైనా లక్ష్యాన్ని చూపగలరు. కాని ట్రాన్స్‌మిషన్ లేకుండా ప్రోగ్రెస్ ఉండదు. భగవత్ సాక్షాత్కారం కలగ్గానే అభ్యాసికి గుర్తింపు వస్తుంది. ఆ తర్వాత ప్రాణాహుతి మూలంగానే అభ్యాసీ పవిత్రత చెంది అంతిమం చేరతాడు. శ్రీ రామచంద్ర మిషన్ అభ్యాసీలు ఎవ్వరైనా సరే బాబూజీని స్మరించకుండా, బాబూజీ సహాయం లేకుండా ఉన్నత గతిని పొందలేరు. ఇది నిస్సందేహం.

బాబూజీ తనను కలుసుకోవటానికి పర్మిషన్ లేకపోయినా అనుమతించేవారు. నేను ఎప్పుడూ ముందుగా పర్మిషన్ తీసుకొనకుండా వారి వద్దకు వెళ్ళలేదు. కొంత మంది ప్రత్యేకంగా ఇంటర్‌వ్యూ కొరకు రిజర్వు చేయించుకునేవారు. నేను ఎప్పుడూ

అలా చేయలేదు. మనం ఒక లక్ష్యం కలిగి ఉన్నాం. మనం మన దగ్గరకు వచ్చే వారిని మన స్వంత వారిగా భావించి సాధ్యమైనంత వరకు ఏమి ఇవ్వగలమో అది ఇవ్వాలి. ఉన్నతి కలిగించేందుకు ప్రయత్నించాలే గాని లక్ష్యాన్ని విస్మరించకూడదు.

బుద్ధుడు, మహావీరుడు వారి వారి సిద్ధాంతాలను ప్రతిపాదించారు. కాని ఇదీ లక్ష్యం అని ప్రకటించలేదు. ఆధ్యాత్మికంగా వారు మాత్రం ఉన్నతి చెందారు. అహింసా సూత్రాన్ని ప్రవేశపెట్టారు. శిష్యులను వారి సూత్రాలను ఆచరించమన్నారే కాని వారికి కూడా తాము పొందిన దాన్ని ఇవ్వలేకపోయారు. కాని బాబూజీ 'సహజమార్గం' స్థాపించి దానిలో చేరిన మనందరికీ ధ్యానంలో ప్రాణాహుతిని ఇచ్చి గమ్యానికి తీసుకొని వెళ్ళుతున్నారు. మనకు శక్తిని ఇస్తున్నారు. వారికి సహకరిస్తే ఇంకా శీఘ్రంగా గమ్యం చేరతాము. నేను బాబూజీకి ఇలా వ్రాశాను: "సాక్షాత్కార స్థితికి చేరిన తర్వాత కాంతి కనిపించి దాని వెంట మీరు కనిపించారు" అని. అప్పుడు బాబూజీ ఇలా వ్రాశారు: "ఒక లక్ష్యం (aim) సిద్ధించిన తర్వాత జీవితం దివ్యమైపోతుంది. ఆ దివ్యత్వంలో (దైవంలో) మనం జీవించాలి. మనలో దైవం ఉన్నాడు. దైవంలో మనం లీనమైపోవాలి. ఆ స్థితి నుంచి ప్రారంభమై అభ్యాసీ ఇంకా ముందుకు ప్రయాణిస్తే ధృవం అనగా అంతిమం చేరతాడు" అని. అక్కడ శ్వాస ఉండదు. సెంట్రల్ రీజియన్‌లో అభ్యాసి స్వయంగా ప్రయాణించలేడు. 'వారు' వెంట పెట్టుకుని తీసుకుని వెళ్ళాల్సిందే.

**ప్రశ్న: కొంతమంది 'లివింగ్ మాస్టర్' అని అంటూ ఉంటారు. అది ఏమిటి? ఒక్కొక్కసారి అభ్యాసులకు ఇది తికమకగా ఉంటుంది. కాబట్టి విడమర్చి చెప్పండి.**

**జవాబు:** 'లివింగ్ మాస్టర్' అనగా 'జీవించి ఉన్న మాస్టర్' అనగానే మరణించిన మాస్టర్ అనే వారున్నట్లుగా తోస్తుంది. దీనిని బాబూజీ విషయంలో ప్రస్తావిస్తున్నారు కనుక అర్థం లేని మాటగానే చెప్పాల్సి ఉంటుంది. బాబూజీ అనంతము నుండి అవతరించిన వారై ఉన్నప్పుడు, 'జీవించి ఉండటం, మరణించటం' అనేవి ఉండవు. వారికి ప్రాణము, శక్తి అన్నీ అనంతం నుంచి వస్తున్నాయి. ఆ మహా ప్రాణానికి చావు పుట్టుకలు ఎలా ఉంటాయి? అవతార పురుషులైన రాముడు, కృష్ణుడు వంటి వారిని చనిపోయిన రాముడు, చనిపోయిన కృష్ణుడు అని అనగలమా? జాతస్య మరణం ధృవం అన్నట్లు పుట్టుక ఉన్న చోట మరణం ఉంటుంది. ఈ చావు పుట్టుకలు సంస్కారాలను బట్టి ఉంటూ ఉంటాయి. సంస్కారాలు లేని వారికి మరు జన్మ ఉండదు. అలాంటి కారణ జన్ములకు ఇవి ఆపాదించటం తగదు. ఈ దివ్యస్థితిని తెలియక ఇటువంటి అప శబ్దాలు ప్రయోగిస్తూ ఉంటారు. 'వారు' దివ్యత్వంతో జీవిస్తున్నారు. దివ్యత్వం వారిలో జీవిస్తోంది. అదే విధంగా మనం మొదటగా మనలో 'వారు' ఉన్నారనుకుంటాం. ఆ తర్వాత 'వారి'లో మనం ఉన్నామనుకుంటాం. ఇది ఒక రకమైన కండిషన్ (స్థితి). అందుచేత ఎప్పుడూ ఎవ్వరూ కూడా ఒక మహత్తర శక్తికి మరణం అనే శబ్దం వాడటం గొప్ప అపరాధమే అవుతుంది. మనిషికి లక్ష్యం కేవలం సాక్షాత్కారం. దీనికి సాధన ఉండాలే గాని అనవసరమైన మాటలు మంచిది కాదు. ధ్యానంలో మునిగి ఉంటే ఎటువంటి చెడ్డ ఆలోచనలు కూడా మనల్ని ప్రభావితం చేయలేవు. మనం మరణించిన తర్వాత ఏమౌతామో మనకు తెలియదు. మన అభ్యాసులకు ధ్యేయం తప్ప మరే ఆలోచనా ఉండకూడదు. 'వారి'ని మనం ప్రేమిస్తున్నాం. 'వారు' మన కొరకు ధ్యేయం 'సంకల్పించి' దానిని పూర్తి చేయించటానికి సశక్తియుతంగా

అవతరించి ఉన్నారు. 'వారు' మన ఎదుటనే ఉన్నారు. మనం దశనియమాల స్థితులు అన్నిటినీ పొందినట్లైతే మనం మన గమ్యం చేరినట్లే. మీరు లక్నో రావాలనే లక్ష్యం (aim) తో బయలుదేరతారు. ఒక గంట లేదా రెండు గంటలు ఆలస్యమైనా లక్నో అనగా మీ గమ్యం చేరతారు. అలాగే మీరు ఆధ్యాత్మికమైన లక్ష్యంతో ప్రయాణిస్తే వెనకా ముందుగా మీ గమ్యాన్ని చేరతారు. అందుకనే నేను ఒక నిర్ణయానికి వచ్చాను. వచ్చే జనవరి నుంచి నా వద్దకు వచ్చే వారు ఎవ్వరైనా సరే లక్ష్యం దృఢంగా ఉన్న వారినే గాని ఇతరులను రానివ్వను. ఇష్టం ఉన్న వారు వస్తారు, ఇష్టం లేని వారు మానుకోవచ్చు. సాధన లేకుండా సార్థకత రాదు. సార్థకం కాని సాధన సాధన కాదు. కనుక నా సేవను పొందాలనుకునేవారు దృఢమైన లక్ష్యంతో రండి. నా వద్దకు రావటానికి కొందరు భయపడతారు. మంచి విషయాలు వినడానికి, తెలుసుకోవటానికి ఎందుకు జంకుతారో తెలియదు. ఇది తలచుకుంటే ఒక్కొక్కసారి నా మనస్సుకు బాధ కలుగుతూ ఉంటుంది.

**ప్రశ్న: సమస్త ప్రపంచంలో అంతిమానికి చేర్చగలిగింది 'సహజమార్గం' ఒక్కటేనా?**

**జవాబు:** అవును. సహజమార్గ విధానం (సిస్టమ్) ప్రపంచంలో ఒకే ఒక్కటిగా ఉంది. దానికి అదే సాటిగా ఒకే ఒక్కటిగా నిలిచి ఉంటుంది. దీనిని బాబూజీ చూపించారు. దీనిని మించింది మరొకటి రావాలంటే ఈ యుగమే మారాలి. దీనిని మాఫీ చేయాలంటే ఎవ్వరికీ శక్యం గాని పని. బాబూజీ మహరాజ్ 'వారి' శక్తితో స్థాపించబడినటు వంటిది. 'వారి' సంకల్పం పూర్తి గాకుండా ఎవ్వరూ అడ్డుకోలేరు.

బాబూజీ మహరాజ్ అంటూ ఉండేవారు, కాలాన్ని వృధాగా గడిపేవారు చేతులు నలుపుకుంటూ రిక్త హస్తాలతో (వట్టి చేతులుతో) వెళ్ళవలసి వస్తుందని.

ఇప్పుడు అభ్యాసులైన వారు బాబూజీ ఉన్న సమయంలో మనం చేరలేక పోయాము గదా! అని బాధపడుతూ ఉంటారు. ఒక లక్ష్యం కలిగి అటువంటి బాధతోనే, ఏదో సాధించాలని, పొందాలని ప్రయత్నం చేయాలి. బాబూజీ తన వద్దకు మళ్ళీ మళ్ళీ వచ్చే వారితో ఇలా అనేవారు: "ఇంటి వద్దనే ఉండి నేను నీ ఎదుటే ఉన్నానని అనుకొని పూర్తిగా ధ్యానంలో మునిగిపోతే నీకు ట్రాన్స్‌మిషన్ వస్తుంది. దాని వలన నీకు మంచి ఫలితం ఉంటుంది. ఇక్కడకు వస్తే నీ దృష్టి ఇంటి మీద మళ్ళుతుంది. నేను ఎదుట ఉన్నా, నన్ను నీవు చూడలేవు" అని.

ఈ సందర్భంలో మీకు ఒక ఉదాహరణ చెప్తాను. మేము ఒకసారి రైల్లో ప్రయాణిస్తూండగా ప్రమాదం సంభవించింది. ముగ్గురు వ్యక్తులు మరణించారు. ప్రయాణిస్తున్నా వారిలో కొందరు, మిషన్ స్థాపించిన తర్వాత ఇటు వంటిది జరగలేదని వ్యాఖ్యానం చేస్తున్నారు. మరి కొందరు మేము దేవుణ్ణి తలచుకుంటూనే ఉన్నాం, అయినా ఇలా దెబ్బలు ఎందుకు తగిలాయి అని అడిగారు. అప్పుడు నేను ఇది ఆధ్యాత్మికతకు సంబంధించిన ప్రశ్న కాదు, నేను జవాబు చెప్పను. మీరు తలచుకొన్న దైవాన్నే అడగండి అన్నాను. ఇటువంటి ప్రశ్నలు అడగటం సముచితం కాదు. మీరు ప్రశ్నలు నిర్భయంగా అడగవచ్చు. అటువంటి ప్రశ్నలతో మనకు సంబంధం లేకపోయినా వారి హృదయంతో సంబంధం ఉంటుంది.

కొంతమంది అభ్యాసులు దక్షిణ భారతదేశం నుండే కాక పలు ప్రాంతాల నుంచి వస్తూ ఉంటారు. నేను ఎవ్వరినీ అభ్యంతర పెట్టను. మీ ప్రిసెప్టర్ ఎవ్వరు, ఎక్కడి నుంచి వచ్చారు అని అడగను. ప్రిసెప్టర్ ఎవ్వరైనా ప్రిసెప్టరే! అభ్యాసి ఎక్కడి వారయినా అభ్యాసియే. ఇటువంటి సమాచారం అనవసరం. ఎవ్వరైనా సరే ఒకే ఒక్క ఆలోచనతో రండి – అది మన బాబూజీ మరియు ధ్యానం. మిగతా విషయాలు అప్రస్తుతం.

ఒకసారి బాబూజీకి ఒక అభ్యాసి ఐదు వందల రూపాయలు విరాళం (డొనేషన్) గా అందజేశాడు. బాబూజీ దానిని తీసుకొని ఈశ్వర సహాయ్‌గార్కి ఇచ్చి భద్రపర్చమన్నారు. అప్పుడు మరొక మహిళా అభ్యాసి కూడా విరాళంగా ఏభై ఒక్క రూపాయి అందించారు. బాబూజీ అందులో ఒక్క రూపాయి మాత్రం తీసుకుని మిగిలిన ఏభై రూపాయలు తిరిగి ఇచ్చివేస్తూ నీ పిల్లల అవసరాలకు వినియోగించు అని అన్నారు. అప్పుడు ఆమె తన మనస్సులో తాను చాలా చిన్న మొత్తం ఇచ్చినందు వలన తిరస్కరిస్తున్నారేమోనని చిన్నబుచ్చుకుంది. బాబూజీ అది గ్రహించి ఇలా అన్నారు – ఆ అభ్యాసి ధనవంతుడు. అతడు ఈ ఐదు వందలు ఇచ్చినా అతని వద్ద ఇంకా కోట్ల రూపాయల ధనం ఉంది. కాని నీ స్తోమతకు నీవు ఇచ్చిన ధనం ఎక్కువ. నీవు కూడా నా కుటుంబ సభ్యురాలివే. నీ కుటుంబ సంరక్షణ బాధ్యత నా మీద ఉంది. నీవు హృదయ పూర్వకంగా ఇచ్చావు కనుక అందులో ఒక్క రూపాయి మాత్రం నీ తృప్తి కొరకు స్వీకరించాను. నేను తిరిగి ఇచ్చిన డబ్బును నేను కానుకగా ఇచ్చినట్లు భావించి నీ బిడ్డల అవసరాలకు వినియోగించు అని వివరించారు. ఇలా కాకుండా కొంతమంది విరాళం అధిక మొత్తంలో ఇస్తూ ఉంటారు. అలా ఇవ్వటంలో వారి ఉద్దేశ్యం ఎంత

పెద్ద మొత్తం ఇస్తే అంత ఎక్కువగా ఆధ్యాత్మికత (devotion) దక్కుతుందని. ఇలా ఆడంబరంగా ఇచ్చినది విరాళం (డొనేషన్) అవుతుంది. అలా కాకుండా హృదయ పూర్వకంగా తమ స్తోమతకు తగ్గట్లుగా ఇచ్చింది తన సహకారం (కంట్రిబ్యూషన్) అవుతుంది.

**ప్రశ్న: ధ్యానంలో నాకు ఒక్కొక్కసారి తృప్తి, ఒక్కొక్కసారి స్థబ్దత అనుభవం అవుతుంది, ఎందుచేత?**

**జవాబు:** ప్రతి ఒక్క స్థితిలోను దానిలో కలిగిన అనుభవాన్ని, ఆనందాన్ని తలచుకుంటూ ఉండాలి. ఆ స్థితి చివరలో ఒక విధమైన సూక్ష్మత్వం వస్తుంది. మనకు ఆ కండిషన్‌లో (స్థితిలో) ఏదైతే కలుగుతుందో దానినే బాబూజీ ఇచ్చినట్లుగా అనుకోవాలి. తరువాత స్థితిలోనికి మారబోయే ముందు గతస్థితి యొక్క సూక్ష్మత్వాన్ని జీర్ణించుకోవటంలో సమయం పట్టినప్పుడు అలా నిలకడ ఏర్పడినట్లు తోస్తుంది. బాబూజీ మనకు ఎంత అవసరమో అంత ఇచ్చారనుకుని మరో కండిషన్ కలిగే వరకు దానిని మననం చేసుకుంటూ సంతృప్తి చెందాలి గాని నిరుత్సాహపడకూడదు. ఒక స్థితి నుంచి మరొక స్థితికి మారుతున్నప్పుడు ఆ దివ్య ప్రవాహంలో సూక్ష్మత్వం ఏర్పడటం వలన అలా ఉంటుందే కాని అది స్థబ్దత (నిలిచిపోవటం) కాదు. అది వారి ఈ అనుభూతి ప్రతి స్థితి మార్పిడి సందర్భంలోనూ ఉంటుంది. అంతేకాని స్థబ్దత అనేది ఒక స్థితి కాదు. బాబూజీకి ఇటువంటి అనుభవాన్ని నేను తెలియజేసినప్పుడు, 'వారు' నాకు (మిఠాయి) స్వీట్స్ ఇచ్చినప్పుడు కలిగే అనుభూతికి, స్వీట్స్ ఇవ్వనప్పుడు కలిగే అనుభూతికి ఉన్న భేదాన్ని దీనితో పోల్చుకోమన్నారు.

**ప్రశ్న: ఆంతరిక గ్రహణ శక్తిని పెంచుకోవటం ఎలా?**

**జవాబు:** మనం బాహ్య ప్రపంచంలోని మార్పుల్ని గమనించగల్గినట్లుగానే ఆంతరికమైన ఈ మార్పులను కూడా గ్రహించగల్గిన శక్తి దానికదే కలుగుతుంది. కళ్ళు తెరిస్తే బాహ్య ప్రపంచం కనిపిస్తుంది. అదే విధంగా కళ్ళు మూసుకుని మనం ధ్యానంలో మునిగిపోయి బాబూజీతో సంబంధం ఏర్పర్చుకోగానే ఆంతరిక స్థితులను చూడటం జరుగుతుంది. మన అటెన్షన్ (దృష్టి) ఎప్పుడూ బాబూజీ మీదనే ఉండాలి. బాబూజీ సర్వదా మనల్ని తన దృష్టిలోనే పెట్టుకుంటారు. మనం ఏదైనా బాహ్యప్రపంచంలోని పనుల్లో నిమగ్నమైనా మళ్ళీ విరామం చిక్కగానే వారిని తలచుకుంటూ ఉంటే వారితో సంబంధం తెగిపోకుండా నిలుపుకొని ఉన్నట్లే! ఇది మొదట మనం ప్రయత్న పూర్వకంగా చేసినట్లు తోచినా క్రమంగా దానికదే కొనసాగుతుంది. మనం ఆఫీసులో పనిచేస్తున్నా, ఇంట్లో వంట చేస్తున్నా బాబూజీ మన ఎదుటనే ఉన్నారనుకొని చేస్తూ ఉంటే బాబూజీకి చాలా సంతోషం కలుగుతుంది. ధ్యాన సమయంలో ఓమ్ అన్నప్పుడు ధ్యానం (మెడిటేషన్) పూర్తయిపోయిందని అనుకుంటాము. అది పూర్తవటం కాదు. ఇతర ప్రాపంచిక జీవన వ్యవహారం కోసం తాత్కాలిక విరామం మాత్రమేనని అనుకోవాలి. బాబూజీ అంటూ ఉండేవారు, ధ్యానం ఆపివేయగానే అభ్యాసులు క్లాసులో పిరియడ్ అయిపోగానే విద్యార్థులు లేచిపోయినట్లు, లేచిపోతారు అని. బాబూజీ అంటూ ఉండేవారు తాము నిరంతరం అభ్యాసిని దృష్టిలో ఉంచుకుంటాను అని. అలాగే మనం కూడా మన స్మృతిలోనే 'వారి'ని ఉంచుకోవాలి. మనం దీనిని మొదట ప్రయత్న పూర్వకంగా అలవరచుకున్నప్పటికీ తర్వాత దానంతటదే అలవాటైపోతుంది. ఇది చాలా తేలిక. బాబూజీని పూర్తిగా జ్ఞాపకం ఉంచుకోగలిగితే అంతకు మించిన క్లీనింగ్ (నిర్మలీకరణ) ఉండదు.

**ప్రశ్న: ధ్యానానికి గాని, సత్సంగ్‌కు గాని, ఆధ్యాత్మిక సమావేశాలకు గాని వెళ్ళేటప్పుడు క్లీనింగ్ చేసుకొని వెళ్ళాలా?**

**జవాబు:** ఎప్పుడైనా సరే ఏ సమావేశానికి వెళ్ళినా, ఏ ఆధ్యాత్మిక సమావేశానికి వెళ్ళినా, ప్రిసెప్టర్ వద్దకు వెళ్ళినా క్లీనింగ్ చేసుకోనవసరం లేదు. మేము బాబూజీ వద్దకు వెళ్ళినప్పుడు 7, 8 రోజులు ఉండే వాళ్ళం. ఎప్పుడూ కూడా క్లీనింగ్ మాట తలపెట్టే వాళ్ళం కాదు. బాబూజీనే మదిలో నిలుపుకొని ఆధ్యాత్మిక చింతన (దైవ చింతన) లోనే మునిగి ఉంటే అప్పుడు జరిగినంత నిర్మలీకరణ మీరు స్వయంగా క్లీనింగ్ చేసుకున్నప్పుడు కూడా జరగదు. బాబూజీ చెప్పేవారు – పూర్తిగా నీ అహంను వదిలివేయి. అంతా తెరవబడి ఉంది. ధ్యానంలో నీవు ఎలా అవ్వాలో అలా అయిపో అని. డాక్టర్ వద్దకు వెళ్ళినా, అలాగే ప్రిసెప్టర్ వద్దకు వెళ్ళినా క్లీనింగ్ చేసుకుని వెళ్ళనవసరం లేదు. దానిని వారే స్వయంగా చేస్తారు. ఇందులో మొదటిది భౌతికంగానూ, రెండవది ఆధ్యాత్మికంగానూ అని అర్థం చేసుకోవాలి. ధ్యానానికి ముందు క్లీనింగ్ అవసరం లేదు.

ధ్యానం చేసే ముందు, రాత్రి ప్రార్థన, అలాగే సాయం సంధ్యలో క్లీనింగ్ అనే వాటిని బాబూజీ సహజమార్గంలో నియమంగా నియమించలేదు. క్లీనింగ్ విషయంలో అది నియమం కాదు. మీకు బాహ్యంగా గాని, మీ స్వవిషయంలో గాని చెడుగా తోచినపుడు, వాటి వలన మీకు సంస్కారాలు ఏర్పడతాయేమో అనుకున్నప్పుడు క్లీనింగ్ చేసుకోవచ్చు. అది వ్యక్తిగత నైర్మల్యం మీద ఆధారపడి ఉంటుంది.

రాత్రి పరుండబోయేముందు కూడా ప్రార్థన చెప్పుకోవటంలో ఉద్దేశ్యం మనం బాబూజీకి సమర్పితం కావటానికి, హృదయం

వారికే తెరచి ఉంచటానికి, శక్తిని స్వీకరించటానికి అనువుగా మనల్ని మనం సిద్ధం చేసుకోవటానికే. అభ్యాసికి ధ్యానంలో బాబూజీ గ్రేస్ లేదా కృప లభిస్తుంది. సహజమార్గంలో ప్రతి ఒక్క శబ్దం మీద బాబూజీకి అథారిటీ (ఆధిపత్యం) ఉంది. పరీక్షల్లో విద్యార్థిని గట్టెక్కించటానికి ఏవో కొన్ని గ్రేస్ మార్కులు వేస్తూ ఉన్నట్లే, ఎవ్వరికైతే సహజమార్గం మీద సంపూర్ణ విశ్వాసము, బాబూజీ మీద ఆధారపడి ఉండటం జరుగుతుందో వారిని ఏదో విధంగా ముందుకు పంపించటానికి (ప్రోగ్రెస్) అభ్యాసికి కూడా గ్రేస్ మార్కులు, జాలిపడి వేసే మార్కులు వేస్తారు బాబూజీ. సహజమార్గ విధానాన్ని సక్రమంగా ఆచరించి శరీరం వదలి వెళ్ళే వారికి మళ్ళీ శరీరం ధరించకుండా ఉండటానికి కొన్ని గ్రేస్ మార్కులు కలిపియైనా వారికి పునర్జన్మ లేని స్థితిని అనుగ్రహిస్తారు. దీనిని 'వారు' స్వయంగా ప్రకటించారు.

మనం ప్రయోగ పూర్వకంగా, స్వానుభవంతో చూస్తున్నాం. సహజమార్గ విధానంలో అభ్యాసిగా అడుగు పెట్టినప్పుడు మూడు సిట్టింగుల తర్వాత ధ్యానం ప్రారంభిస్తున్నాం. మనకు వెంటనే అనుభవాలు కలగక బాగుందని అనిపించకపోవచ్చు. కాని క్రమంగా బాబూజీ మన ఎదుట ప్రత్యక్షమవుతారు. క్రమంగా ఆనందానుభూతి కలుగుతుంది. 'వారి' అనుగ్రహం వలన మనకు ప్రోగ్రెస్ కలుగుతుంది. వారికి ఉన్న అధికారం ఎటువంటిది అంటే 'వారు' చెప్పిన ప్రతి మాటకు ఎదురు ఉండదు. అభ్యాసీ సహజమార్గ నియమాలు అన్నింటినీ నిర్వర్తించగలిగితే పునర్జన్మ నుంచి విముక్తి కలుగుతుందని, నిరాశ చెందనవసరం లేదని బాబూజీ హామీ ఇచ్చారు. అంతే కాదు, ఆధ్యాత్మిక డైరీ నుంచి 'నిరాశ' అనే శబ్దాన్ని తొలగించి వేయమని సాధికారంగా చెప్పారు.

ఒక ఆభ్యాసి తాను ధ్యానం చేసినప్పుడు ఏమీ ఫీలింగ్ (అనుభూతి) రాలేదు అని అన్నాడు. దీనిని మనం ఈ విధంగా అర్థం చేసుకోవాలి. తల్లి, పిల్లల పోషణ చేస్తుంది. పిల్లలు అమాయకులు కనుక వారి తల్లి ఏమి చేస్తోందో, వారిని ఎలా పోషిస్తోందో తెలియదు. వారికి తెలియకపోయినా తల్లి పోషిస్తున్నట్లే, వారిని సంరక్షిస్తున్నట్లే. అదే విధంగా అభ్యాసులు కూడా అమాయక పిల్లల వంటి వారు. సహజమార్గంలో చేరాక బాబూజీయే మనకు తల్లిలాగా, మనకు తెలియకపోయినప్పటికీ, మన బాగోగులు చూస్తారు. అనగా మనకు రక్షణ కల్పిస్తారు. ప్రోగ్రెస్ ఇస్తారు, అంతిమానికి తీసుకునివెళ్ళతారు. బిడ్డలు తల్లిని అంటి పెట్టుకొని ఉన్నట్లే అభ్యాసులైన మనం కూడా ధ్యానంలో బాబూజీని అంటిపెట్టుకొని 'వారి' యందు విశ్వాసం కలిగి ఉండటమే ముఖ్యం. బిడ్డలు ఎదిగిన తర్వాత తమ తల్లి పోషణను గ్రహించినట్లుగానే మనం కూడా ప్రోగ్రెస్ (పురోభివృద్ధి) చెందాక వారిని తెలుసు కుంటాము. కనుక ఫీలింగ్ గురించి ఆవేదన చెందనవసరం లేదు.

అభ్యాసీలు తమ మనస్సు నిలవటం లేదు, అటు ఇటు పోతోంది అని ఫిర్యాదు చేస్తూ ఉంటారు. మనం బాబూజీ యొక్క సహజమార్గంలో ప్రవేశించాం. 'వారు' మన కోసమే దివి నుంచి భువికి దిగి వచ్చారు. 'వారే' మన బాగోగులు చూస్తారని అనుకొని 'వారి' శరణాగతిని పొందాలి. 'వారి'తోనే దృఢమైన సంబంధాన్ని ఏర్పరుచుకోవాలి.

మరి కొంతమంది నెగెటివ్ థాట్స్ (ప్రతికూలమైన ఆలోచనలు) వస్తూ ఉంటాయి అని అంటారు. మనం ఎల్లప్పుడూ అభ్యాసం చేస్తున్నాం! ఇది చేశాం, అది చేశాం అని తాము చేస్తున్నాం

అనుకున్నప్పుడు అటువంటి ప్రతికూలమైన ఆలోచనలు వస్తాయి. అలా కాకుండా మనం శ్రీరామచంద్ర మిషన్‌కు చెందిన వారము, అంతా బాబూజీయే చూసుకుంటారు అని మనస్సు పదిలపరచుకుంటే (మనస్సు నిలకడ చేసుకుంటే) అవి రావు.

**ప్రశ్న: హైదరాబాద్ ఆశ్రమంలో ప్రతి రోజూ సత్సంగానికి హాజరు కావాలంటారు. అలా వెళ్ళకపోతే ఏమైనా అవుతుందా?**

**జవాబు:** గైడెన్స్ సరిగ్గా ఉండాలి. (సరియైన దారి చూపాలి) మిషన్ పట్ల భక్తి, ప్రేమ సత్సంబంధము కలిగించాలి. బాబూజీ ప్రతిరోజూ ఆశ్రమానికి వెళ్ళాలనే నియమం చెప్పలేదు. ఆశ్రమానికి వెళ్ళి కొంచెం సేపు ధ్యానం చేసుకొని వస్తే పని ముగిసిపోయిందని అనుకుంటారు. అలా కాకుండా ఒక విధమైన సమర్పణ భావం అలవరచుకోవాలి. అందుకనే బాబూజీ ప్రతి అభ్యాసీ తన ఇంటిని ఆశ్రమంగా చేసుకోమన్నారు. ఆశ్రమం అంటే అది ఒక భవనానికి, ఒక స్థలానికి పరిమితం కాదు. అక్కడికే పోయి బాబూజీ శరణాగతిని పొందనవసరం లేదు. దానిని మనస్సులో భావన చేయాలి. ప్రపంచంలోని అన్ని ప్రదేశాల నుంచి అశాంతితో బాధపడుతున్న వారు వచ్చి ఒక చోట శాంతి పొందేటందుకు ఆశ్రమం ఏర్పాటవుతుంది. ఇంటిలోనే కూర్చుని ధ్యానంలో మనస్సు లగ్నం చేస్తే అక్కడా శాంతి లభిస్తుంది, శక్తి లభిస్తుంది. క్రమక్రమంగా ఆ శక్తితో ఇల్లే ఒక పవిత్ర ఆశ్రమంగా తయారవుతుంది. ఆశ్రమానికి వెళ్ళటమనే నియమం, అక్కడ హాజరు పట్టీలో పేరు నమోదు చేయటం కేవలం భౌతికమైనవి. మనస్సును నియంత్రించవు. అలా కాకుండా మనస్సు ప్రధానం కనుక దానిని బాబూజీ చరణాల మీద నిలపాలి. ఆరోగ్యం, ధనం, సమయం లేకపోతే షాజహాన్‌పూర్

వెళ్ళాల్సిన అవసరం లేదు. ఉన్న చోటనే నిర్వహించుకోవచ్చు. అట్లాగయినా వారికి శక్తి లభిస్తుంది. బాబూజీకి తమ శక్తి మీద విశ్వాసం ఉంది కనుక 'వారు' అటువంటి నియమం చెప్పలేదు. ఇంటిలో స్త్రీలకు చాలా పనులు ఉంటాయి. తీరుబాటు ఉండదు. అందుకని ఆదివారం సత్సంగానికి రాలేకపోయినా ఫర్వాలేదు. ఇంటి పనులు చేసుకుంటూనే దైవస్మృతి కలిగి ఉంటే చాలునని, మనది ఒక గృహస్థ సంస్థ అని బాబూజీ చెప్పారు. (తమంతట తాముగా అభ్యాసం అలవరచుకోలేని వారి కోసం ఇటువంటి నిర్బంధం వలన కొంత ఉపయోగం ఉండవచ్చు)

బాబూజీ పాదాలు స్త్రీలు అంటరాదనే నియమం ఉండేది. నాకు మనస్సులో 'వారి' చరణాలు అంటి నమస్కరించాలన్న భావం ఉంది. నేను ఆ నియమాన్ని పాటించాలి కనుక 'వారు' పండుకొని ఉన్న గది గుమ్మం వద్ద నిలబడి మనస్సులోనే వారికి పాదాభివందనం చేశాను. అప్పుడు బాబూజీ లేచి వచ్చి నీవు నా పాదాలు తాకకపోయినా తాకినట్లుగానే భావించి ఆశీర్వదిస్తున్నానని అన్నారు. కనుక మనస్సు ప్రధానమే గాని భౌతిక చర్య కాదు.

ఒకసారి బాబూజీ గుల్బర్గా నుంచి రాయచూర్ వెళ్ళుతున్నారు. ఒక అభ్యాసి తాను కూడా అక్కడికి వెళ్ళటానికి ప్రయాణమయ్యాడు. అప్పుడు బాబూజీ అతనితో, "నేను ఇక్కడ మూడు రోజులు ఉన్నాను. నేను ఇచ్చిన దానిని నీవు జీర్ణించుకోవటానికి (absorb) ప్రయత్నించు. ఈ విధంగా నీవు రావటం వలన ఆ ఆశ్రమానికి భారమవుతుంది. ఆశ్రమాలు సరిగ్గా పోషింపబడేటట్లు చూడటం నా బాధ్యత" అని నచ్చజెప్పారు. అదే విధంగా ఇంకొకసారి మరొకరు ఇలాగే ప్రయత్నిస్తే బాబూజీ వారించినా, "నా దగ్గర చాలా డబ్బు

ఉంది, నాకు ఇబ్బంది లేదు" అని అన్నాడు. అప్పుడు బాబూజీ, "నీకు డబ్బు ఉండవచ్చు, నాకు డబ్బు ఉండాలి గదా! నీ డబ్బుతో నేను ఖర్చు చెయ్యను. నాకు ఉన్న దానిని బట్టే నేను ఖర్చు పెడతాను" అని అన్నారు.

**ప్రశ్న: ఇండివిడ్యువల్ సిట్టింగ్‌లో ఆలోచనలు భంగం కలిగిస్తున్నాయి. అయినా బాబూజీ ఇచ్చేది మనం జీర్ణించుకునేట్లు 'వారు' చేస్తారా?**

**జవాబు:** ఎవరి వద్ద (ఏ ప్రిసెప్టర్ వద్ద) కూర్చున్నప్పటికి, వచ్చినటువంటి ట్రాన్స్‌మిషన్ స్వీకరించబడుతుందే కాని వృధా అయ్యే సమస్యే లేదు. అభ్యాసీ ఎంత సావధానంగా ఉంటే అంత ఎక్కువగా స్వీకరించబడుతుంది. మిగిలినది వాతావరణంలో నిలిచి ఉంటుంది. ఆలోచనలు మైండ్‌ను తాకుతాయి. కాని హృదయం ట్రాన్స్‌మిషన్‌ను (ప్రాణాహుతిని) సంగ్రహించుకుంటుంది. అలా మిగిలి ఉన్న ప్రాణాహుతిని జీర్ణింపచేయటానికి బాబూజీ సహాయపడతారు. థాట్స్ (ఆలోచనలు) వచ్చాయి అంటారు. వాటిని ఆహ్వానించవద్దు. ధ్యానంలో మనకు ఆలోచనలు వచ్చాయి అంటే వాటితో మన మనస్సులో సంబంధం కలిగి ఉన్నామన్నమాట. అలా ధ్యానంలో అవి వచ్చినప్పుడు బాబూజీని స్మరించుకొని 'వారి' వైపు మనస్సు తరలించండి. ప్రాణాహుతి ధాటికి తట్టుకోలేక అప్పుడు అవి పారిపోతాయి. మిమ్మల్ని ఇబ్బంది పెట్టవు. మనం ఆహ్వానిస్తే అవి రాక ఏం చేస్తాయి? బాబూజీ నా హృదయంలో ఉన్నారనుకోండి. అదే అందుకు నివారణ.

**ప్రశ్న: "రాజయోగ ప్రభావం" అనే పుస్తకంలో హృదయంలో పాయింట్స్ ఎ, బి అని చర్చించారు. వాటి వివరణ ఏమిటి?**

**జవాబు:** పాయింట్స్ గురించి ఆలోచన పెట్టుకోవద్దు. ఈ జన్మలోనే అభ్యాసిని అంతిమానికి తీసుకుని వెళ్ళాలని 'వారు' నిశ్చయించు కున్నారు కనుక అది దానికి సంబంధించిన పరిశోధన. అవి ఇతరులకు కూడా, ఎలా తీసుకుని వెళ్ళాలి అని తెలుసుకునేందుకు పనికి వస్తాయి. మనమల్లా భక్తి, ప్రేమ, స్మరణ కలిగి ఉంటే చాలు. లండన్‌లో మీ బిడ్డలు ఉన్నారనుకుంటే వారి మీద మీ మనస్సు ఉంటుంది. ధ్యాస ఉంటుంది. ప్రేమ ఉంటుంది. అలాగే బాబూజీ మీద ప్రేమ, ధ్యాస ఉంచుకోండి. మీరు సరైన అభ్యాసులు అయితే, మీలో ఇటువంటి అవగాహన (ఫీలింగ్) ఉంటేనే నిజమైన అభ్యాసులు కాగల్గుతారు. మనస్సు మనదే. కాని దాని తీరును మనం మలుచుకోవాలి.

**ప్రశ్న: స్వర్గం, నరకం అంటారు. హిందువులు నరకం గురించి భయపెడ్తారు. ప్రిసెప్టర్స్ కూడా నరకం అనుభవిస్తావని భయపెడ్తారు, ఏమిటి?**

**జవాబు:** బాబూజీ ఒక వాతావరణాన్ని చూపించారు. మీకు కడుపులో బాధ ఉందనుకోండి. దానికి మందు తీసుకుంటారు. ఉపశమనం కలుగుతుంది. 'వారు' ఒక రకమైన వాతావరణాన్ని చూపించారు. అక్కడ మీకు బాధ కలిగిందనుకోండి. మీరు కెవ్వుమని అరవటమే కాని వేరే ఉపశమన మార్గం (బాధ తగ్గించుకునే మార్గం) ఉండదు. అది ఒక రకమైన ప్రకృతి ధూళి. బాబూజీ అంతిమం చూపించారు. మనం చేసిన తప్పులను బట్టి వచ్చే బాధ నరకం అవుతుంది. మంచి చేసి ఉంటే అనుభవిస్తున్న సుఖం స్వర్గం అవుతుంది. ఏదైనా సరే, సంస్కార రూపమే కనుక అనుభవించి తీరాల్సిందే. (తప్పులు ఇనుప సంకెళ్ళు అయితే ఒప్పులు అనుకొనేవి బంగారు సంకెళ్ళు. ఏవైనా సరే, తెగగొట్టు కోవాల్సిందే! సంకెళ్ళు కాని సంకెళ్ళు –

బాబూజీతో, వారి ఆ అనంతశక్తితో వేసుకోవాలి) కనుక మనం శరీరం వదలి వెళ్ళాక కూడా అవి మనల్ని అంటి ఉంటాయి. మళ్ళీ జన్మ ఎత్తి వానిని అనుభవించితేనే గాని అవి తొలగిపోవు. అందుకనే సంపూర్ణ సంస్కార రహితమైతేనే గాని ముక్తి లభించదని అన్నారు బాబూజీ. మనకు తీవ్రంగా కష్టమనిపిస్తే ఇంతకంటే నరకం మేలు అనుకుంటాము, బాగా సుఖానుభూతి కలిగితే దానిని స్వర్గం అనుకుంటాము. ఇది ఒక విధమైన భావ ఆవరణ ప్రభావం. మన భావాలు స్పందిస్తాయి. అందుచేత మనం దైవాలోచనలో ఉండి, సాధన చేస్తూ ఉంటే, దైవ ఆవరణలో ఉండటం వలన ఇవేమీ అంటవు. బాబూజీతో మనం సంబంధం కలిగి ఉన్నామనుకుంటే మనకు రక్షణ కలుగుతుంది. మనం చేసే కర్మల ఫలితమే నరకం, స్వర్గంలాగ అనుభూతి కలిగిస్తాయి. వీటి అన్నిటికీ మూలం మైండ్ (మనస్సు). అది మంచి పని చేయమని ఆదేశిస్తే అది స్వర్గమవుతుంది. అదే చెడ్డపని చేయమని చెప్పితే ఆ జీవితం నరకానికి దారి తీస్తుంది. కనుక దివ్య మూర్తితో (డివైన్ పర్సనాలిటి) మనకు సంబంధం ఉన్నదనుకుంటే మనం ఎక్కడికి వెళ్ళినా అవి ఏమీ మనల్ని ప్రభావితం చేయలేవు. సుఖదుఃఖాల భావం తొలిగిపోయి దైవభావమే నిండి ఉంటుంది.

ఈ యుగ ప్రవర్తన చాలా మారిపోయింది. దీనిని మార్చటానికి (యుగపరివర్తనం చేయటానికే) 'వారు' వచ్చారు. ఇది ఎలా నడుస్తుందో, ఏమి జరుగుతూ ఉందో 'వారు' గమనిస్తూనే ఉన్నారు. ఉన్నట్లుండి ఏదో ఒక రోజున ఇదంతా మార్పు చెందుతుంది. 'వారు' ఈ మార్పు అనగా యుగపరివర్తన చేయటానికే వచ్చారు కనుక అది జరిగి తీరుతుంది. మనం విశ్వసిద్దాం.

ఒక అభ్యాసి, బాబూజీ – షాజహాన్‌పూర్ నుంచి సమస్త ప్రపంచానికి వెలుగు ప్రసరిస్తోంది అని అన్నారు. కనుక మన అభ్యాసులు అక్కడికి వెళ్ళుతున్నారు అన్నదానికి సిస్టర్‌గారు ఇలా స్పందించారు:

షాజహాన్‌పూర్ అనేది ఒక పట్టణం అని మనం అనుకుంటాం. కాని దాని అంతరార్థం ఇది. 'షా' అనగా రాజు, సమ్రాట్ అని అర్థం. 'జహా' అనగా ప్రపంచం. అనగా సమస్త విశ్వానికి అది మకుటం. (అనగా రాజధాని నుంచి రాజ్యాధికారం చలాయించ బడుతున్నట్లుగానే ఆధ్యాత్మిక రాజధానిగా అక్కడి నుంచి ఆధ్యాత్మికత ప్రసరిస్తున్నట్లుగా భావించుకోవచ్చు). 'వారి' ప్రతి మాటలోనూ ఇలాంటి భావార్థం ఉంటుంది.

కొన్ని అసంబద్ధమైన పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. ఈ విషయాలన్నిటికీ నేను బాధపడను. కాని అభ్యాసులు, ఎవ్వరు మాస్టర్, ఎవ్వరిని అనుసరించాలి అని సందిగ్ధంలో పడి తల్లడిల్లుతున్నారు. కనుక వారిని గురించి బాధపడుతున్నాను. లాలాజీ సాహెబ్ బాబూజీని అంతిమం నుంచి రప్పించారు. నూతన యుగ నిర్మాణం కోసం వారు తమ సర్వస్వం సమర్పించారు మానవాళికి. అటువంటి వారిని, లేరని భావించటం ఎలా సాధ్యం. చాలా చిత్రాలు జరుగుతున్నాయి. ఎప్పుడో ఒకప్పుడు ఈ యుగం పరివర్తనం చెందక మానదు.

బాబూజీ ప్రిసెప్టర్స్‌ను కూడా యోగ్యత పెంచుకోమన్నారు. పూజారి యోగ్యుడు కాకుండా పూజకు ఎలా అర్హుడు? ప్రిసెప్టర్ కూడా యోగ్యుడు కాకపోతే అతడు పొందగల్గినదీ మనకు ఇవ్వగల్గినదీ ఏదీ ఉండదు.

వారు పాడిన పాటకు అర్థం: మీరు ఒక నిర్ణీత స్థానానికి (ఆధ్యాత్మికత యొక్క అనంత యాత్రలో గమ్యం అని అర్థం) (మంజిల్) వెళ్ళాలనుకుంటారు. ప్రయాణానికి టిక్కెట్ కొనుక్కొని బండిలో ప్రయాణించి కొన్ని గంటలు లేటుగానయినా వెళ్ళవలసిన చోటుకు వెళ్ళతారు. దారిలో ఎన్ని మార్గాలు ఉన్నాయో మీకు తెలియదు. అటు తిరిగి ఇటు తిరిగి ఎన్నో మార్గాల గుండా ప్రయాణిస్తారు. ఈ ప్రయాణంలో ఎన్నో అనుభూతులు కలుగుతాయి. బాబూజీ దీనినే వర్ణిస్తూ శరీరానికి మరణం ఒక్కసారే ఉంటుంది. కాని సహజమార్గ విధానంలో, సాధనలో ఎన్నిసార్లు మరణించవలసి ఉంటుందో తెలియదు. ఒక్కొక్క ప్రాంతంలో ఒక్కొక్క అనుభవం కలుగుతుంది. పిండ దేశంలో ప్రవేశించాక బాహ్యావరణలు అనగా శరీరం యొక్క సంబంధం ఉండదు. అనగా ఇదొక మరణం వంటిది. సూక్ష్మ దేహం కరిగిపోతుంది. ఆ తర్వాత కారణ శరీరం తొలగిపోతుంది. ఆత్మ, బంధనాలన్నీ తెంచుకొని పరమాత్మలో కలిసిపోతుంది. ఆ విధంగా ఎన్నో సార్లు జీవించి, మరణించాక ఆత్మ అమరమవుతుంది. ఒక నిశ్చల స్థితి కలుగుతుంది. ఆ తర్వాత ఇంక మరణం ఉండదు. ఇలా ఎన్నో జీవన్మరణాలు ఉంటాయి. మనం ఎవ్వరి కోసమైతే చూడాలి చూడాలి అని తపన చెందుతామో అక్కడికి చేరేసరికి శరీరం తనను వదలి వెళ్ళినందుకు అక్కడ రోదిస్తూ ఉన్నట్లు ఉంటుంది. తన శరీరంలోని ప్రతి అంగాంగములోను 'వారి' రూపమే ఉన్నట్లు తోస్తుంది. అనగా అహం నశింపవుతుంది. అప్పుడు నా విస్మృతి స్థితిలో నేను 'వారి' ఎదుటనే ఉన్న సంగతి మర్చిపోయాను. నేను క్రమంగా వారిలో లీనమవుతున్నట్లు గ్రహించాను. 'వారు' మనకు లక్ష్యం నిర్ణయించి దానిని సాధించడానికి అవసరమైన మార్గాలన్నీ చూపారు.

**ప్రశ్న: బాబూజీ పుస్తకాల్లో మహా పార్షద్ కండిషన్ అన్నారు. డివైన్ పర్సనాలిటీ ఏ వెయ్యి సంవత్సరాలకో గాని రాదన్నారు. లాలాజీ సాహెబ్ చెప్పింది ఆ పర్సనాలిటీ బాబూజీనా?**

**జవాబు:** భేదం ఉంది. బాబూజీకి, వెయ్యి సంవత్సరాల తర్వాత వచ్చే డివైన్ పర్సనాలిటీకి తేడా ఉంది. ఆ పర్సనాలిటీ ఒక అవతారం వంటిది. ఆ చెప్పింది బాబూజీ గురించి కాదు. ఎవ్వరో అన్నారు – వేయి సంవత్సరాల తర్వాత ఈ యుగాన్ని మార్చటానికి నీవు రావాలి – అని, వేయి సంవత్సరాల తర్వాత యుగాన్ని మార్పు చేయాలని అనుకున్నప్పుడు. అప్పుడు వచ్చేది వారు మార్పు చేయాలనుకున్న యుగం.

మీరట్ వెళ్ళాం. బాబూజీ ఉపన్యసించారు. పార్షద్, మహా పార్షద్ కండిషన్స్ గురించి చెప్పారు. మహా పార్షద్ అంటే 'నేను' అన్నారు బాబూజీ. అప్పుడు మహా పార్షద్ స్థితిలో ఎవ్వరు ఉంటారు అని నన్ను అడిగారు చారీజీ. బాబూజీ ఉండగా నన్ను అడుగుతారేమిటి అన్నాను. బాబూజీని అడిగారు. బాబూజీ – మహా పార్షద్ నేనే, నన్ను గురించి నేను ఏమి చెప్పను? అన్నారు. స్థితుల గురించి అవగాహన ఇలా ఉంటుంది.

సత్యపథ్ చేరాక పార్షద్ స్థితి వస్తుంది. దీని నుండి సెంట్రల్ రీజియన్‌కు ప్రవేశం కలుగుతుంది. ఈ సెంట్రల్ రీజియన్ నుండే భూమాలోకి ప్రవేశం లభిస్తుంది. ఇలా ఒక్కటిగా అవడం చాలా కష్టం. దీని తర్వాతనే భూమా. దానికే ఆయన అన్నారు – ఏడు మహాద్వారాలు (సెవెన్ రింగ్స్) దాటి అక్కడకు వచ్చాను, అని. మహా పార్షద్ ఏమిటో చెప్పారు, చిత్రంలో చూపించారు. అయినా మహా పార్షద్ ఏమిటో నన్ను అడుగుతున్నారు.

మన లక్ష్యం అల్టిమేట్ (అంతిమం). అక్కడకు తీసుకుని వెళ్ళటానికి 'వారు' ఉద్యమించి ఉన్నారు. ఇవి అన్నీ వారి పరిశోధనలు. ఈ కండిషన్స్, పార్షద్, మహా పార్షద్ ఇవన్నీ మనకు తెలుసుకోవటం ముఖ్యం కాదు. ఎందుకంటే తీసుకుని వెళ్ళేవారైన బాబూజీకి, ఎటు తీసుకుని వెళ్ళాలో, ఎలా తీసుకుని వెళ్ళతారో వారి నిర్ణయానికి వదిలేసి వారి వెంటపడిపోతే మన గమ్యం చేరతాము. వారిలో ఐక్యమైపోతాం.

ఆ సెంటర్‌లో అలా ఉంది. ఈ సెంటర్‌లో ఇలా ఉంది అనే విషయాల మీద ఆసక్తి చూపకుండా అసలైన విషయం మన లక్ష్యం గురించే శ్రద్ధ వహించటం మంచిది.

ఎప్పుడైనా సరే, 'ఐ' అనగా అహంకు చెందిన చర్చలు వదిలిపెట్టాలి. బయటి విషయాలు అనగా ప్రాపంచిక విషయాలు మాట్లాడుకోకుండా, మీలో మీరు ఆధ్యాత్మిక విషయాలు మాట్లాడుకుంటే మంచిది. మేము కూడా బాబూజీ గదిలో కూర్చున్నప్పుడు వారిని గురించే మాట్లాడుకునేవాళ్ళం. నా భావం, వీరు బాబూజీ మనుషులు, వారు వేరే వారి మనుషులు అని చెప్పటం కాదు, ఎవ్వరైనా సరే. నేను అందరిపట్ల సమభావం, సదభిప్రాయంతోనే ఉన్నాను.

మనం ఎంతగా చర్చించుకొన్నా బాబూజీని గురించి చాలా తక్కువగా తెలుసుకున్నట్లే! ఒకసారి మహేష్ యోగి శిష్యుడు ఒకాయన వచ్చారు. మన మిషన్‌లో చేరాడు. అతగాడు ఆ తర్వాత మహేష్ యోగి గురించి విమర్శించడం గమనించిన బాబూజీ వారించి "చూడు! ఆ మహేష్ యోగి కారణంగానే ఈ సంస్థలో చేరావు. రాగలిగావు తెలుసా!" అన్నారు. దీనిని బట్టి ఇతర

సంస్థలపట్ల అమర్యాద పూర్వకంగా గాకుండా సహనం వహించాలనే గుణపాఠం నేర్చుకున్నాము.

మన మిషన్‌పట్ల మనకు గౌరవం ఉండాలి. ఇతరులు, ఉన్నతమైన ఆలోచనలు ఉన్నవారు ఏదైనా వ్రాస్తే అందులో మంచిని మనం గౌరవించాలి. సదభిప్రాయంతో ఉండాలే కాని తిరస్కరించకూడదు. ఎవ్వరైనా తమ అనుభవాన్ని పురస్కరించుకొని మంచి విషయాలు వ్రాస్తే ఇతరులు కూడా లాభిస్తారు. అభ్యాసులు గాని, మరెవ్వరైనా గాని ఇతరులను గౌరవించటం కనీస ధర్మంగా భావించాలి.

ఒకసారి బాబూజీ ప్రక్కన కూర్చున్న వేరే సంస్థకు చెందిన వారు ఒకరు మన సిస్టంకు వ్యతిరేకంగా మాట్లాడుతూ ఉంటే, బాబూజీ మహరాజ్ గురుభాయి (సోదర అభ్యాసి), లాలాజీ సాహెబ్ సోదరుడు అయిన పాపాజీ అది సహించలేక అక్కడ నుంచి బయటకు వెళ్ళాక ఆ వ్యక్తిని కొట్టాలనుకున్నారు. అది గ్రహించిన బాబూజీ, అలా విమర్శించిన వ్యక్తిని వాహనంలో తీసుకొని వెళ్ళి ఇంటి వద్ద దిగబెట్టి రమ్మని తన గురుభాయిని ఆదేశించారు. బాబూజీ మాట మన్నించి అలా చేశారే కాని తన కోపాన్ని వెళ్ళగ్రక్కుతూ బాబూజీతో, నేను అతడ్ని శిక్షించాలనుకుంటే మీరు అతనికి రక్షణ కల్పించారు అంటూ ఆవేదన తెలిపాడు. ఆ విధంగా బాబూజీ మన దురాలోచన నుండి కూడా రక్షిస్తారు. సహనశీలానికి, సన్మార్గాచరణకు ఇది ఒక ఉదాహరణ. బాబూజీకి మనల్ని మనం అర్పించుకొంటే చెడుదారి పట్టకుండా మనల్ని తమ కృపాహస్తంతో, అభయహస్తంతో రక్షిస్తారు.

**ప్రశ్న: ధ్యానంలో సెన్సిటివ్ అయి ఏడ్చేస్తాను. అప్పుడప్పుడు కన్నీరు ఉబుకుతుంది. అది ఏదైనా స్థితియా?**

**జవాబు:** అది ఒక ఫీలింగ్. హృదయం ఉద్వేగం చెందటం వలన అలా వస్తుంది. దానినే బాబూజీ ఇలా చెప్పారు– బాల్యావస్థలో మనిషి ఏడుస్తాడు. పసితనంలో కావలసింది ఏడ్పు ద్వారా సాధించుకుంటాడు. పెద్దవాడు అయ్యాక ఏడ్వడు. కావాలని డిమాండ్ చేస్తాడు. అదే విధంగా ఏడ్పు మానేసి, ఆధ్యాత్మికంగా కోరుకున్న దాని కోసం డిమాండ్ చేయాలి. అప్పుడు ఏడ్పులో ఆనందం ఉంటుంది. ప్రేమ భావంలో కూడా ఆనందభాష్పాలు వస్తాయి. అంతరంగంలోని తపన, ప్రేమను ఆ లోపలే జీర్ణించుకోవాలి (ఇముడ్చుకోవాలి). అందరూ ఉద్వేగంతో ఇలా ఏడుస్తుంటే, ఈ సంస్థలో అంతా ఇలా ఏడుస్తారు ఎందుకు, అని అనుకుంటారు.

ఒక ఆమె బాబూజీ మహరాజ్ ఎదుట కూర్చొని ఏడుస్తూ ఉండేది. అప్పుడు బాబూజీ మహరాజ్, “నీవు ఎందుకు ఏడుస్తున్నావు. నా ముందు ఏడుస్తుంటే నాకు ఏడ్పు రావటం లేదు, నీవు ఏడుస్తున్నట్లు అనిపించటం లేదే!” అని అన్నారు. బాబూజీ ప్రాక్టికల్‌గా తెలియజెప్పటంలో చాలా నేర్పరి. అలాగే ఏదైనా విషయాన్ని అమలు చేయటంలో కూడా చాలా దృఢ వైఖరితో ఉండేవారు.

మనలో సమర్పణ భావం ఉంటే వారిలో మన కోరిక ప్రతిఫలిస్తుంది. నా స్వానుభవంలో ఇలా జరిగింది: బాబూజీ మహరాజ్ వారి ఇంటికి వెళ్ళినప్పుడు కొద్ది రోజులు ఉండి, వెళ్ళిపోవలసి వచ్చేది. బాబూజీ ఉండమంటే ఇంకా రెండు రోజులు ఉంటే బాగుండుననిపించేది. కాని బాబూజీ మొదట నిర్ణయించుకున్న ప్రయాణం ప్రకారం వాహనం సిద్ధం చేసి బయలుదేరమనేవారు. కాని వారు ఉండమని అనకుండా ఎలా ఉండడమా అని బయలు

దేరేదాన్ని. ఆ దశ దాటాక బాబూజీ వారి ఇంటికి తిరిగి వెళ్ళినప్పుడు నా మనస్సులో ఉండాలనే కోరిక లేనప్పటికీ ఇంకా రెండు రోజులు ఉండాలనుకుంటే ఉండవచ్చు అన్నారు. మన కోరిక కూడా వారికి అర్పించుకుంటే ఆప్యాయతతో కోరికనూ స్వీకరిస్తారు. ఆ విధంగా మన కోరికలూ నెరవేరతాయి.

నేను ఏదైనా మాట్లాడినా, ఏదైనా వ్రాసినా కొంతమంది వ్యతిరేకించేవారు. ఈ విషయంలో బాబూజీకి కోపం వచ్చేది. కాని అలా విమర్శించేవారే తాము ఏదైనా ప్రసంగించేటప్పుడు గాని, వ్రాసేటప్పుడుగాని నేను ప్రస్తావించిన విషయాలనే ప్రత్యక్షంగా గాని, పరోక్షంగా గాని ఉదహరించేవారు. దీనిని బట్టి వాస్తవం వెల్లడి కాక మానదు (Reality speaks) అని గ్రహించాలి.

శశిధావన్ వ్యాసం గాని, పుస్తకం గాని ఏది వ్రాసినా ఎక్కడో అక్కడ నా ప్రస్తావన లేకుండా ఉండదు. ఒకసారి శశిధావన్ కోపగించుకున్నప్పుడు "బాబూజీ సిస్టర్‌ని పంపి సముదాయించి తీసుకొని రమ్మన్నారు" అని తన పుస్తకంలో వ్రాశారు. వాస్తవమే ఇది. మిశ్రాగారు మిషన్‌లో, దానిని స్థాపించినప్పటి నుండి కార్యదర్శిగా శ్రద్ధగా పనిచేశారు. వృద్ధాప్యం వలన అనారోగ్య కారణంగా తాను ఇంక పనిచేయలేనని, ఆ స్థానంలో మరొకరిని నియమించమని కోరారు. అప్పుడు బాబూజీ నీవు లేకపోతే ఎలా, నీ వంటి వాళ్ళు నాకు ఎవ్వరు దొరుకుతారు అన్నారు. వారి మీద ఉన్న అభిమానం కొద్దీ బాబూజీయే వారి ఇంటికి వెళ్ళి పరామర్శించేవారు. నిజాయితీతో నిస్వార్థ సేవ చేసేవారు గుర్తించబడతారు అనటానికి ఇది ఒక నిదర్శనం. అదే విధంగా వారి దివ్య ప్రేమకు కూడా నిదర్శనం.

ఒకసారి బాబూజీ ఢిల్లీ వెళ్ళిన సందర్భంలో ఒకామె (శ్రీమతి సుందర) వారిని ద్రాక్షపండ్లు తినమని వారి ముందు ఉంచింది. ఇంకా మరి కొందరు కూడా ఉన్నప్పుడు ఆమె వారికి మాత్రమే అ పండ్లు ఇచ్చి 'మీ కోసమే' అంది. అప్పుడు బాబూజీ, "నాకు ద్రాక్షపండ్లు ఇష్టం ఉండవు. నేను తినను" అనగానే ఆమె వాటిని వెనక్కు తీసుకుని వెళ్ళిపోయింది. ఇంతలో మరొకామె ద్రాక్షపండ్లు తీసుకుని వచ్చి వారి ముందు ఉంచుతూ "బాబూజీ! ఇవి అందరి కోసం తెచ్చాను తీసుకోండి" అని చెప్పింది. అప్పుడు బాబూజీ ఇవి నాకు నచ్చాయి. నీవు తెచ్చినందుకు సంతోషం, అని తాను తీసుకుని అందరికీ పంచారు. ఇందులోని అంతరార్థం ఏమిటంటే, ఆధ్యాత్మిక సత్సంగంలోని వారినందరినీ ఒకే పరివారం అనగా ఒకే కుటుంబ సభ్యులుగా భావించి సమదృష్టితో గౌరవించాలి. అంతేగాని పది మంది ఉన్నప్పుడు ఒకరిని గౌరవించి మరొకరిని గౌరవించక పోవటం సహజమార్గ అభ్యాసులకే కాదు సామాజికంగా కూడా ఎవ్వరికీ మంచి పద్ధతి కాదు.

బాబూజీ మహరాజ్ అభ్యాసిలో భక్తి, ప్రేమ వృద్ధి చెందాకనే ప్రిసెప్టర్‌గా నియమించేవారు. కాని ఇప్పుడు ప్రిసెప్టర్‌గా నియమించబడే వారిలో భక్తి ప్రేమలు అభివృద్ధి చెందలేదు. అలా చేస్తే ఫలితం ఏమి ఉంటుంది? అతడే పొందలేని దివ్యత్వాన్ని అభ్యాసులకు ఏమి అందిస్తాడు. అదేమంటే, యువతను ఆహ్వానించాలి అంటారు. ఏదైనా కంపెనీకి రిప్రజెంటేటివ్ కావాలని ప్రకటిస్తే అనుభవం ఉన్న వారు కావాలంటారు. దివ్యానుభవం లేనిదే ప్రిసెప్టర్ ఎలా యోగ్యుడౌతాడు. అదేమంటే మాస్టర్ తింటున్నారు, త్రాగుతున్నారు, చేస్తున్నారు, ధ్యానంలో ఉన్నారు అని మాస్టర్ గురించి చెప్తే సరిపోతుందా? నిజమైన ప్రేమ ఏది?

బాబూజీ మహరాజ్ చెప్పేవారు – ధ్యానంలో వచ్చే ప్రాణాహుతిని, దివ్యత్వాన్ని జీర్ణించుకోవాలి గాని బాబూజీ ఇస్తున్నారు, చేస్తున్నారు అనుకుంటే నీకు ఏమి వస్తుంది. నేను రొట్టె తింటూ ఉంటే నీకు రుచి తెలుస్తుందా? కాబట్టి నీవు భావం గ్రహించుకోవాలి అనేవారు.

హైదరాబాద్‌లో ఫంక్షన్ జరిగింది. డొనేషన్స్ వస్తాయని ఆశించారు. రాకపోయేసరికి బాబూజీని స్మరించి, డొనేషన్లు రావటం లేదు, అవి లేకపోతే ఫంక్షన్ జరగదు అనుకున్నారు. తర్వాత ఏడు లక్షల రూపాయలు డొనేషన్స్ రూపంలో అందాయి. ఫంక్షన్ బాగా జరిగింది. అంతా అయ్యాక లెక్కలు చూపిస్తూ ఏడు లక్షల రూపాయిలు తరుగయ్యింది అన్నారు. ఏడు లక్షల రూపాయలు తరుగైతే (deficit) ఫంక్షన్‌కి డబ్బు ఎలా వచ్చింది? బాబూజీ, మిషన్‌లో రెండు రూపాయలకు కూడా రసీదు ఇచ్చేవారు. అలాంటి ఆచరణ జరగటం లేదు. ఇటువంటి పద్ధతులు జరుగుతూ ఉంటే ఆధ్యాత్మికత ఎక్కడి నుండి వస్తుంది. బాబూజీ మహరాజ్ చారీజీతో ప్రత్యక్షంగా చెప్పారు – ఏ మిషన్‌లో అయితే డబ్బు గుంజబడుతుందో అక్కడ ఆధ్యాత్మికత ఉండదు అని. నేను వారికి, మీరు సంస్థకు బాధ్యులు కనుక మిషన్ యొక్క ఆస్తి వివరాలు చెప్పండి అని వ్రాశాను. మనుషులు అనుకుంటారు తాము ఏమి చేసినా ఏమీ కాదు అని. ఆ సొమ్మును అనుభవిస్తూ ఉంటారు. ఎవ్వరైనా లెక్కల్లో నలభై రూపాయలు తప్పు చెపితే దండిస్తారు.

నేను వారికి వ్రాశాను. ఏ ప్రిసెప్టర్ ఫంక్షన్‌కు రాకపోతే వారి పవర్ తీసేస్తామంటున్నారు. ఏ అభ్యాసి రాకపోతే అతడ్ని సంస్థ నుంచి తీసేస్తామంటున్నారు. ఇలా సర్క్యులర్స్ జారీ చేస్తున్నారు. ఇదేమిటి? అని.

బాబూజీ మహరాజ్, "నాది తీసుకొనగలవారికి నేను ఇవ్వటానికే వచ్చాను గాని తీసుకోవటానికి రాలేదు" అని స్వయంగా చెప్పారు. ఒక ప్రిసెప్టర్, అభ్యాసితో నీ పవర్ తీసేస్తాను అన్నప్పుడు బాబూజీ అన్నారు, "నీవు తీసివేస్తే అభ్యాసికి పవర్ రాదా" అని ప్రశ్నించారు. బాబూజీ ఫంక్షన్ ఉంటే ఎవ్వరికి వారు తోచింది ఇస్తారు. కాని బలవంతం పెట్టరు. శ్రీరామచంద్ర మిషన్ స్థాపించటంలో రెండు ఉద్దేశ్యాలు ఉన్నాయి. అందులో మొదటిది – దాని ద్వారా మానవమాత్రులను ఆధ్యాత్మికంగా ఉద్ధరించటం కోసం. మానవ మాత్రులందరినీ అనంతంవైపు తీసుకొని వెళ్ళుతున్న సహజమార్గ నిర్మాత బాబూజీ గురించి మాట్లాడుకొనకపోతే, వారి గురించిన విషయాలు చర్చించుకొని అవగాహన చేసుకోకపోతే 'అసలు' పొందేది ఎలా. అందుచేత 'వారి' గురించిన విషయాలే 'మిషన్'కు ప్రాణం. ఎవ్వరూ భయపడనవసరం లేదు. ఇది వారి మిషన్ కాదు, మన మిషన్. మన మిషన్‌కు ప్రాణం బాబూజీ. రామేశ్వరం, కన్యాకుమారి, మధుర, బెంగుళూరు ఆశ్రమాలకు వెళ్ళినప్పుడు, బాబూజీని గురించి చర్చించినప్పుడు వారికి శ్రద్ధగా వినాలనిపించింది. ఆనందం పొందారు. అభ్యాసీలను అదరగొట్టి బాబూజీ గురించి చెప్పకపోతే వారికి ఎలా తెలుస్తుంది.

అదే విధంగా బాబూజీ ఎప్పుడూ కూడా లాలాజీ సాహెబ్ గురించి చెప్తూ ఉండకపోతే లాలాజీ సాహెబ్ గురించి ఎవ్వరికి ఎలా తెలుస్తుంది! కాని భయపెడ్తున్నందు వలన చాలామంది తప్పుకుంటున్నారు. మిషన్ వారెవరిదో అనుకోకుండా మన మిషన్ అనుకొని చేరాలి. మిషన్‌లో క్రొత్తవాళ్ళు ఎక్కువగా ప్రవేశిస్తున్నారు. వాళ్ళ మూలంగా మిషన్‌లో లోపాలు కనిపిస్తున్నాయి అని మీరు అంటున్నారు. నేను వెళ్ళిన చోటల్లా క్రొత్త వాళ్ళు అధిక సంఖ్యలో

ఉన్నారు. పాతవాళ్ళు, సీనియర్స్ కూడా ఉన్నారు. క్రొత్త తరం వాళ్ళు నోటితో ఎవ్వరిని ఉచ్ఛరించినా దివ్య ప్రాణాహుతి 'మూలం' నుండే వస్తూందని గ్రహించాలి. ఇదీ మరియు బాబూజీ గురించి పాత తరం వాళ్ళు, సీనియర్స్ చెప్పక పోవడం పెద్ద తప్పు. పాతవాళ్ళే ఇలా ఎక్కువ తప్పులు చేస్తున్నారు. వారు బాబూజీ గురించి క్రొత్తవారికి చెప్తే వారికి తెలుస్తుంది. పాతవారి మీద క్రొత్తవారికి విశ్వాసం ఉంది. మిషన్ యొక్క లైఫ్ (జీవం) బాబూజీ. క్రొత్తవారి వలన ఈ మిషన్ కలుషితం అవుతోందని అనుకోకూడదు.

బాబూజీ నన్ను ప్రిసెప్టర్‌గా తయారుచేశారు. అభ్యాసుల్లో దైవభక్తి, ప్రేమ, ధ్యానం కలిగించమన్నారు. అభ్యాసి ప్రాణాహుతిని పొంది దివ్యత్వం చెందాలి. ప్రిసెప్టర్ తానుగా దివ్యునిగా తయారు చేయలేడు. అందుకని భయంతో తికమక పెట్టే కంటే ప్రేమతో నేర్పాలి. పిల్లలకు కూడా శిక్షణ ఇచ్చేటప్పుడు తప్పు చేస్తే, భగవంతుడు శిక్షిస్తాడని, అలా జరుగుతుంది, ఇలా జరుగుతుందని భయపెట్టకూడదు. అలా వ్యతిరేక భావంతో కాకుండా మంచి భావంతో అనగా అనుకూల భావంతో భగవంతుని ప్రార్థించమని, మంచి జరుగుతుందని, మంచి శక్తి వస్తుందని బోధించాలి. అలా కాకుండా దేవుడ్ని భూతంగా వర్ణిస్తే అలా వాళ్ళు దేవుడినే మర్చిపోతారు. బాబూజీ ఎప్పుడూ అనేవారు, "జనానికి నేనంటే భయం లేదు. నేను ఒక చీమలాంటి వాడిని. నాపైన కాలు వేసి త్రొక్కేయవచ్చు కాని, నేను కుట్టను. కుట్టడానికి నేను తేలును కాను. నేను జనం తరించడానికి మార్గం చూపుతున్నాను" అని.

బాబూజీ తమ పని పవర్ ఇవ్వటమే గాని, తీసుకోవటం కాదు అన్నారు. అలాగే "నేను ఎవ్వరిలోనూ లోపాలు చూడటానికి

రాలేదు, మంచి చేయటానికి మంచి చూడటానికే వచ్చాను. లాలాజీ నన్ను చెడును పరిశీలించే దృక్పథంతో తీసుకొని రాలేదు. నా పని నిర్మాణాత్మకమే గాని వినాశకారకం కాదు" అని చెప్పారు. అందుకనే ఇప్పటి వరకు ఇంత జరుగుతున్నా స్పందించలేదు. బాబూజీకి ఇది అంతా తెలియని విషయం కాదు. అయితే తనను తీర్చి దిద్దన వారినే జ్ఞాపకం ఉంచుకోకపోతే ఎలా ఉంటుంది. బాబూజీ తనకు చెడు దృక్పథం లేదని చెప్తూతూ ఇలా అన్నారు: "ఒకవేళ గురువుకు తన శిష్యునిపై ఎటువంటి చెడు భావం కలిగినా అటువంటి వారు గురువే కాదు" అని. అటువంటి గురువును కూడా మర్చిపోవటమంటే ఏమనాలి. ఏది ఏమైనా ఈ యుగం తప్పక మారుతుంది. అది ఇష్టం ఉన్నా లేకపోయినా సరే.

ఇటువంటి లోపాలను గురించి ఆలోచించటం వారి సంకల్పంలో లేని విషయం. ఎందుకంటే, "సిట్టింగ్‌లో కూడా నేను అభ్యాసీ లోపాలను ఖాతరు చెయ్యను" అని బాబూజీ స్వయంగా చెప్పారు.

నేను బాబూజీ మహరాజ్‌కు ఇలా వ్రాశాను, "మీరు నాకు ఇచ్చే ట్రాన్స్‌మిషన్ వలన, మీ కృప వలన నాకు ఆధ్యాత్మికంగా పురోగతి లభిస్తోంది. నా ప్రగతికి మీరే కర్తలు" అని. దానికి సమాధానంగా, "నేను ఇవ్వడానికే వచ్చాను. నేను వచ్చిన పనిని పూర్తి చేయాల్సిన బాధ్యత ఉంది. దానికి తోడు నీ సహకారం, వినయ విధేయతలు, నీలో భక్తి ప్రపత్తులు పెరగటానికి తోడ్పడ్డాయి. అందుకు నీకు ధన్యవాదాలు" అని బాబూజీ వ్రాశారు. ఇది అంతా వారి ఘనత వలన జరిగినా 'వారు' దానిని లాలాజీ సాహెబ్ యొక్క ఘనతగా చెప్పేవారు.

బాబూజీ తమ రచనల్లో లాలాజీ సాహెబ్ తనను ఎలా అదేశించేవారో వ్రాశారు – ఎప్పుడు వెళ్ళాలి, ఎక్కడకు వెళ్ళాలి, ఏమి చెయ్యాలి, ఎక్కడ బస చెయ్యాలి, ఏమి తినాలి, ఏమి త్రాగాలి, ఆరోగ్యం ఎలా కాపాడుకోవాలి అని. ఇవి అన్నీ వారే చెప్పే వారని బాబూజీ తమ గురువుగారిని జ్ఞాపకం చేసుకుంటూ ఉండేవారు. అదే విధంగా బాబూజీ 'వీరికి' చేయటం లేదనుకోవటానికి ఒక కారణం ఉంది. బాబూజీ చెప్తూ ఉండేవారు – సలహా అడగకుండా ఎవ్వరికైనా సలహాలు ఇవ్వవద్దని. ఏదైనా స్వీకరించే వారికే వస్తాయి. సంబంధము తెంచుకున్న వారికి ఎలా వస్తాయి. సంకేతాలు వినాలంటే రిసీవర్ ఉండాలి. రిసీవర్ కనక్షన్ తీసివేస్తే సంకేతాలు ఎలా వస్తాయి?

లాలాజీ సాహెబ్ పట్ల భక్తి శ్రద్ధలు, ప్రేమ కలిగి ఉండేవారు బాబూజీ. దానికి తగ్గట్లుగానే బాబూజీకి లాలాజీ రక్షణ కలిపిస్తూ ఉండేవారు. అదే విధంగా మన మాస్టర్జీ బాబూజీ పట్ల మనం ప్రేమ కలిగి ఉండాలి. ఆ రక్షణకు ఒక ఉదాహరణగా చెప్పాలంటే బాబూజీతో మేము ప్రొద్దుపోయాక చర్చించుకుంటూ ఉండగా లాలాజీ, బాబూజీతో వారి ఇంట్లో దొంగలు పడబోతున్నట్లు హెచ్చరించి జాగ్రత్తపడమని సలహా ఇచ్చిన సందర్భం ఉంది.

పై నుంచి ప్రవాహం వస్తూ ఉంటుంది. దానిని స్వీకరించాలి. అలా చేయకపోతే దాని పద్ధతిలో అది కొనసాగుతూనే ఉంటుంది. ఉదాహరణకు గంగాజలము ధారగా పడుతోందనుకోండి. దాని క్రింద మీరు స్నానం చేస్తే బాగుంటుంది. అలా మీరు స్నానం చేయనంత మాత్రాన దాని ప్రవాహం నిలిచిపోదు. అది వాతావరణంలో కలిసిపోతుంది.

Die Your self అనగా 'నీవు' చచ్చిపోవాలి. అనగా నిన్ను నీవు మర్చిపో అంటే అహంకారం త్యజించమని అర్థం. తాను ఎవ్వరి గురించి చెప్పవలసి ఉందో వారి గురించి చెప్పవలసి ఉంటుంది గాని తనను గురించి కాదు. కనుక 'తన' కు ప్రాతినిధ్యం లేదు.

బాబూజీ మహరాజ్ ఎంత ఇవ్వాలో అంత ఇచ్చారు. సమస్త ప్రపంచం అంతటా అది వ్యాపించి ఉంది. మన మిషన్ సమస్త ప్రపంచానికి చెందింది. ఇందులో కొంత మంది మంచి వారు ఉన్నారు. కొంత మంది కానివారు ఉన్నారు. అందరూ కూడా దానిని ఆమోదించి సక్రమంగా మారి పోవల్సిందే.

బాబూజీతో మనం బంధం ఏర్పరచుకొని ఉంటే మనం ఎక్కడ ఉన్నా, ఏ పరిస్థితిలో ఉన్నా 'వారి' ఆశీస్సులు మనకు అందుతూ ఉంటాయి. శక్తి, బుద్ధి, భక్తి, ప్రేమ అన్నీ లభిస్తూ ఉంటాయి. బాబూజీకి కూడా మేము బాగా శ్రమిస్తున్నామని అభ్యాసులు సహకరిస్తున్నారని తెలుసు. పిల్లలందరిని ప్రేమతో చూడండి. ప్రేమ అంటే వారిని కొట్టకుండా ఉండటం. అలాగే పిల్లలమైన మనల్ని బాబూజీ కూడా ఎన్నడూ కొట్టలేదు.

కర్త నీవు అయ్యినప్పుడు కష్టాలు ఎదరౌతాయి.

అర్హుడవై కోరిక తలపెట్టు.

నిజమైన అభ్యాసి హృదయతాపం యొక్క వాస్తవమైన వేదన, మాస్టర్‌ను అతని ముంగిట నిలబెడ్తుంది. ఎవ్వరైనా సరే యోగ్యత పొందాలంటే, వారు తమ లక్ష్యమూ, తమ స్థితి యొక్క సరియైన అవగాహనా కలిగి ఉండాలి.

ఎవ్వరైతే తమ హృదయాన్ని అర్పించగల్గుతారో అనగా దానిని డివైన్ మాస్టర్‌కు బహూకరించ గల్గుతారో వారికి ఇంకా మిగిలేది ఏమీ ఉండదు. ఇది స్వతః సిద్ధంగా అతన్ని అనంత సత్యంలో లయ లీనమై పోగల స్థాయికి తీసుకుని రావాలి.

జీవితం యొక్క పరమ లక్ష్యాన్ని సిద్ధింపజేసుకోవటానికి ఈ బుల్లి హృదయానికి సరితూగే నివేదన ఇంకేమి ఉంటుంది!

సాక్షాత్కార దశ అనేది వాస్తవానికి మూగపోయిన దశ వంటిది. అది అనుభవానికి రావలసిందేకాని వర్ణించనలవి కానిది.

ప్రార్థన అనేది యాచన (విన్నపం) అయితే ధ్యానం అనేది పొందటం అవుతుంది.

నిజమైన భక్తి, భౌతికమూ లేదా స్వాభావికమైన కోర్కెలు లేనిదై ఉంటుంది. అది హృదయ పూర్వకమైన తపనతో మేల్కొంటుంది. ఆ తపన ఫలించినప్పుడు దాని స్థానంలో మరో దానికి స్థానం లభించకపోగా, తపన లన్నింటికీ ముగింపు కలిగిస్తుంది.

